
'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 265

శుక్రవారం 16-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జనం కోసమే ఆయన శ్వాస, ధ్యాస

పేదరికం శాపం కాదని, కొందరు పాలకుల నిర్లక్ష్యమన్న ప్రజానాయకుడు

ప్రపంచంతో పోటీ పడాలని విద్యకే అత్యధిక ప్రాధాన్యం

సంక్షేమంతో సామాన్యుల జీవితాలను సరిదిద్దుతున్న మహర్షి

భవిష్యత్తు తరాలకు చైతన్యస్ఫూర్తి అభివృద్ధి యజ్ఞానికి ఆదర్శమూర్తి



ఇది నిజం.. ఇదే నిజం...

సంక్షేమ పథకాలు

- వైఎస్ఆర్ కాపునేస్తం
- వైఎస్ఆర్ కళ్యాణకానుక
- వైఎస్ఆర్ కంటివెలుగు
- వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా
- వైఎస్ఆర్ ఆదర్శ పథకం
- వైఎస్ఆర్ ఉచిత విద్యుత్
- జగనన్న వసతి దీవెన
- మన బడి నాడు-నేడు
- వైఎస్ఆర్ నవోదయ పథకం
- వైఎస్ఆర్ రైతన్న నేస్తం
- వైఎస్ఆర్ బీమా
- వైఎస్ఆర్ సున్నావడ్డీ పథకం
- జగనన్న తోడు • జగనన్న చేదోడు
- జగనన్న విద్యా దీవెన
- ప్రవాసాంధ్ర భరోసా బీమా
- మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ
- జగనన్న ఇళ్ళపట్టాల పంపిణీ


బ్యాంకుల వద్ద అప్పుకోసం చేయిచాపకుండా ప్రతి ఏటా రైతుకి రూ.13,500 సేద్యానికి పెట్టుబడిగా ఇస్తున్నారు.


వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలోకి వేలాది వ్యాధులను చేర్పించి, ఒక కోటి 42 లక్షల పేదోళ్ళ కుటుంబాలకు ప్రాణదానం చేస్తున్నారు.


బిడ్డల చదువులు భారం కాకూడదని పేదతల్లికి ప్రతి ఏటా 15,000 రూపాయలు అమ్మఒడికి చేరుస్తున్నారు.


వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత, ఒంటరి మహిళ, డప్పుకళాకారులు, మత్స్య గీతకార్మికులు, కిడ్నీలు- ఎయిడ్స్‌రోగులకు 2,500 నుంచి 10,000 పెన్షన్లు


రాష్ట్రంలో 30 లక్షల 75 వేల మంది మహిళలకు వైఎస్ఆర్ గృహ నిర్మాణ పథకం కింద పక్కా గృహాలను నిర్మిస్తున్నారు.


ప్రతి పేదవాడు ఉన్నత విద్యను చదవాలని రాష్ట్రంలో 16 లక్షల మంది పేద విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నారు.


కరువును జయించాలని పోలవరం, హంద్రీ-నీవా, గాలేరు -నగరి, వెలిగొండ, సుజల స్రవంతి ప్రాజెక్టుల పూర్తికి జలయజ్ఞం చేస్తున్నారు.


బెల్టు షాపులతో చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలను కాపాడటానికి ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం షాపుల నిర్వహిస్తున్నారు.


డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేసి, వడ్డీలేని బ్యాంకు రుణాలను వైఎస్ఆర్ ఆసరాతో స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్నారు.


45 ఏళ్ళు నిండిన ఎస్సీఎస్టీ బిసి మైనారిటీ మహిళలకు వైఎస్ఆర్ చేయూత ద్వారా ప్రతి ఏటా 18,750 రూపాయలు ఇస్తున్నారు.




నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి జిల్లా అధ్యక్షులు


గూడూరు
వెంకటగిరి
శ్రీ కాళహస్తి
తిరుపతి
సత్యవేడు
జగనన్న వెంట నడుద్దాం..
నలుగురినీ నడిపిద్దాం...

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 265
శుక్రవారం 16-12-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



ఫైనల్లో 'ఫ్రెంచ్ కిక్'
ప్రపంచకప్ సెమీస్‌లో మొరాకోపై 2-0 తేడాతో గెలిచిన ఫ్రాన్స్ - 12లో



సూచీలకు 'ఫెడ్' షాక్
సెన్సెక్స్ 879 పాయింట్లు క్రాష్. నిఫ్టీ నష్టం 245 పాయింట్లు - 13లో



'గోద్రా' దోషి ఫరూక్‌కు బెయిల్
గోద్రా రైలు దహనం కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఫరూక్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.
వివరాలు 6లో ▸



జడ్జీల నియామకం ప్రభుత్వ హక్కు
జడ్జీల నియామకంలో ప్రభుత్వం పాత్ర పరిమితంగానే ఉండడం ఏమిటంటూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అసంతృప్తి వ్యక్తం చేశారు.
వివరాలు 6లో ▸



కల్తీ మద్యం తాగితే చచ్చి పోతారు
కల్తీ మద్యం తాగితే ప్రాణాలు కోల్పోతారని బిహార్ ప్రజలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ హెచ్చరించారు.
వివరాలు 6లో ▸



ఈశాన్యంలో వైమానిక విన్యాసాలు
ఈశాన్య ప్రాంతంలో భారత వైమానిక దళం విన్యాసాలు ప్రారంభమయ్యాయి. అత్యాధునిక యుద్ధ విమానాలు పాల్గొంటున్నాయి.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పెద్ద దర్గాలో రజనీకాంత్, ఏఆర్ రెహ్మాన్ ప్రార్థనలు



సూపర్‌స్టార్ రజనీకాంత్, ఆయన కుమార్తె ఐశ్వర్య, సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్, ఆయన ఇద్దరు కుమారులు గురువారం కడప అమీన్‌పీర్ దర్గాకు వచ్చారు. చాదర్ సమర్పించి.. ప్రార్థనలు నిర్వహించారు.
వివరాలు 5 ▸

కడుతున్న ఇళ్లూ కనిపించని కబోదులు



కడుతున్న ఇళ్లు కూడా కనిపించని కబోదులంటూ టీడీపీ అధినేత చంద్రబాబు, 'ఈనాడు' రామోజీపై మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి.. ఇళ్లు కడుతున్నందుకు ఇంత ఏడుపా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.
వివరాలు 3 ▸

ప్రభుత్వ సెలవులు ఇవే



వచ్చే ఏడాది(2023) పండుగలు, పర్వదినాలకు సంబంధించిన సెలవులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఇందులో మొత్తం 23 సాధారణ సెలవులు, 22 ఐచ్ఛిక సెలవులున్నాయి. సాధారణ సెలవుల్లో మూడు ఆదివారాలు, ఒకటి రెండో శనివారం వచ్చాయి.
వివరాలు 10 ▸

బోధనలో నవశకం

రూ.1,400 కోట్లతో 8వ తరగతి పిల్లలకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు

4.60 లక్షల మంది పిల్లలు, 60 వేల మంది టీచర్లకు అందజేసేలా ఏర్పాట్లు

ఈనెల 21న సీఎం చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ

- ఒక్కో ట్యాబ్ రూ.15 వేలపైనే.. రూ.15 వేల విలువైన కంటెంట్
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, బయాలజీ, మేథ్స్, సివిక్స్ సబ్జెక్టుల పాఠాలు
- తెలుగు, ఇంగ్లిష్ సహా ఎనిమిది భాషల్లో అందుబాటులోకి..
- ఇప్పుడు 8వ తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షలను సీబీఎస్‌ఈ విధానంలో రాసేలా తర్ఫీదు
- యానిమేషన్, వీడియో, ఆడియోలతో పాఠ్యాంశాలు
- పిల్లలు తమకు తాముగానే నేర్చుకొనేలా సులభ శైలి
- ఆఫ్‌లైన్‌లోనూ కంటెంట్.. ఇళ్ల వద్ద కూడా చదువుకునే అవకాశం
- ఇప్పటికే 4–10 తరగతులకు అందుబాటులో బైజూస్ యాప్
- జూన్ నుంచి 15 వేల స్కూళ్లలో డిజిటల్ తరగతులతో బోధన


ఎన్టీఆర్ జిల్లా నిడమానూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌ల పనితీరును వివరిస్తున్న టీచర్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో మరో విప్లవాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పాఠ్యాంశాల బోధనలో మరో కొత్త శకం ఆరంభం కానుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేలా పాఠశాల విద్యా శాఖ ముందడుగు వేస్తోంది. అత్యున్నత ప్రమాణాలతో కూడిన డిజిటల్ పాఠ్యాంశాలను అందించడానికి వీలుగా ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు చెందిన ఈ–పాఠ్యాంశాలతో కూడిన ట్యాబ్‌లను రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలోని 8వ తరగతి చదువుతున్న పిల్లలందరికీ అందించనున్నారు. సీఎం వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న ఆయన చేతుల మీదుగా ఈ ట్యాబ్‌లను అందించనున్నారు.

4వ తరగతి నుంచే బైజూస్ కంటెంట్

ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు ఉన్న 32 లక్షల మంది విద్యార్థులకు బైజూస్ యాప్ ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలను ప్రభుత్వం
మిగతా 2వ పేజీలో ▶

అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలి

మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- తనిఖీలు, నాణ్యత, నాడు–నేడు అంశాల్లో కచ్చితమైన మార్పు కన్పించాలి
- నాడు–నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వడంలో రాజీ పడొద్దు
- అభ్యాస సామర్థ్యం పెరిగేలా కరిక్యులమ్.. ఈ మార్పుల కోసం ప్రత్యేక అధికారి
- 61 సీడీపీఓ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్



సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని సౌకర్యాలతో అద్భుతంగా తీర్చిదిద్దాలని, ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు తనిఖీలు, నాణ్యత, నాడు–నేడు పనుల పురోగతి వంటి అంశాలకు సంబంధించి కచ్చితమైన మార్పు కనిపించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, విద్య, వైద్యం ఆరోగ్యం, గృహ నిర్మాణం, మహిళా శిశు సంక్షేమ శాఖలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వీటిలో మార్పు కోసం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సిబ్బంది నియామకాలతోపాటు ఎలాంటి సహకారం అవసరమైనా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు తగ్గట్టుగానే ఫలితాలు కూడా రావాల్సి ఉందన్నారు. గురువారం ఆయన
మిగతా 2వ పేజీలో ▶

మన టార్గెట్ 151 కాదు.. 175
మైలవరం కార్యకర్తలతో సీఎం 10లో

మేలు చేసిన సర్కారుపై.. మహిళాభిమానం

కత్తి... సుత్తి అంటూ 'ఈనాడు' కడుపుమంట

- మేలు చేస్తున్న సర్కారుకు మహిళల్ని బెదిరించాల్సిన పనేంటి?
- రుణ మాఫీ చేస్తాననే హామీతో చంద్రబాబు నిలువునా ముంచేయలేదా?
- నాడు పొదుపు వ్యవస్థ కుప్పకూలి... 95 శాతం సంఘాలు 'సి' గ్రేడ్‌కు
- గ్రామాల్లో నెలవారీ పొదుపు రూ.70 కోట్ల నుంచి కేవలం రూ.2 కోట్లకు
- పైపెచ్చు 'సెర్ప్'కు సలహాదారును నియమించి మరీ పార్టీ సభలకు తరలింపు
- నేడు హామీని నిలబెట్టుకుంటూ రుణ మాఫీని అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758 కోట్ల సొమ్ము మహిళల ఖాతాల్లోకి
- మళ్లీ వైఎస్సార్ సున్నా వడ్డీ అమల్లోకి... మూడేళ్లలో రూ.3,615 కోట్ల చెల్లింపు
- ఇతర పథకాల్లోనూ మహిళలకే అగ్రాసనం.. అందుకే అభిమానంతో జేజేలు

సాక్షి, అమరావతి: అధికారంలోకి రాగానే బ్యాంకు రుణాలన్నీ భేషరతుగా మాఫీ చేస్తానని, వాయిదాలు చెల్లించొద్దని 2014 అసెంబ్లీ ఎన్నికల ముందు పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ గెలిచాక ఐదేళ్లలో ఒక్క పైసా కూడా మాఫీ చెయ్యలేదు. పైపెచ్చు ఎప్పటికప్పుడు 'డ్వాక్రా రుణ మాఫీ'పై కథనాలను తన ఎల్లో పత్రికల్లో రాయిస్తూ ఆ మహిళలను ఆశపెట్టి
మిగతా 2వ పేజీలో ▶



రూ.1,633 కోట్లతో వీసీఐసీ రెండో దశ

- రూ.399 కోట్లతో నక్కపల్లి వద్ద 1,120 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా
- రూ.462.96 కోట్లతో 2,770 ఎకరాల్లో చిత్తూరు సౌత్ క్లస్టర్
- రాంబిల్లి వద్ద రూ.149 కోట్లతో 396 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా
- పారిశ్రామిక కారిడార్‌ను అనుసంధానిస్తూ పలు రహదారులు
- పరిపాలన అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- వివరాలు 11లో

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

- హైదరాబాద్‌లో రెండోరోజూ తనిఖీలు.. సహకరించని మార్గదర్శి సిబ్బంది.. అంతా దాటవేసే ధోరణి
- త్వరలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు సన్నాహాలు

2లో

ఇదండీ జగత్




ఎంత యుద్ధం చేసినా మనమూ బంకర్‌లో దాక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది..!!



టెంట్లతోనే రిసార్ట్స్

- రాష్ట్రంలోని ఐదు పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటుకు ఏపీటీడీసీ ప్రతిపాదన
- బీచ్‌లు, హిల్ స్టేషన్లలో పర్యాటకులకు బస.. ప్రతి రిసార్టులో 20 టెంట్ గదులు.. రెస్టారెంట్
- ఒక్కో టెంట్‌లో కుటుంబానికి సరిపడేలా బెడ్రూమ్, బాత్రూమ్, వరండా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు తక్కువ ఖర్చుతో విలాసవంతమైన అనుభూతి అందించేందుకు పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చర్యలు చేపట్టింది. బీచ్‌లు, కొండ ప్రాంతాల్లో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా ఎకో టెంట్ రిసార్టులను
మిగతా 2వ పేజీలో ▶



వచ్చే ఏడాది విద్యుత్ చార్జీలు పెరగవు

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఏ వినియోగదారులపైనా భారం ఉండదు

ఈ మేరకు ఏపీఈఆర్సీకి డిస్కంల వార్షిక ఆదాయ, వ్యయ నివేదికలు

వాస్తవాలను దాచి ప్రజల్ని ఏమార్చేందుకు పచ్చపత్రికల తప్పుడు రాతలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి చేసిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ సరఫరా ధరల ప్రతిపాదనల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు, వాణిజ్య అవసరాలకు, సాధారణ పరిశ్రమల రంగానికి, స్థానిక సంస్థలకు, ప్రభుత్వ, ప్రైవేటు నీటిపారుదల ఎత్తిపోతల పథకాలకు
మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మహనీయులకు సీఎం జగన్ నివాళి



సాక్షి, అమరావతి: భారతరత్న సర్దార్ వల్లభాయి పటేల్, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆ మహనీయుల చిత్రపటాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పాల్గొన్నారు.

సీఎంకు శారదా పీఠం వార్షిక మహోత్సవ ఆహ్వానం



సీఎం జగన్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

సాక్షి, అమరావతి/సింహాచలం: విశాఖలోని శ్రీ శారదా పీఠం వార్షిక మహోత్సవ ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అందజేశారు. తాడేపల్లిలోని సీఎం నివాసంలో గురువారం ఆయన సీఎంను కలిశారు. జనవరి 27 నుంచి 31 వరకు శారదా పీఠంలో వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీఎంకు వివరించారు. అనంతరం ఆహ్వాన పత్రికను, ప్రసాదాలను సీఎంకు స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అందజేశారు.

గడపగడపకు మన ప్రభుత్వంపై నేడు వర్క్‌షాప్

క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాల వల్ల జరిగిన మేలును ప్రజలకు వివరించి.. ఆశీస్సులు కోరేందుకు చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగే ఈ వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో–ఆర్డినేటర్లు తదితరులు పాల్గొంటారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాల వల్ల ప్రతి ఇంటికీ జరిగిన మేలును వివరించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మే 11న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు ప్రారంభించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం చేసిన మేలును అక్కాచెల్లెమ్మలకు వివరించడానికి ఇంటింటికి వెళుతున్న ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలకు గడపగడపలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ కార్యక్రమం జరుగుతున్న తీరును సమీక్షించి, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల అభిప్రాయాలను తెలుసుకుని ఆ కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రతినెలా సీఎం వైఎస్ జగన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు.

నేడు, రేపు బీఎన్‌వైఎస్ కోర్సులకు వెబ్ ఆప్షన్‌లు

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ న్యాచురోపతి, యోగిక్ సైన్సెస్(బీఎన్‌వైఎస్) కోర్సుల్లో అడ్మిషన్ల కోసం రెండో దశ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌ల నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటలలోపు ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలి.

టెంట్లతోనే రిసార్ట్స్

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయబోతోంది. తొలి దశలో భాగంగా ఐదు ప్రాంతాలను ప్రతిపాదించింది. ఇందులో బాపట్ల జిల్లాలోని పెదగంజాం–నిజాంపట్నం బీచ్ కారిడార్, తిరుపతి జిల్లాలోని తుపిలిపాలెం, అనకాపల్లి జిల్లాలోని ముత్యాలంపాలెం, అందలాపల్లె బీచ్‌లతో పాటు అన్నమయ్య జిల్లాలోని మల్లయ్యకొండపై టెంట్ రిసార్టులను అందుబాటులోకి తేనుంది.

ఒక్కో రిసార్ట్‌లో 20 టెంట్లు..

ప్రతి ఎకో రిసార్టులో 20 టెంట్ గదులతో పాటు అనుబంధంగా రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో టెంట్ గదిలో బెడ్రూమ్‌కు అనుబంధంగా బాత్రూమ్, వరండా నిర్మిస్తారు. టెంట్‌లో ఒక కుటుంబం (ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు) విడిది చేసేలా తీర్చిదిద్దనున్నారు. ఏపీటీడీసీ వీటిని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) కింద నిర్వహించనుంది. ఔత్సాహిక వ్యాపారవేత్తల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానించింది. భూమిని లీజు ప్రాతిపదికన అద్దెకిచ్చి.. అందులో ప్రైవేటు వ్యక్తులు స్వయంగా టెంట్ రిసార్టులు ఏర్పాటు చేసి, నిర్వహించేలా ఏపీటీడీసీ ప్రణాళికలు రూపొందించింది.

రాష్ట్రానికి ప్రతిష్టాత్మక అవార్డులు

వ్యవసాయ శాఖకు బెస్ట్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు

- వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి బెస్ట్ అకడమిక్ లీడర్‌షిప్ అవార్డు
- న్యూఢిల్లీలో ప్రదానం చేసిన అగ్రికల్చర్ టుడే గ్రూప్
- అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందన

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు, అత్యుత్తమ విధానాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర వ్యవసాయ శాఖకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. అగ్రికల్చర్ టుడే గ్రూపు అందించే బెస్ట్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు–2022 రాష్ట్ర వ్యవసాయ శాఖకు లభించింది. అదేవిధంగా ఉత్తమ విద్యాప్రమాణాలు పాటిస్తూ.. పరిశోధనల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీని బెస్ట్ అకడమిక్ లీడర్‌షిప్ అవార్డు వరించింది. ఈ ఏడాదికి ప్రకటించిన అవార్డులను అగ్రికల్చర్ టుడే గ్రూపు ఢిల్లీలో ప్రదానం చేసింది. అత్యుత్తమ పాలసీ విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వ శాఖలు, సంస్థలకు వివిధ కేటగిరీల్లో 'అగ్రికల్చర్ టుడే గ్రూప్' ఏటా లీడర్‌షిప్ అవార్డులను ప్రదానం చేస్తున్న సంగతి తెలిసిందే. పీఎం టాస్క్‌ఫోర్స్ ఫర్ ది డబులింగ్ ఆఫ్ ఫార్మర్స్ ఇన్‌కమ్ చైర్మన్ అశోక్ దాల్వాయ్ నేతృత్వంలోని కమిటీ ఈ ఏడాది బెస్ట్ పాలసీ లీడర్‌షిప్ కేటగిరీలో రాష్ట్ర వ్యవసాయ శాఖను, బెస్ట్ అకడమిక్ లీడర్‌షిప్ కేటగిరీలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలను ఎంపిక చేసింది. న్యూఢిల్లీలో బుధవారం రాత్రి జరిగిన 13వ అగ్రికల్చర్ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ తోలేటి జానకీరామ్ ఈ అవార్డులను అందుకున్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ ఈ అవార్డులను ప్రదానం చేశారు.

సీఎం అభినందన

రాష్ట్రానికి వచ్చిన అవార్డులతో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ గెడ్డం శేఖర్‌బాబు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం సీఎం జగన్‌ను కలిశారు. అవార్డులు సాధించినందుకు సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు.



ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జానకీరామ్



పూనం మాలకొండయ్య, హరికిరణ్, శేఖర్‌బాబులను అభినందిస్తున్న సీఎం జగన్

ఏపీ వైద్య శాఖకు జాతీయ స్థాయి అవార్డు

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన ప్రసూతి సేవలు అందిస్తున్న రాష్ట్ర వైద్య శాఖకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. నేషనల్ మెటర్నల్ హెల్త్ వర్క్‌షాప్‌ను కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ఢిల్లీలో నిర్వహించింది. ఇందులో అత్యధిక 'లక్ష్యా' గుర్తింపు కలిగిన ప్రభుత్వ ఆస్పత్రుల విభాగంలో రాష్ట్రాలకు అవార్డులిచ్చారు. దేశంలోనే తొలి స్థానంలో ఉన్న కర్ణాటక, రెండో స్థానంలో ఉన్న ఏపీకి అవార్డులిచ్చారు. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ చేతుల మీదుగా రాష్ట్ర ఎంసీహెచ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ అవార్డును అందుకున్నారు.



కేంద్ర సహాయ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ అనిల్‌కుమార్

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

సాక్షి, అమరావతి/హైదరాబాద్: హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం కూడా తనిఖీలు కొనసాగాయి. ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తమకు అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. తాజాగా.. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 10గంటల పాటు సోదాలు నిర్వహించిన అధికారులు ప్రాథమికంగా పలు ఉల్లంఘనలు గుర్తించినట్లు తెలిసింది. చిట్స్, డిపాజిట్లకు సంబంధించి పలు కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్క్‌లోని సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. ప్రధానంగా చందాదారుల నుంచి డిపాజిట్ల రూపంలో కట్టించుకున్న నిధుల వివరాలు, ఆ సొమ్మును ఏ కంపెనీలకు తరలించారు, ఎలా వినియోగించారనే దానిపై వివరాలు రాబడుతున్నారు. వీటిద్వారా నిధుల మళ్లింపు జరిగినట్లు అధికారులు ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

నేడు కూడా తనిఖీలు..

ఇక శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. అయితే, గురువారం కూడా మార్గదర్శి సిబ్బంది ఏమాత్రం సహకరించలేదని సమాచారం. మరోవైపు.. ప్రాథమికంగా ఉల్లంఘనలు తేలడంతో త్వరలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలి

▶ మొదటి పేజీ తరువాయి



క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

తన క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్‌వైజర్స్ సక్రమంగా పనిచేస్తే అంగన్‌వాడీల పనితీరు మెరుగు పడటంతోపాటు నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సూపర్‌వైజర్ల సహాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సూపర్‌వైజర్ల పనితీరుపైనా తనిఖీలు ఉండాలని చెప్పారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు, మంచి వాతావరణాన్ని కల్పించడం ముఖ్యం అన్నారు. సార్టెక్స్ బియ్యం సరఫరా చేయాలని, న్యూట్రిషన్ కిట్ సరఫరాలో నాణ్యత విషయంలో అస్సలు రాజీ పడొద్దని ఆదేశించారు. పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు అన్నింటిలోనూ నాణ్యత పెరగాలని, ఆ ఫలితాలు కనిపించాలని చెప్పారు. గతంలో కన్నా పిల్లలకు మంచి చేస్తున్నామన్న సంతృప్తి కలగాలని, ఇందు కోసం కావాల్సిన వసతులు, సదుపాయాలు పూర్తిగా కల్పించాలని స్పష్టం చేశారు.

> పిల్లలు చిన్న వయసులోనే ఏ విషయాన్ని అయినా త్వరగా గ్రహించగలుగుతారు. అందువల్ల అంగన్‌వాడీల నుంచే వారికి భాషపై గట్టి పునాది అందించాలి. అంటే అభ్యాస సామర్థ్యం (లర్నింగ్ ఎబిలిటీ) పెంపొందించుకునేలా మాంటిస్సోరీ విధానంతో కూడిన కరిక్యులమ్ అందుబాటులోకి తేవాలి. అప్పుడే వారి మెదడు పరిణతి చెందుతుంది. చాలా విషయాలపై మంచి అవగాహన ఏర్పడుతుంది. ఇందుకు అవసరమైతే ప్రత్యేక అధికారిని నియమించాలి. ఈ మార్పుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి. నాడు–నేడు కింద చేపడుతున్న పనులను వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలి. ఈ దిశగా ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
> – సీఎం జగన్

ఖాళీలు భర్తీ చేయండి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 61 సీడీపీఓ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీటితో పాటు ఇంకా ఖాళీగా ఉన్న పోస్టులను సైతం వెంటనే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ ద్వారా సీడీపీఓ నియామకాలు చేపడతామని అధికారులు తెలిపారు. గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.సిరి, పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నవ శకం

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. పిల్లల తల్లిదండ్రుల స్మార్ట్ ఫోన్ల ద్వారా వారికి ఈ పాఠాలు అందుబాటులో ఉంచారు. అయితే స్మార్ట్ ఫోన్లు అందరికీ అందుబాటులో ఉండకపోవడం, ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన తరుణంలో 8వ తరగతిలోకి వచ్చే పిల్లలందరికీ ప్రభుత్వమే ఉచితంగా ట్యాబ్‌లు అందించాలని సీఎం నిర్ణయించారు. ఈ విద్యార్థులు మూడేళ్లలో టెన్త్ పబ్లిక్ పరీక్షలను సీబీఎస్ఈ విధానంలో ఆంగ్ల మాధ్యమంలో రాసేలా సన్నద్ధం చేసేందుకు ఉన్నత ప్రమాణాలతో కూడిన కంటెంట్‌ను ట్యాబ్‌ల ద్వారా అందిస్తున్నారు. మూడేళ్ల పాటు వారికి ఈ ట్యాబుల ద్వారా బైజూస్ పాఠ్యాంశాలు అందుబాటులోకి వస్తాయి. ప్రతి ఏటా 8వ తరగతిలోకి వచ్చే దాదాపు 4.60 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించనున్నారు. వీరితోపాటు 8వ తరగతి నుంచి ఆపై తరగతులకు పాఠాలు చెప్పే 60 వేల మంది టీచర్లకు కూడా ఈ ట్యాబ్‌లను ఉచితంగా ఇస్తున్నారు. రాష్ట్రంలో జూన్ నుంచి దాదాపు 15 వేల స్కూళ్లలో డిజిటల్ క్లాస్ రూమ్‌లు అందుబాటులోకి వస్తాయి. తద్వారా ప్రతి తరగతి గదిలో ప్రత్యేక టీవీ ద్వారా విద్యార్థులకు మరింత స్పష్టంగా ఈ పాఠ్యాంశాలను వివరించవచ్చు.

ట్యాబ్‌ల విలువ రూ.1,400–1,500 కోట్లు

- బైజూస్ కంటెంట్‌తో కూడిన ఈ ట్యాబ్‌ల విలువ రూ.1,400 కోట్ల నుంచి రూ.1,500 కోట్లు ఉంటుంది. ప్రైవేటుగా ట్యాబ్‌తో పాటు బైజూస్ యాప్‌ను తీసుకోవాలంటే దాదాపు రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ట్యాబ్‌కు రూ.15 వేలు, కంటెంట్‌కు రూ.15 వేలకు పైగానే చెల్లించాలి.
- మంచి చిత్రాలతో త్రీ డైమన్షన్ ఫార్ములాతో, యానిమేషన్లతో రూపొందించిన కంటెంట్‌ను అందించడం వల్ల పిల్లలు సులభంగా పాఠ్యాంశాలను నేర్చుకోగలుగుతారు.
- విద్యార్థులు తమంతట తాము చదువుకొనేలా టెక్ట్స్ రూపంలో మాత్రమే కాకుండా వీడియో, ఆడియో చాలా అద్భుతంగా ఉంటుంది. ప్రతి చాప్టర్ తర్వాత 40–50 ప్రశ్నలుంటాయి. పిల్లలు తమ స్థాయిని వారే అంచనా వేసుకొనేలా సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానం కూడా ఉంది. వివిధ గ్రేడ్లలో మాక్ పరీక్షల విధానం ఉంది.
- ఒకసారి చార్జింగ్ చేశాక 10 గంటలపాటు బ్యాటరీ బ్యాకప్ ఉంది. ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్లో కూడా విద్యార్థులు ఈ వీడియో పాఠ్యాంశాలను అభ్యసించేలా ప్రీలోడెడ్ కంటెంట్ ఉంటుంది. 3 ఏళ్ల పాటు వీటికి వారంటీ ఉంటుంది. మధ్యలో ఏదైనా సమస్య వస్తే సమీపంలోని కంపెనీ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి సరిచేయించుకోవచ్చు. ఈ ట్యాబ్‌లలో అవాంఛనీయ సైట్లు రాకుండా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ పెట్టారు.
- ఈ ట్యాబ్‌ల్లోని ఈ–కంటెంట్ ఆంగ్లం, తెలుగుతో పాటు 8 భాషల్లో రూపొందించారు. గణితం, సైన్స్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్‌లో హిస్టరీ, జియాగ్రఫీ, సివిక్స్ పాఠ్యాంశాల్లో పూర్తి స్థాయిలో బోధన వీడియోలతో రూపొందించారు.

అత్యుత్తమ విద్యే లక్ష్యం

తరగతి గదిలో చెప్పే పాఠాలను ఇళ్లకు వెళ్లాక కూడా పిల్లలు మరింత క్షుణ్ణంగా అభ్యాసం చేసేందుకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలోని 8వ తరగతి విద్యార్థులందరికీ, 8వ తరగతి బోధించే టీచర్లకు.. మొత్తంగా 5.18 లక్షల మందికి ట్యాబ్‌లు అందిస్తున్నాం. వీటిని ఎలా వాడాలి.. కంటెంట్‌ను ఎలా చెప్పాలో టీచర్లకు శిక్షణ ఇస్తాం. సీబీఎస్ఈ విధానంలో బోధన చేసేలా ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం.
– కాటమనేని భాస్కర్, పాఠశాల విద్య కమిషనర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)

విద్యార్థులకు వరం

సీఎం వైఎస్ జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడం కచ్చితంగా పెద్ద వరమే. ఉన్నతాధికారులు ప్రవీణ్ ప్రకాష్, కాటమనేని భాస్కర్‌లు మా స్కూల్‌కు వచ్చి.. పంపిణీ చేయనున్న ట్యాబ్‌లను పరిశీలన కోసం విద్యార్థులకు చూపించారు. కంటెంట్ అద్భుతంగా ఉందని పిల్లలు సంతోషపడ్డారు.
– బట్టు సురేష్‌కుమార్, హెచ్ఎం, నిడమానూరు జెడ్పీ పాఠశాల

కార్పొరేట్ స్కూల్ కంటే గొప్పగా..



ప్రభుత్వం మాకు మంచి విద్య అందించేందుకు అన్ని విధాలుగా సాయం చేస్తోంది. అమ్మ ఒడితో పాటు విద్యాకానుక, గోరుముద్ద పథకాలు ఎంతో అండగా ఉన్నాయి. ఇప్పుడు కార్పొరేట్ స్కూళ్ల కన్నా గొప్పగా ఉండేలా ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్ అందించడం వల్ల మరింత బాగా చదువుకోగలుగుతాం.
– తేజస్విని, 8వ తరగతి, నిడమానూరు జెడ్పీ పాఠశాల

బ్రాండ్	శామ్‌సంగ్
మోడల్ పేరు	గెలాక్సీ ఏ7 లైట్
మెమరీ స్టోరేజీ కెపాసిటీ	32 జీబీ
స్క్రీన్ సైజు	22.05 సెంటీమీటర్లు
డిస్‌ప్లే స్పష్టత	1340x800 (డబ్ల్యూఎక్స్‌జీఏ+) పిక్సెల్
ఆపరేటింగ్ సిస్టమ్	ఆండ్రాయిడ్ 11
కలర్	గ్రే
రామ్ (మెమొరీ)	3 జీబీ
మోడల్	2021
బరువు	366 గ్రాములు
వారంటీ	మూడేళ్లు

వచ్చే ఏడాది విద్యుత్ చార్జీలు పెరగవు

▶ మొదటి పేజీ తరువాయి

విద్యుత్ చార్జీల పెంపుదల లేదని రాష్ట్ర ఇంధన శాఖ స్పష్టంచేసింది. 'సాక్షి' ప్రతినిధికి గురువారం ఇంధన శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు చేసిన టారిఫ్ ప్రతిపాదనల సమగ్ర వివరాలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి గతనెల 30న సమర్పించాయి. వాటి ప్రతులు ఏపీఈఆర్సీ, పంపిణీ సంస్థల వెబ్‌సైట్లలో ఉన్నాయి. నివేదిక ప్రతులు డిస్కంల ప్రధాన కార్యాలయంలోను, సర్కిల్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచారు.

ప్రభుత్వ సబ్సిడీలు, రాయితీల్లో ఆదాయం

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సరఫరా సేవా ఖర్చు నిర్దేశిత యూనిట్ ఖర్చు రూ.6.98 కన్నా రూ.0.70 పెరుగుతుందని అంచనా వేసినప్పటికీ ఆ భారాన్ని ఏ వర్గంపైనా వేయడంలేదు. జనం నెత్తిన రూ.13,487.54 కోట్లు భారం పడుతోందని పచ్చ పత్రికలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. అది పంపిణీ సంస్థల వార్షిక ఆదాయ ఆవశ్యకతకు, ప్రస్తుతం టారిఫ్, ఇతర వనరుల ద్వారా వచ్చే ఆదాయానికి మధ్య వుండే వ్యత్యాసం మాత్రమే. ఇదంతా ధరలను పెంచడం ద్వారా వినియోగదారులపై మోపడం జరగదు. డిస్కంల ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించి, ప్రజాభిప్రాయం తీసుకుని, దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటుంది. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా ఇచ్చే విద్యుత్ సబ్సిడీ, ఇతర రాయితీల ద్వారా ఈ ఆదాయ అంతరాన్ని విద్యుత్ సంస్థలు పూడ్చుకుంటాయి.

చార్జీల వసూలు ద్వారా నష్టాల భర్తీ జరగదు

రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు అంటే.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం, ఆక్వా రంగం.. తదితరులకు అందించే విద్యుత్ రాయితీల మొత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.11,123 కోట్లుగా నిర్ధారించారు. అయితే, ఏపీఈఆర్సీకి సమర్పించిన ప్రతిపాదనల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేటగిరి వారీగా, శ్లాబుల వారీగా ప్రస్తుతం అమలులో వున్న ధరలనే ప్రతిపాదిస్తూ (ఇప్పటికే రాయితీ పొందుతున్న ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలకు మినహా) నివేదిక ఇచ్చారు. అంతేగానీ, నష్టాలను చార్జీల వసూలుతో భర్తీ చేసుకుంటామని ఎక్కడా ప్రతిపాదించలేదు. వినియోగదారులపై విద్యుత్ చార్జీల పెంపుదల ప్రతిపాదన చాలా గోప్యంగా ఉంచారన్నది కూడా పూర్తిగా అవాస్తవం.

డిస్కంల వారీగా సేవా ఖర్చు

ఇక డిస్కంల కొనుగోలు వ్యయంపై వేర్వేరు గణాంకాలు సమర్పించాయనడం సరైంది కాదు. పంపిణీ సంస్థ సేవా ఖర్చు (కాస్ట్ అఫ్ సర్వీస్)లో వివిధ భాగాలు అంటే.. విద్యుత్ కొనుగోలు వ్యయం, ప్రసార, పంపిణీ నష్టాలు, నెట్‌వర్క్ నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు, మరమ్మతు ఖర్చులు మొదలైనవి ఒక్కో డిస్కంలో ఒక్కో విధంగా ఉంటాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూడు డిస్కంలకు విద్యుత్ కొనుగోలు వ్యయం, మొత్తం సేవా ఖర్చు–కాస్ట్ అఫ్ సర్వీస్ ప్రతీ యూనిట్‌కు ఇలా వున్నాయి.. (రూ.లలో)

అంశము	ఏపీసీపీడీసీఎల్	ఏపీఈపీడీసీఎల్	ఏపీఎస్పీడీసీఎల్	మూడూ కలిపి
విద్యుత్ కొనుగోలు వ్యయం	4.65	4.63	4.59	4.62
మొత్తం సేవా ఖర్చు–కాస్ట్ ఆఫ్ సర్వీస్	7.96	7.25	7.94	7.68

మేలు చేసిన సర్కారుపై.. మహిళాభిమానం

▶ మొదటి పేజీ తరువాయి

> మహిళలను మోసం చేసిన ముఖ్యమంత్రి? ఈ ప్రశ్న వేయగానే చంద్రబాబు సమాధానంగా కనిపిస్తారు. మరి అదే మహిళలను ఆదుకున్న ముఖ్యమంత్రిగా... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్లెదుట నిలబడతారు. ఇదే.. ఈ ఇద్దరికీ ఉన్న తేడా. అందుకే ఈ సర్కారును 'మహిళా పక్షపాత ప్రభుత్వం'గా అంతా గుర్తిస్తున్నారు. మరి అలాంటి ముఖ్యమంత్రో... ప్రభుత్వమో ఏవైనా సభలు నిర్వహిస్తే ఆ మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావటంలో ఆశ్చర్యమేముంది? దానిక్కూడా బెదిరింపులు... జరిమానాలు.. అంటూ కథలు అల్లాలా రామోజీరావు గారూ? వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగానే ఉండకూడదన్న కక్షతో రాస్తున్న మీ రాతలు... అబద్ధాల్లో ఆస్కార్ స్థాయిని కూడా దాటిపోయాయని ఈ రాష్ట్రంలో తెలియనిదెవ్వరికి? అసలు పొదుపు సంఘాల మహిళల్ని మోసం చేసిందెవరు?

ఉపయోగించుకున్న తీరు దారుణాతి దారుణం. ఆ మహిళలను నిరంతరం టీడీపీ సభలకు తరలించడానికి ఏకంగా టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసిన వ్యక్తిని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అడ్వయిజర్‌గా నియమించేశారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఒంగోలు నుంచి ఓడిపోయిన బత్తుల విజయభారతిని చంద్రబాబు 2014లో తాను సీఎం అయ్యాక సెర్ప్ అడ్వయిజర్‌గా నియమించారు. నిజానికి సెర్ప్ సీఈఓగా ఐఏఎస్ అధికారులే ఉంటారు. కానీ బాబు తన సామాజిక వర్గానికి చెందిన రిటైర్డ్ అధికారిని (ఐఏఎస్ కాదు) ముఖ్యమంత్రి ఓఎస్‌డీ పేరిట నియమించుకుని... ఆయన్నే సెర్ప్ సీఈఓగానూ కొనసాగించారు. పొదుపు సంఘాల మహిళల్ని టీడీపీ సభలకు తరలించటమే ఈ సీఈఓ, అడ్వయిజర్ పని. అధికారికంగా మాత్రం... పొదుపు మహిళలకు ట్రైనింగ్ అని బిల్లులు పెడుతూ... ఆ డబ్బుల్ని మాత్రం వాళ్లను సభలకు తరలించడానికి బస్సులకు, ఇతర వాహనాలకు పెట్టేవారు. అదీ కథ. ఉదాహరణకు బాబు సీఎంగా ఉన్నపుడు నంద్యాలకు ఉప ఎన్నికలు జరిగాయి. టీడీపీ తరఫున డబ్బులు పంచడానికి నియోజకవర్గంలో ప్రతి 50 ఇళ్లకు ఒక పొదుపు సంఘ మహిళను 'సంఘమిత్ర'గా నియమించారు. ఆ ఎన్నికల ముందు చంద్రబాబే నేరుగా పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారంటే ఈ వ్యవస్థను ఎంత దుర్వినియోగం చేశారో తెలియకమానదు.

బాబు పాపాల ఫలితమేంటి?

పొదుపు సంఘాలను ఇంతలా వాడేసుకున్న బాబు... వాటికి చేసింది మాత్రం ఏమీ లేదు. హామీ ఇచ్చి కూడా... ఒక్క రూపాయిని సైతం మాఫీ చేయలేదు. అప్పటిదాకా ఉమ్మడి ఏపీలో పొదుపు సంఘాలకు 'సున్నా వడ్డీ' పథకం అమలయ్యేది. బాబు సీఎం అయ్యాక ఆ పథకానికి నిధులు నిలిపేశారు. దీంతో వడ్డీ డబ్బులు కూడా మహిళలే చెల్లించాల్సి వచ్చింది.

- ఇక బాబు మాటలు నమ్మి మహిళలు వాయిదాలు కట్టలేదు. దీంతో వడ్డీ, చక్రవడ్డీల భారం పెరిగిపోయింది. 2014 నాటికి రూ.14205 కోట్లు ఉన్న పొదుపు సంఘాల అప్పు, 2019 ఏప్రిల్ నాటికి రెట్టింపు స్థాయిలో రూ. 25,517 కోట్లకు చేరింది. 2019 మార్చి నాటికి పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు రూ.20వేల కోట్లకు పైగా ఉన్నాయని ఘనంగా చెప్పిన 'ఈనాడు'... అందులో సగానికి సగం రుణమాఫీ చెయ్యకపోవటం వల్ల మీదపడిన వడ్డీయేనని ఎందుకు చెప్పదు? ఇంతటి కఠిన వాస్తవాన్ని దాచిపెట్టడానికి కాస్తయినా సిగ్గుండాలి కదా రామోజీరావు గారూ?
- పైపెచ్చు 98.4 శాతం రికవరీ అనేది రామోజీరావు రాతల సారాంశం. అదే నిజమైతే 18.36 శాతం సంఘాలు ఎన్‌పీఏలుగా (నిరర్థక ఆస్తులు) ఎందుకు మారతాయి? బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని నెలల పాటు కేవలం 4.4 శాతం సంఘాలే నెలనెలా సమావేశాలు నిర్వహించుకున్నాయి. గ్రామాల్లో ప్రతి నెలా రూ.70 కోట్ల దాకా ఉండే పొదుపు... జస్ట్ రూ.2 కోట్లకు పడిపోయింది.
- ఉమ్మడి ఏపీలో 2014లో మూడున్నర లక్షల పొదుపు సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉంటే... బాబు సీఎం అయ్యాక 2015 ఏప్రిల్‌కు ఏ, బీ గ్రేడ్‌లో ఉన్న సంఘాలన్నీ కలిపి 2.54 లక్షలకు పడిపోయాయి. ఇక 2015 నవంబరు నాటికి అవి 38 వేలకు (అంటే కేవలం ఐదు శాతం) పడిపోయాయి. ఈ వాస్తవాలు చాలవా... పొదుపు సంఘాల వ్యవస్థను కూకటివేళ్లతో సహా ఈ చంద్రబాబు... రామోజీరావులు ఎంతలా ధ్వంసం చేశారో తెలియటానికి!!?.



ఇప్పుడు.. 91 శాతం సంఘాలది ఏ గ్రేడే...


బాబు చేసిన మోసంతో పూర్తిగా అప్పుల ఊబిలో మునిగిపోయిన పొదుపు సంఘాలను ఆదుకుంటానని తన పాదయాత్రలో హామీ ఇచ్చారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను గెలిచాక నాలుగు విడతల్లో నేరుగా బకాయి మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తానని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం... 2019 ఏప్రిల్ నాటికి ఉన్న రూ.25,517 కోట్లు అప్పును నాలుగు విడతలుగా చెల్లించేందుకు వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే వరుసగా రెండేళ్లు రెండు విడతల్లో రూ.12,758.28 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు.

- వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లీ 2020 ఏప్రిల్ 24న వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టింది. సకాలంలో రుణాలు చెల్లించే సంఘాల వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. గడిచిన మూడేళ్లగా ఏకంగా రూ.3,615.29 కోట్లను వడ్డీ రూపంలో చెల్లించింది. ఫలితం... ఇపుడు 91 శాతం సంఘాలు ఏకంగా 'ఏ' గ్రేడ్‌కు చేరాయి. 99.5 శాతం మహిళలు సకాలంలో వాయిదాలు చెల్లిస్తున్నారు.
- ఇవేకాక వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, పేదలకు సొంతిళ్లు వంటి పథకాలన్నిటినీ ప్రభుత్వం మహిళల పేరుతోనే అమలు చేస్తోంది. అందుకే మహిళలు ఈ ప్రభుత్వంపై అభిమానం చూపిస్తున్నారు. సభలకు స్వచ్ఛందంగా తరలి వచ్చి జేజేలు పలుకుతున్నారు. దీన్ని భరించలేని కడుపుమంటకు ప్రత్యక్ష రూపమే... 'ఈనాడు' కథనం. కాదంటారా రామోజీ?

క్లుప్తంగా...

'మాండూస్' బాధిత రైతులను ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చంద్రబాబు లేఖ



సాక్షి, అమరావతి: 'మాండూస్' తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చంద్రబాబు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. తుపాను బాధిత రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని పేర్కొన్నారు. తేమ శాతం నిబంధన పేరుతో మద్దతు ధరల్లో కోత పెడుతున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని, తరుగు లేకుండా ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని కోరారు. వరి, అపరాలకు ఎకరానికి రూ.20 వేలు, వాణిజ్య, ఉద్యానవన పంటలకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని, ఆంక్షలు లేకుండా ఇన్సూరెన్స్ పరిహారం త్వరగా అందించాలని కోరారు. కౌలు రైతులకు నేరుగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సారా, అక్రమ మద్యం కట్టడికి కఠిన చర్యలు

ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి



సాక్షి, అమరావతి: నాటు సారా, అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణ స్వామి అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా సారా తయారీయే వృత్తిగా జీవిస్తున్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన 'పరివర్తనం' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన ఎక్సైజ్ శాఖ సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడినవారి నుంచి సంబంధిత మొత్తాన్ని వసూలు చేసేందుకు ఆర్ ఆర్ చట్టం ప్రయోగించాలని ఆదేశించారు. అంతర్రాష్ట్రస్థాయి గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, కమిషనర్ వివేక్ యాదవ్, రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల అడ్వాన్స్ అక్రమాలపై సీఐడీ విచారణ

అధికారులకు మంత్రి మేరుగు నాగార్జున ఆదేశం



సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వివిధ రకాల వాహనాలు సరఫరా చేయడానికి ఎస్సీ కార్పొరేషన్ నుంచి కోట్లాది రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకుని వాహనాలను సరఫరా చేయని డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటుగా సీఐడీ విచారణ చేయించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన 11వ కమిటీ ఆఫ్ పర్సన్స్ (సీఓపీ) సమావేశంలో మంత్రి నాగార్జున పలు అంశాలపై సమీక్షించారు. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి వివిధ జిల్లాల్లో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీ)గా పనిచేస్తున్న వారిలో ఏడాదికాలం సర్వీసును పూర్తి చేసిన వారిని సొంత శాఖలకు వెనక్కు పంపాలని మంత్రి ఆదేశించారు.

మచిలీపట్నం పోర్టు వ్యవహారంలో...

'నవయుగ'కు ఎదురుదెబ్బ

మధ్యవర్తిని నియమించాలన్న అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు

- హైకోర్టునే ఆశ్రయించాలని నవయుగ పోర్ట్ లిమిటెడ్‌కు తేల్చిచెప్పిన ధర్మాసనం
- నవయుగ తీరువల్లే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాం
- పోర్టును వీలైనంత త్వరగా పూర్తిచేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- సుప్రీంకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ



సాక్షి, న్యూఢిల్లీ: మచిలీపట్నం పోర్టు కాంట్రాక్ట్ వ్యవహారంలో ఇప్పటికే హైకోర్టులో ఎదురుదెబ్బ తిన్న నవయుగ పోర్ట్ లిమిటెడ్‌కు ఇప్పుడు సుప్రీంకోర్టులోను అదే పరిస్థితి ఎదురైంది. మచిలీపట్నం పోర్టు నిర్మాణం నిమిత్తం తమతో గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసిన నేపథ్యంలో ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిని నియమించాలన్న నవయుగ అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాము మధ్యవర్తిని నియమించబోమని స్పష్టంచేసింది. మధ్యవర్తి నియామక అభ్యర్థనతో హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధనుంజయ్ చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఇదీ నేపథ్యం..

నవయుగ పోర్ట్ లిమిటెడ్‌తో ఒప్పందాన్ని రద్దుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో జీవో 66 జారీచేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నవయుగ పోర్ట్ లిమిటెడ్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి ఆ జీవోను సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ నవయుగ పోర్ట్ లిమిటెడ్ ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. అదే సమయంలో ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్లకుండా అడ్డుకునేందుకు పలు అభ్యర్థనలతో అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేసింది. వాటిని న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించి కొట్టేసింది. అలాగే తమతో ఒప్పందం రద్దుచేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపేయాలన్న అనుబంధ పిటిషన్ కూడా తోసిపుచ్చింది. ఒప్పందం రద్దుచేసుకుంటూ ప్రభుత్వం జారీచేసిన జీవో 66, ప్రాజెక్టును పీపీపీ నుంచి ఈపీసీ విధానంలోకి మారుస్తూ జారీచేసిన జీవో 9 అమలును నిలిపేయాలంటూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను సైతం జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం కొట్టేసింది. మచిలీపట్నం పోర్టు నిర్మాణం విషయంలో నవయుగ కోరిన విధంగా ఏ రకమైన మధ్యంతర ఉత్తర్వులు సాధ్యంకాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. తుది విచారణను డిసెంబర్‌కు వాయిదా వేసింది.

హైకోర్టు ధర్మాసనం ఆదేశాలపై సుప్రీంకోర్టులో నవయుగ పిటిషన్

జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం ఆదేశాలపై నవయుగ పోర్ట్ లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యంపై సీజే జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం గురువారం విచారించింది. నవయుగ పోర్ట్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపిస్తూ నవయుగ విజ్ఞప్తిపై స్పందించాలంటే రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి అవసరమని తెలిపారు. ఒప్పందం రద్దులో తమ తప్పేమీ లేదన్నారు. ఒప్పందం చేసుకుని భూమి కేటాయించినా నిర్మాణ పనుల్లో నవయుగ అసాధారణ జాప్యం చేసిందని చెప్పారు. అందుకే విధిలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దుచేసుకోవాల్సి వచ్చిందన్నారు. వీలైనంత త్వరగా మచిలీపట్నం పోర్టు నిర్మాణాన్ని పూర్తిచేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రిట్ పిటిషన్ దాఖలు చేసి ప్రాజెక్టు పనులను ముందుకెళ్లకుండా అడ్డుకునేందుకు నవయుగ ప్రయత్నించిందని, అయితే హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు.

సంక్షేమం కూడా అభివృద్ధిలో భాగమే

- వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి
- నీతి ఆయోగ్ సూచీల్లో పలు విభాగాల్లో ఏపీ అగ్రస్థానం
- ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలది దుష్ప్రచారం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న కృష్ణంరాజు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పేదలకు మేలు చేస్తున్నాయని, సంక్షేమం కూడా అభివృద్ధిలో భాగమేనని పలువురు వక్తలు స్పష్టంచేశారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఆంధ్రాలో అభివృద్ధి–సంక్షేమం–వాస్తవాలు–వక్రీకరణ' అనే అంశంపై విజయవాడలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ 11.43 శాతం ఆర్థికాభివృద్ధితో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా నిరుపేదలకు అందుతున్నాయని, అయినా ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు దురుద్దేశంతో దుష్ప్రచారం చేస్తున్నాయని, ఇది సరైన విధానం కాదన్నారు. వికేంద్రీకరణతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీజేపీ నేత చందు సాంబశివరావు మాట్లాడుతూ ఏపీలో ఆర్థిక సంక్షేమమేగాని సంక్షోభం లేదని, శ్రీలంకతో మన రాష్ట్రాన్ని పోల్చడం భావ్యం కాదన్నారు. బెటర్ ఆంధ్రప్రదేశ్ కో–కన్వీనర్ లఖంరాజు సునీత మాట్లాడుతూ నీతి ఆయోగ్ సూచీల్లో పలు విభాగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని, రాష్ట్ర నుంచి ఎగుమతులు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని గణాంకాలతో వివరించారు. జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిపై కేంద్ర నివేదికలకు భిన్నంగా ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ నేరుగా నగదు ప్రజలకు అందడం వల్ల వారు దానిని వస్తుసేవల విక్రయానికి ఉపయోగిస్తారన్నారు. దీంతో వాటికి డిమాండ్, సరఫరా, ఉత్పత్తి పెరిగి ఉపాధి అవకాశాలు, ప్రభుత్వానికి పన్నుల రాబడి పెరుగుతుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2020–21లో దేశంలో రూ.6.3 లక్షల కోట్ల నగదును నేరుగా ప్రజలకు బదిలీ చేయగా.. దానిలో పది శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే జరిగిందని చెప్పారు. బెజవాడ మీడియా సెంటర్ అధ్యక్షుడు చందన మధు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, సీనియర్ పాత్రికేయుడు బ్రహ్మయ్య తదితరులు ప్రసంగించారు.

కడుతున్న ఇళ్లూ కనిపించని కబోదులు

- చంద్రబాబు, రామోజీపై మంత్రి జోగి రమేష్ మండిపాటు
- 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినందుకు ఇంత ఏడుపా?
- ఇళ్ల నిర్మాణాలను చూపిస్తాం.. ఎక్కడికైనా వస్తాం.. మీరు సిద్ధమా?

సాక్షి, అమరావతి: కడుతున్న ఇళ్లు కూడా కనిపించని కబోదులు వారు అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయనకు వత్తాసు పలికే 'ఈనాడు' రామోజీరావుపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీడలేక అద్దె ఇళ్లలో ఉంటున్న 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ ఇంటి వసతి కల్పిస్తుంటే వీరు కడుపు మంటతో ఏడుస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు సరిగా జరగడం లేదంటూ అసత్యపు రాతలు రాశారని అన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేనంతగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, పేదలకు ఒక శాశ్వత చిరునామా ఇస్తూ, రూ.లక్షల విలువ చేసే ఆస్తిని వారికి అప్పగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నది వాస్తవమని స్పష్టంచేశారు. మొదటి రెండు విడతలకు 18.63 లక్షల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. చంద్రబాబు, లోకేశ్ సహా అందరూ వస్తే అక్కచెల్లెమ్మలు దగ్గరుండి ఏ విధంగా ఇళ్లు కట్టుకుంటున్నారో చూపిస్తామని చెప్పారు. 2023 మార్చిలోపు అక్కచెల్లెమ్మలు గృహ ప్రవేశాలు చేయబోతున్నారని అన్నారు. చంద్రబాబు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఉంటే, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఎలా ఇస్తారని, ఇంత సింపుల్ లాజిక్ కూడా 'ఈనాడు' రామోజీరావుకు ఎందుకు తట్టదని ప్రశ్నించారు. మూడు సెంట్లలో చంద్రబాబు నిర్మిస్తానన్న ఇళ్లు ఏమయ్యాయని రామోజీ ఎందుకు ప్రశ్నించరని అన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు. మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపిస్తానని చెప్పారు. చంద్రబాబు, యనమల వారి ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమేనా... అని సవాల్ చేశారు. సీబీఐ అనగానే పది నిమిషాల్లో స్టే తీసుకొస్తారని చెప్పారు. పోలవరాన్ని యనమల వియ్యంకుడికి ఎలా కట్టబెట్టారో తెలియదని అనుకోవద్దన్నారు. మీ పాపం పండింది కాబట్టి చరిత్రహీనులుగా మిగిలిపోయారన్నారు. చంద్రబాబు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా ఐదు కోట్ల తెలుగు ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారని చెప్పారు.

తెలంగాణ

బండలు పేల్చారు..బతుకునిచ్చారు

- రాజు రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్
- బండరాళ్ల మధ్య 48 గంటల నరక యాతన నుంచి విముక్తి



రాళ్ల గుట్టలో గుండ్ల మధ్య నుంచి రాజును బయటకు తీసుకువస్తున్న రెస్క్యూ సిబ్బంది



రాజును స్ట్రెచర్‌పై తరలిస్తూ..

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: రెండు పెద్ద బండరాళ్ల మధ్య.. దాదాపు 48 గంటలపాటు.. ఎటూ కదల్లేని మెదల్లేని పరిస్థితి.. రాత్రివేళ మరీ నరకయాతన. బయట పడతానో లేదో అన్న సందిగ్ధం. కానీ ధైర్యం కోల్పోలేదు. రెండు రాత్రిళ్లు గడిచాయి. అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. ఎట్టకేలకు ఆ నరకం నుంచి విముక్తి లభించింది. గుట్టల్లో బండరాళ్ల మధ్య ఇరుక్కుపోయిన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన రాజు గురువారం క్షేమంగా బయటపడటంతో కుటుంబసభ్యులు, బంధువులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

వేటకు వెళ్లి..బండరాళ్ల మధ్య చిక్కి..

మంగళవారం రెడ్డిపేట–సింగరాయపల్లి రోడ్డులో గన్పూర్ (ఆర్) తండాకు సమీపంలోని పులిగుట్ట అటవీ ప్రాంతానికి వెళ్లిన చాడ రాజు.. రెండు పెద్ద బండరాళ్ల మధ్య ఇరుక్కుపోయాడు. ఏదులు, ఉడుములు పట్టుకోవడంలో దిట్ట అయిన రాజు.. ఉడుము పట్టుకునే క్రమంలోనే బండరాళ్ల మధ్య చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. రాజు వెంట వెళ్లిన అతని స్నేహితుడు సున్నపు మహేశ్.. అతన్ని బయటకు లాగేందుకు విఫలయత్నం చేశాడు. ఇక లాభం లేదనుకుని బుధవారం ఉదయం గ్రామంలోని మిత్రులకు విషయం చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని తమ వంతు ప్రయత్నాలు చేశారు. కానీ ఫలించలేదు. విధిలేని పరిస్థితుల్లో గ్రామస్తులు, పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో వచ్చిన పోలీసు, ఫారెస్ట్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సహాయ సిబ్బంది.. రాజును రక్షించేందుకు గుట్టను తవ్వే ప్రయత్నాలు మొదలుపెట్టారు. మొదట జేసీబీ సాయంతో ప్రయత్నించారు. తర్వాత రాళ్లకు డ్రిల్లింగ్‌తో రంధ్రాలు చేసి పేలుడు మందు నింపి బ్లాస్టింగ్ చేశారు. ఈ విధంగా గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 12 సార్లు బండరాళ్లను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ (పెద్ద రాళ్ల ముక్కలు రాజు మీద పడకుండా తక్కువ మోతాదు పేలుళ్లు) చేశారు. తక్కువ పరిమాణంలో మందుగుండు అమర్చుతూ పేలుళ్లు జరిపారు. పొరపాటున భారీ విస్ఫోటనం జరిగితే లోపల ఇరుక్కున్న రాజుకు అపాయం జరిగే అవకాశం ఉంది. అందుకే చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. పేల్చిన రాళ్లను మెల్లగా తొలగిస్తూ ఎట్టకేలకు లక్ష్యాన్ని చేరుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం రాళ్ల మధ్య ఇరుక్కుపోయిన రాజు దాదాపు 48 గంటల తర్వాత గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో క్షేమంగా బయటపడటంతో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రాజును అధికారులు తక్షణమే కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతన్ని ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నారు.

పాల్వంచలో భూ ప్రకంపనలు

ఆందోళనతో ఇళ్ల నుంచి పరుగులు తీసిన ప్రజలు

పాల్వంచ రూరల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2.10 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై 3.2గా నమోదైనట్లు తెలుస్తున్నా, స్థానికంగా అధికారులు ధ్రువీకరించలేదు. ఉన్నట్లుండి భూమి ఒక్కసారిగా కంపించడం, కొందరి ఇళ్లలో వస్తువులు కింద పడటంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. నాలుగేళ్ల క్రితం 2018లో రాత్రివేళ ఇక్కడే భూమి కంపించగా, ఇప్పుడు పునరావృతం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికే పలుమార్లు భూ ప్రకంపనలు సంభవించినట్లు అధికారిక రికార్డుల ద్వారా తెలుస్తోంది. 1954లో రిక్టర్ స్కేల్‌పై 4.3 తీవ్రత నమోదుకాగా, 1968లో భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల్లో రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రత, 1969లో భద్రాచలంలో 4.6గా, 2004లో భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాల్లో భూకంపం వచ్చి రిక్టర్ స్కేల్‌పై 3.5గా నమోదైంది.

కొత్త మెడికల్ కాలేజీల దరఖాస్తుకు గడువు పెంపు

- మెడికల్ కాలేజీల్లో ఆధార్‌తో బయోమెట్రిక్ విధానం తప్పనిసరి
- జాతీయ వైద్య కమిషన్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 2023–24 వైద్య విద్య సంవత్సరానికి కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, ప్రస్తుత కాలేజీల్లో యూజీ, పీజీ సీట్లను పెంచుకునేందుకు అనుమతి కోరుతూ దరఖాస్తు పత్రాలను దాఖలు చేయడానికి గడువు తేదీని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పొడిగించింది. ఎంబీబీఎస్ సీట్లకు ఆగస్టు 31తో, పీజీ సీట్లకు జూలై 20తో గడువు ముగియగా... కాలేజీల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని గురువారం నుంచి ఈ నెల 23 వరకు దరఖాస్తులను స్వీకరించడానికి గడువు పొడిగించినట్లు పేర్కొంది. మరోవైపు దేశంలో డీమ్డ్ వైద్య విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలనుకునే సందర్భంలో ప్రస్తుతమున్న నిబంధనలను సడలిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశ్వవిద్యాలయానికి సమీపంలోనే రెండేళ్ల కాలం నాటి వెయ్యి పడకల ఆసుపత్రి తప్పనిసరిగా ఉండాలనే నిబంధనను సడలించింది. సమీపంలో లేకపోయినా దేశంలో ఎక్కడైనా సరే వెయ్యి పడకల ఆసుపత్రి రెండేళ్లుగా ఉంటే సరిపోతుందని స్పష్టం చేసింది. అయితే వైద్య సంస్థ, ఆసుపత్రి భవనాలు సొంతంగా ఉండాలని చెప్పింది. డీమ్డ్ విశ్వవిద్యాలయం కోసం దరఖాస్తు చేసే సమయానికే వెయ్యి పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నెలకొల్పి ఉండాలని తేల్చిచెప్పింది. మరోవైపు, మెడికల్ కాలేజీల్లో తనిఖీలు, పర్యవేక్షణకు నిపుణుల కమిటీలో సభ్యులుగా అర్హులైన అధ్యాపకుల పేర్లను పంపించాలని తెలిపింది.

ఆధార్ లింక్‌తో బయోమెట్రిక్

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కచ్చితంగా ఆధార్ నంబర్‌తో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అనుసరించాల్సిందేనని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. అధ్యాపకులు, ట్యూటర్లు, డిమానిస్ట్రేటర్లు, సీనియర్ రెసిడెంట్లు సహా ప్రతి ఒక్కరు కూడా ఈ విధానాన్ని పాటించాలనీ, లేకపోతే తదుపరి సంవత్సరాలకు మెడికల్ సీట్లను పొడిగించడం, కొత్త సీట్లకు అనుమతించడం, కొత్త కళాశాలను స్థాపించడం వంటి వాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని తేల్చిచెప్పింది. ఆధార్ బయోమెట్రిక్ హాజరును ఎన్ఎంసీకి అనుసంధానం చేయాలని తెలిపింది. దీనిపై అభ్యంతరాలు, సూచనలను నెల రోజుల్లోగా director. nmc@nmc. org. inకు ఈ మెయిల్ ద్వారా పంపాలని సూచించింది.

క్యాన్సర్‌కు మెరుగైన వైద్య సేవలందిస్తాం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- ప్రతిష్టాత్మక హెల్త్ కేర్ గ్లోబల్ సంస్థతో వైద్య శాఖ ఒప్పందం
- డాక్టర్లు, సిబ్బందికి శిక్షణ, క్యాంపులు నిర్వహించేలా ఎంవోయూ



మంత్రి రజిని సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హెచ్‌సీజీ ప్రతినిధి, ఏపీవీవీపీ కమిషనర్

సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా, జాతీయంగా ప్రసిద్ధి చెందిన వైద్య సంస్థల సహకారంతో రాష్ట్రంలోని క్యాన్సర్ రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గురువారం మంగళగిరిలోని మంత్రి కార్యాలయంలో దేశంలోనే ప్రతిష్టాత్మక క్యాన్సర్ వైద్య సంస్థ అయిన హెల్త్ కేర్ గ్లోబల్ సంస్థతో రాష్ట్ర వైద్య శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన హెల్త్ కేర్ గ్లోబల్ సంస్థ అంతర్జాతీయ వైద్యులతో క్యాన్సర్‌కు చికిత్స అందిస్తోందని చెప్పారు. క్యాన్సర్‌లను గుర్తించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లా ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులకు శిక్షణ ఇవ్వడం, న్యూట్రిషన్, యోగా తదితర అంశాలపై తర్ఫీదు అందించడంతోపాటు ప్రతి నెలా జిల్లా ఆస్పత్రుల్లో 30 క్యాంపులు నిర్వహించడం వంటివాటిపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. క్యాన్సర్ రోగుల విషయంలో సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని మంత్రి రజిని వివరించారు. ప్రతి రోగికి అత్యాధునిక వైద్యం పూర్తి ఉచితంగా మన రాష్ట్రంలోనే అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకోసం కడప, కర్నూలులో రాష్ట్ర స్థాయి క్యాన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో క్యాన్సర్ వైద్యాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క క్యాన్సర్ రోగానికి సంబంధించే 400కు పైగా ప్రొసీజర్లను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ ద్వారా క్యాన్సర్ వైద్యానికే రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నవీన్‌కుమార్, జె.నివాస్, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ బి.వల్లి, హెచ్‌సీజీ ప్రతినిధులు డాక్టర్ ఈఎస్ విశాల్‌రావు, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరైనా 'కేవలం' ఈ ప్రాపంచిక జీవితం, దాని విలాసాలనే కోరుకుంటే, వారు ఈ జీవితంలో చేసినవాటికి మేము పూర్తిగా చెల్లింపులు జరుపుతాం - ఏ ఒక్కటీ వదిలిపెట్టం.

- ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, డిసెంబర్, 16

ఘర్షణ పెరిగి... గౌరవం తగ్గి...

మొన్న తమిళనాడు... నిన్న పశ్చిమ బెంగాల్... నేడు కేరళ... మరి రేపు? వరుస చూస్తుంటే, కేంద్ర పాలకుల చెప్పుచేతల్లో ఉంటారని పేరుబడ్డ గవర్నర్లపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు గట్టిగానే సమర శంఖం పూరిస్తున్నట్టు అర్థమవుతోంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు కులపతి అనే గౌరవ హోదా నుంచి గవర్నర్లను ఒక్కో ప్రభుత్వం సాగనంపుతోంది. ఇతర రాష్ట్రాల బాటలో ఇప్పుడు కేరళ శాసన సభ సంబంధిత బిల్లును ఆమోదించింది. గవర్నర్ స్థానంలో విద్యావేత్తల్ని ఛాన్సలర్‌గా నియమించే విశ్వవిద్యాలయ చట్టాల (సవరణ) బిల్లుకు కేరళ అసెంబ్లీ మంగళవారం ఓకే అంది. పలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థకూ, ప్రజాప్రభుత్వాలకూ మధ్య ఘర్షణకు ఇది తాజా ఉదాహరణ.

కేరళలోని వామపక్ష సర్కారుకూ, గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కూ మధ్య కొంతకాలంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు అనుగుణంగా జరగలేదంటూ, కేరళ టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ (వీసీ) నియామకాన్ని సుప్రీమ్ కోర్ట్ కొట్టేయడంతో రాజ్‌భవన్‌తో సర్కారు వారి రచ్చ షురూ అయింది. సుప్రీమ్ చట్ట విరుద్ధమన్న పద్ధతిలోనే మరో 11 మంది వీసీల నియామకం జరిగిందంటూ, ఆ వీసీలు రాజీనామా చేయాల్సిందేనని గవర్నర్ తాఖీదులిచ్చారు. నిజానికి, రాష్ట్ర ఉన్నత విద్యలో రాష్ట్ర చట్టాలు, యూజీసీ చట్టానికి విరుద్ధంగా ఉంటే తప్పు కానీ, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ వీసీల నియామకాన్ని కొట్టేయడం సరి కాదని రాజ్యాంగ నిపుణుల మాట. మొత్తానికి, తలనొప్పి గవర్నర్లను వర్సిటీల నుంచి తప్పించడమే ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు మార్గమవుతోంది.

ప్రస్తుతం దేశంలో బీజేపీ మినహా మిగతా పక్షాలన్నీ ఢిల్లీ పాలకులతో, వారికి ఏజెంట్లుగా పని చేస్తున్నారని అపకీర్తి సంపాదిస్తున్న గవర్నర్లతో విసిగిపోతున్నాయనడానికి ఇది ఓ నిదర్శనం. గవర్నర్లను కులపతి పీఠం నుంచి కదిలించే ప్రక్రియ ఊపందుకుంది అందుకే. ఈ ఏడాది ఏప్రిల్‌లో తమిళనాట స్టాలిన్ సర్కార్ రెండు బిల్లులు తెచ్చింది. గవర్నర్ బదులు రాష్ట్రప్రభుత్వమే వీసీలను నియమించేలా బిల్లులో నిబంధనలు పెట్టింది. ఇక, జూన్‌లో పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర వర్సిటీలకు ముఖ్యమంత్రినే కులపతిని చేస్తూ, మమత మంత్రివర్గం నిర్ణయించింది. మహారాష్ట్ర సర్కార్ సైతం రాష్ట్ర వర్సిటీల్లో వీసీల నియామక ప్రక్రియను మారుస్తూ 2021లోనే బిల్లు తేవడం గమనార్హం.

తాజాగా కేరళ సర్కారు తన అధికారాలకు కత్తెర వేసిన కొత్త బిల్లును అక్కడి వివాదాస్పద గవర్నర్ ఎలాగూ ఆమోదించరు. కథ రాష్ట్రపతి వద్దకు చేరుతుంది. తర్వాత మలుపులేమిటో చూడాలి. నిజానికి, రాష్ట్రాల సమాఖ్య అయిన మన దేశంలో కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్య సంబంధాలు సవ్యంగా సాగట్లేదు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై భారత ప్రభుత్వం గతంలో సర్కారియా కమిషన్ వేసింది. తర్వాత రెండు దశాబ్దాలకు 2007లో పూంఛీ కమిషన్ వేసింది. పూంఛీ కమిషన్ 2010లో గవర్నర్ల పాత్ర సహా అనేక అంశాలపై 273 సిఫార్సులు చేసింది. రాజ్యాంగంలో చెప్పని అధికారాలనూ, హోదాలనూ కట్టబెట్టి గవర్నర్‌పై భారం మోపితే, వివాదాలు, విమర్శలు తప్పవు అంది. ఇప్పుడు ఆ సిఫార్సు ఆసరాతోనే బెంగాల్ మమత నుంచి కేరళ పినరయ్ విజయన్ దాకా అందరూ గవర్నర్‌ను వర్సిటీల నుంచి పక్కనబెడుతున్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ఇలాగే చేసింది. 2013లో గుజరాత్‌లోని నాటి మోదీ సర్కార్ సైతం వర్సిటీల ఛాన్సలర్‌గా వీసీల నియామకానికి గవర్నర్‌కున్న అధికారాలు తీసేసింది. కేంద్రంలో సొంత సర్కారొచ్చాక 2015లో తమ గవర్నర్‌తో దానికి ఆమోదమూ వేయించుకుంది. అలాగే, కొత్త ప్రభుత్వం ఎన్నికైనప్పుడూ, ఏటా తొలి సమావేశంలోనూ అసెంబ్లీలో గవర్నర్ ప్రభుత్వ విధాన ప్రసంగం చేయడం 176వ అధికరణం కింద రాజ్యాంగ విహితం. జనవరి బడ్జెట్ సమావేశాల్లో దాన్ని పక్కనపెట్టాలని కేరళ సర్కార్ యోచిస్తోందట. ఇప్పటికే తెలంగాణ సర్కార్ తమతో తరచూ విభేదిస్తున్న గవర్నర్‌ను పక్కనబెట్టి, ఈ ఏడాది ఇలాంటి పనే చేసింది. నిరవధిక వాయిదా తర్వాత అసెంబ్లీని ప్రొరోగ్ చేస్తున్నట్టు ప్రకటించలేదన్న సాంకేతిక మిష రాష్ట్ర సర్కార్లకు అందివస్తోంది. ఇతరులకిది అనుకోని ఆదర్శమైంది.

సాంకేతికంగా అది సరైనదైనా, సభా సంప్రదాయం, గౌరవాల రీత్యా సమర్థించలేం. రాష్ట్ర ప్రథమ పౌరులని పిలుచుకొనే గవర్నర్ పీఠానికే అది అగౌరవం. వ్యక్తుల వ్యవహారశైలి సరిగ్గా లేదని, వ్యవస్థనే తృణీకరించి, తూష్ణీభావం చూపితే అది భవిష్యత్తుకు సత్సంప్రదాయం కాదు. అలాగని రాజ్యాంగ నామినేటెడ్ పదవిలోని గవర్నర్లు సైతం ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలు పంపిన ఫైళ్ళను అకారణంగా పెండింగ్‌లో పెట్టడం తప్పు. రాజ్‌భవన్‌లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడం పార్టీలకు అతీతంగా పాలకులందరూ కొన్నేళ్ళుగా చేస్తున్న తప్పున్నర తప్పు.

రాష్ట్రానికి పెద్దగా గవర్నర్ చేయాల్సింది - మంచీచెడూల మార్గదర్శనమే! అలా కాక, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కాదని తానే సర్వంసహా అనుకొని, పగ్గాలు చేతబట్టి సమాంతర సర్కార్ నడపాలనుకుంటేనే సమస్య. ప్రజా ప్రభుత్వాల అజెండాను కాక, పదవి ఇచ్చిన ఢిల్లీ పెద్దల అజెండాల ప్రకారం నడుచుకోవాలని గవర్నర్లు ప్రయత్నిస్తే అది వ్యవస్థ గౌరవాన్ని మరింత పలచన చేస్తుంది. రాష్ట్ర సర్కార్ల ప్రతిచర్యలను ప్రోత్సహిస్తుంది. గవర్నర్‌కూ, గవర్నమెంట్‌కూ మధ్య ఈ సంఘర్షణ వైఖరి ప్రజాస్వామ్యానికి క్షేమం కాదు! ఎవరికీ శోభస్కరమూ కాదు!!

పని చేయాలన్నా బలం ఏది?

విశ్లేషణ



అనిందో చక్రవర్తి

కార్మిక శక్తి నుంచి చాలామంది భారతీయులు వైదొలుగుతున్నారు. పని చేయగల వయసు వారిలో 46 శాతం మాత్రమే పనిచేస్తున్నారు లేదా పని చేయాలనుకుంటున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ చెబుతోంది. కారణం ఏమిటి? పేదలకు అందుబాటులో ఉన్న పనులను వారు శారీరకంగా చేయగల స్థితిలో లేరు. నాలుగింట మూడొంతుల ఉపాధి వ్యవసాయం, నిర్మాణ, వాణిజ్య రంగాలే కల్పిస్తున్నాయి. ఈ మూడు రంగాలూ పెద్దగా డబ్బులు చెల్లించడం లేదు. పైగా రెండు రంగాలైతే కార్మికుల వెన్ను విరిచేస్తున్నాయి. దాంతో కఠిన శ్రమ చేయడానికి అవసరమైన పోషణ వీరికి అందడం లేదు. కాబట్టి వీరు పని నుండి తప్పుకొంటున్నారు. మన మీడియా వర్ణిస్తున్న 'ఉచితాలపై' శాశ్వతంగా ఆధారపడుతున్నారు. ఇదొక విష వలయం!

పేద దేశాల ప్రజలు వేతన శ్రమ కోసం వేసారి పోతున్నారు. చట్టబద్ధంగా పనిచేయగల 15 సంవత్సరాల వయసు రాకముందే వారు తమ పిల్లలను పనికి పంపిస్తున్నారు. తక్కువ ఆదాయాలు గల దేశాల్లోని పని చేయగల జనాభాలో సగటున 66 శాతం మంది పనిచేస్తున్నారనీ, లేదా పని చేయాలని అనుకుంటున్నారనీ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) చెప్పింది. అధికాదాయ దేశాల్లో ఈ నిష్పత్తి 60 శాతం ఉంది. పేద ప్రజలు ఏ వయసులో ఉన్నా వారు పనిచేయాల్సి ఉంటుందనేది అర్థం చేసుకోదగినదే. అదే సంపన్నుల విషయానికి వస్తే వయసు మీరగానే శ్రామిక శక్తి నుంచి తప్పుకోగలరు.

భారత్ విషయానికి వస్తే ఈ తర్కం మారిపోతుంది. భారతీయ శ్రామిక జనాభాలోని 46 శాతం మాత్రమే పని చేస్తున్నారు లేదా పని చేయాలనుకుంటున్నారు. ఇవి ఐఎల్ఓ గణాంకాలు. అదే సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) నుంచి మీరు గణాంకాలు తీసుకున్నట్లయితే, అవి షాక్ కలిగిస్తాయి. 2020 ఫిబ్రవరిలో అంటే కోవిడ్-19 మహమ్మారి మనపై దాడి చేయకముందు భారతీయ శ్రామిక జనాభాలో 44 శాతం మాత్రమే పని చేయాలనుకుంటున్నారని ఈ డేటా చెప్పింది. 2022 అక్టోబర్ నాటికి ఇది 40 శాతానికి పడిపోయింది. అంటే పనిచేసే వయసు విభాగంలోకి వచ్చిన భారతీయుల్లో 60 శాతం మందికి పనిలేదు లేదా వారు పనిచేయాలని కోరుకోవడం లేదు.

దీనికి అతి పెద్ద కారణం ఏమిటంటే, పని చేయగల వయసులో ఉన్న భారతీయ మహిళల్లో కొద్దిమంది మాత్రమే డబ్బు వచ్చే పని చేయగలుగుతున్నారు. 1990 నుంచి 2006 మధ్య కాలంలోని ఐఎల్ఓ డేటా 32 శాతం మహిళలు మాత్రమే శ్రామిక శక్తిలో పాల్గొంటున్నారనీ, వీరు డబ్బు వచ్చే పని చేస్తుండటం లేదా అలాంటి పని చేయాలనుకుంటున్నారనీ చెబుతోంది. అదే 2019 నాటికి ఇది 22 శాతానికి పడిపోయింది. ఇక సీఎంఐఈ డేటా మరింత నిరాశాజనకమైన విషయాన్ని బయటపెట్టింది. 2020 ఫిబ్రవరిలో అంటే కోవిడ్ లాక్‌డౌన్లు రాకముందు పనిచేయగల వయసులో ఉన్న 12 శాతం మహిళలు మాత్రమే దేశంలో పనిచేస్తున్నారు లేదా పని చేయాలనుకుంటున్నారు. 2022 అక్టోబర్ నాటికి ఇలాంటి వారి సంఖ్య 10 శాతానికి పడిపోయింది. అదే చైనాతో పోల్చి చూసినట్లయితే పనిచేసే వయసు ఉన్న 69 శాతం మంది మహిళలు అక్కడ కార్మిక శక్తిలో పాల్గొంటున్నారు.

భారతదేశంలో అధోగతిలో ఉన్న మహిళా కార్మికశక్తి భాగస్వామ్య రేటు, పెరుగుతున్న మన ఐశ్వర్యంతో పోలిస్తే అనుషంగిక నష్టంలా కనిపిస్తోందని ఆర్థికవేత్తలు వివరిస్తున్నారు. ఇంటి బయట మహిళలు పనిచేయడం అంటేనే భారతీయులు మొహం చిట్లించుకుంటారు. కానీ డబ్బుకు కటకట అవుతున్న పరిస్థితుల్లో వారికి అంతకు మించిన



అవకాశం మరొకటి లేదు. భారతీయులు రానురానూ దారిద్ర్యం నుంచి బయటపడుతున్న కొద్దీ వారి మహిళలు పనిచేయడం ఆపివేసి ఇళ్లకు మరలిపోతున్నారు. ఐశ్వర్యం అనేది పేదలను కూడా సంస్కృతీకరణ ప్రభావానికి గురి చేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. పేదలు కూడా ఆదాయ నిచ్చెన పైకి ఎక్కుతున్న కొద్దీ మహిళల పట్ల సాంప్రదాయిక భావజాలం వైపు వెళ్లిపోతున్నారు.

సౌకర్యంగానే ఉందనిపిస్తున్న ఈ ధోరణిలో రెండు సమస్యలు ఉన్నాయి. ఒకటి: 2005-06లో కార్మిక శక్తిలో మహిళా భాగస్వామ్యం గుర్తించదగినంత అధికంగా ఉన్నప్పుడు కూడా పిరమిడ్ దిగువ భాగంలో ఉన్న భారతీయ గృహాలు సంపన్నంగా మారాయనడానికి ఎలాంటి సాక్ష్యమూ లేదు. రెండు: కొద్దిమంది మహిళలు మాత్రమే వేతనం వచ్చే పనిని కోరుకుంటున్నారని అనుకుంటే, వారు సులభంగా ఉద్యోగం సంపాదించగలగాలి. కానీ వాస్తవం దానికి వ్యతిరేకంగా ఉంది. దేశంలో పురుషుల నిరుద్యోగితా రేటు 8.6 శాతం ఉండగా, మహిళల్లో నిరుద్యోగితా రేటు మూడు రెట్లకంటే ఎక్కువగా 30 శాతం ఉందని సీఎంఐఈ అక్టోబర్ నెలకు ప్రకటించిన తాజా గణాంకాలు చెబుతున్నాయి. దీని అర్థమేమిటంటే, భారత దేశంలో ప్రతి 100 మంది శ్రామిక మహిళల్లో 10 మంది మాత్రమే పనికోసం చూస్తున్నారు. ఇందులోనూ ఏడుగురికి మాత్రమే డబ్బు వచ్చే పని దొరుకుతోందన్నమాట.

మరి 2019లో మగవారి పరిస్థితి ఏమిటి? కోవిడ్‌కి ముందు, పనిచేసే వయసులోని భారతీయ పురుషుల్లో 73 శాతం మంది కార్మిక శక్తిలో పాల్గొనేవారని అంతర్జాతీయ కార్మిక సంస్థల లెక్కలు సూచించాయి. దిగువ, మధ్య ఆదాయ దేశాల్లోని 74 శాతంతో పోలిస్తే ఇది కాసింత తక్కువే. 2019 మధ్యలో పురుషుల కార్మిక శక్తి భాగస్వామ్య రేటు గురించిన సీఎంఐఈ డేటా ప్రకారం కూడా ఇది 72 నుంచి 73 శాతం మధ్య ఉంటోంది. ఇది 2022 అక్టోబర్ నాటికి 66 శాతానికి పడిపోయింది.

2020 ఫిబ్రవరి నుంచి (కోవిడ్ లాక్‌డౌన్లకు ముందు) 2022 అక్టోబర్ మధ్యనాటికి భారత్‌లో పనిచేసే వయసులో ఉన్న పురుషుల జనాభా 4.6 కోట్లకు పెరిగింది. కార్మిక శక్తి భాగస్వామ్య రేటు అదే స్థాయిలో ఉండివుంటే, మరో 3.3 కోట్లమంది పురుషులు కొత్తగా పని కోసం వెదుకుతూ ఉండాలి. కానీ ఈ సంఖ్య 13 లక్షలకు మాత్రమే పెరిగింది. ఫలితంగా 3.2 కోట్లమంది పనిచేసే వయసులోని పురుషులు కార్మిక శక్తి నుంచి వైదొలిగారు.

దీనికి సంబంధించిన సమగ్ర వివరణ ఏదంటే, భారతదేశంలోని పేదలకు అందుబాటులో ఉన్న ఉద్యోగాల తీరు చూస్తే వారు శారీరకంగా పనిచేయగల స్థితిలో లేరు. దేశంలోని అన్ని ఉద్యోగాల్లో నాలుగింట మూడొంతులు వ్యవసాయం, నిర్మాణరంగ, వాణిజ్య రంగాలే కల్పిస్తున్నాయి. ఈ మూడు రంగాలూ పెద్దగా డబ్బులు చెల్లించడం లేదు. వీటిలో రెండు రంగాలైతే కార్మికుల వెన్ను విరిచేస్తున్నాయి. ఎనిమిది గంటలు పనిచేసే రైతు 4,500 కేలరీలను నష్టపోతుంటారనీ, అదే సమయం పనిచేసే నిర్మాణ కార్మికుడు 4,000 కేలరీలను కోల్పోతుంటాడనీ యూరప్ అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక భారత్‌లో నిర్మాణ రంగం మరింత తీవ్ర శ్రమతో కూడుకున్నది కాబట్టి దీనికి మరింత శక్తి అవసరం.

దాదాపు 16 శాతం భారతీయులు పోషకాహార లేమితో ఉన్నారని ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) అంచనా. అంటే పని చేయగలిగే జనాభాలోని పేద ప్రజల్లో అధిక భాగం కఠిన శ్రమ చేయడానికి అవసరమైన కేలరీలలో సగం కూడా పొందలేదని దీని అర్థం. వారు రేషన్లు, ప్రభుత్వం అందించే ఉచితాలు, తమ గ్రామ కమ్యూనిటీ అందించే మద్దతుతో మనగలుగుతున్నారు. ఇదొక విష వలయం. ప్రభుత్వ రేషన్లు నిశ్చల జీవితానికి మద్దతు ఇచ్చేంతగా మాత్రమే పనికొస్తాయి. పేదలు తమ ప్రస్తుత పోషకాహార స్థాయికి తగిన పనులు పొందలేరు. కాబట్టి వారికి మరొక దారి లేదు. అందుకే మన మీడియా వర్ణిస్తున్న 'ఉచితాలపై' శాశ్వతంగా ఆధారపడుతున్నారు.

మనం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారత్ ఊహించిన పంథాకు ఇది పూర్తిగా తిరోగమన దిశలో ఉంది. కఠిన శ్రమ నుంచి పరిశ్రమల్లోని యాంత్రిక శ్రమ వైపు కార్మికులను తరలించడానికి బదులుగా ఈరోజు అత్యంత కఠినమైన పనితో కూడిన ఉపాధి అవకాశాలు మాత్రమే దొరుకుతున్నాయి. దీన్నుంచి బయటపడటానికి ఏకైక మార్గం ఏదంటే- ప్రభుత్వం తక్షణ లాభాలను త్యాగం చేసి అధిక ఉద్యోగావకాశాలు, మెరుగైన పని పరిస్థితులు, ఉపాధిని కల్పించే యాంత్రీకరణ వైపు మరలడమే. ఇది జరగనంతవరకూ భారత్ తన ప్రజల్లో మెజారిటీకి కేవలం జీవనాధార ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోతుంది.

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక సందేహం



నిజానికి మొరాకోను ఆఫ్రికా జట్టు అనాలి, కానీ అందులో ఒక్క నల్ల మనిషి కూడా జట్టు కోసం ఆడటం లేదు. మరోవైపున ఫ్రాన్స్ ఒక యూరోపియన్ టీమ్. కానీ ఆ జట్టు కోసం చాలామంది నల్లవాళ్లు ఆడుతున్నారు. మరి ఇందులో ఏది ఆఫ్రికా జట్టు అన్నట్టు?

- తారేక్ ఫతాహ్, కాలమిస్ట్

డాన్ డాన్



రాజరికం చచ్చిపోయింది. ఎప్పుడో ఉనికి కోల్పోయినా 'రాణి' దశాబ్దాలు లాక్కొచ్చారు. ఆమె పోయింది. ఇక దాన్ని మూసేయాలి. రాజ భవనాలను మ్యూజియంలుగా మార్చాలి. ఎక్కడి నుంచి దొంగిలించిన మణులను అక్కడికి తిరిగిచ్చేయాలి. ఆ వంశీయులు చేయగలిగే పనికొచ్చే పని ఏదీ లేదు కాబట్టి, వాళ్లు ఎటైనా పోనీ!

- ఆసిఫ్ కపాడియా, సినిమా దర్శకుడు

ఆట ఆటకాదు!



ప్రపంచ కప్ ఫుట్‌బాల్ సెమీ ఫైనల్లో ఫ్రాన్స్ గెలిచాక రాజధాని ప్యారిస్‌లో అలర్లు! ఫ్రాన్స్ గెలుస్తుంది, వాళ్లు ప్యారిస్‌ను కాల్చేస్తారు. ఫ్రాన్స్ ఓడిపోతుంది, అప్పుడూ వాళ్లు ప్యారిస్‌ను కాల్చేస్తారు.

- ఎలీ డేవిడ్, పరిశోధకుడు

ముందది 'బొక్కల దవాఖానా'



మీకు తెలుసా? ద నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లేదా నిమ్స్ 1964లో ప్రారంభమైనప్పుడు నిజామ్స్ ఆర్థోపెడిక్స్ హాస్పిటల్ అనేవారు. తర్వాత 1976లో అది నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ అండ్ స్పెషాలిటీస్ అయింది. 1989లో నిమ్స్‌గా మారింది.

- సయ్యద్ అక్బర్, సంపాదకుడు

ఇదొక వింత



అఫ్గానిస్తాన్ వార్ కమిషన్‌లో ఒక పాకిస్తానీ ఉండటం అంటే, అది 9/11 దాడులను విచారించే బాధ్యతను అల్-ఖాయిదాకు అప్పగించడంతో సమానం.

- హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

వచన కవితా మూర్తి

జాషువా, విశ్వనాథల ప్రేరణా ప్రభావాలతో పద్య కవిత రచనకు పూనుకున్నాడు కుందుర్తి ఆంజనేయులు. విశ్వనాథ వారి ప్రౌఢమైన శైలిలో 'సౌప్తికం' అనే కావ్యాన్ని రచించాడు. ఆయన 1922 డిసెంబర్ 16వ తేదీన నరసరావుపేట సమీపంలో కోటవారిపాలెంలో పేదకుటుంబంలో జన్మించాడు. నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌లో అనిసెట్టి, రెంటాల, బెల్లంకొండ రామదాస్, మాచిరాజు దేవీ ప్రసాదులు ఆయన సహాధ్యాయులు. మాచిరాజు దేవీప్రసాద్ ప్రేరణతో శ్రీశ్రీ కవిత్వ లాలసుడై వచన కవిత్వం వైపు దృక్పథం మరల్చుకున్నాడు. నవ్యకళా పరిషత్, నరసరావుపేట ఆధ్వర్యంలో ఏల్చూరి, బెల్లంకొండ రామదాసులతో కలసి తెలుగులో తొలి వచనా కవితా సంపుటి 'నయాగరా'ను 1944లో ప్రచురించాడు. తొమ్మిది కవితల సంపుటి నయాగరాలో కుందుర్తి రచించిన 'మన్యంలోకి' కవితలో మన్యం వీరుడు అరి విప్లవాగ్నిని ప్రశంసించాడు. 'జయిస్తుంది' కవితలో బ్రిటిష్ వారి దురాగతాలను నిరసించాడు. క్విట్ ఇండియా ప్రభావంతో అసమ సమాజాన్ని ఈసడిస్తూ 'ఒకవేపున అధికోత్పత్తీ/ మరోవేపు డొక్కల కరువు' ఇకపై సాగవని హెచ్చరిక చేశాడు. ఆయన కవితలపై శ్రీశ్రీ మహాప్రస్థానం గేయం ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.



'పాతకాలం పద్యమైతే / వర్తమానం వచన గేయం' అంటూ 'నాలో నినాదాలు'లో కుందుర్తి స్పష్టంగా ప్రకటించాడు. ఎందరో అధునిక కవులను ప్రభావితం చేశాడు. అనిసెట్టి, ఆరుద్ర, దాశరథి, సి. నారాయణ రెడ్డి, రెంటాల వంటి వారు వచన కవితను ఆదరించి వచన కవితా సంపుటాలు ప్రచురించారు. వచనకవితా మూర్తి కుందుర్తికి ఫ్రీవర్స్ ఫ్రంట్ ఊపిరి. ప్రాచీన కవిత్వంపై తిరుగుబాటు చేసి 'రచనల పూలతోటలో ఛందస్సుల మొక్కలు నాటను' అని ప్రతిజ్ఞ చేశాడు. ఆధునిక కాలానికి అనువైన ప్రక్రియ వచన కవిత్వమేనని నిరూపించేందుకు ఎంతో శ్రమపడ్డాడు.


ఫ్రీవర్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో వ్యాసాలు, పీఠికల ద్వారా వచన కవితా ప్రచారం ముమ్మరంగా చేసినందున కుందుర్తిని వచన కవితా పితామహుడిగా విమర్శకులు పేర్కొన్నారు. ఆశ, ఆచారిగారి అమ్మాయి, శిక్ష వంటి గేయ నాటికలు రాశాడు. తెలంగాణ, యుగేయుగే, నగరంలో వాన, నాలోని నాదాలు, కుందుర్తి కృతులు పాఠకుల మన్ననలు పొందాయి. 'హంస ఎగిరిపోయింది' అనే సతీస్మృతి కావ్యం విశిష్టమైంది. ఆయన కవిత్వంలో అభ్యుదయ దృక్పథం, హేతువాద దృష్టి, ప్రకృతిని సామాజిక స్పృహతో సమన్వయించటం, చమత్కారమైన అధిక్షేపణ, ఆకర్షణీయమైన అంత్యప్రాసలు ఎందరో యువకులను ప్రభావితం చేశాయి. ఆయన 1982 అక్టోబర్ 25వ తేదీన మరణించినా, వచన కవితా పితామహుడిగా ఆధునికాంధ్ర కవిత్వంలో చిరస్మరణీయుడు!

- డాక్టర్ పీవీ సుబ్బారావు, సాహితీ విమర్శకులు । 98491 77594

(నేడు కుందుర్తి ఆంజనేయులు శత జయంతి ముగింపు)

మందల బడి మురుస్తాంది గొర్రె

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

జిద్దు ఇడ్వని విక్రమార్కుడు మోటర్ దీస్కోని బొందల గడ్డ దిక్కు బోయిండు. గాడ రొండంత్రాల బంగ్లల బేతాలుడు ఉంటున్నడు. పొద్దుబోకుంటె టివిల ఫుట్‌బాల్ మ్యాచ్ జూస్కుంట గూసున్నడు. ఇంటి ముంగట మోటరాపి విక్రమార్కుడు హారన్ గొట్టిండు. టివి బంద్ జేసి బేతాలుడు ఇవుతలకొచ్చిండు. మోటరెన్క సీట్ల ఆరాంగ గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు మోటర్ నడ్ప బట్టిండు.

''ఇగమున్నా, సిగలేటు ముట్టిచ్చెతందుకు ఇంగలం దొరకకున్నా, ఆనగొట్టి తొవ్వలు చెర్ల తీర్గ అయినా మోటర్ దీస్కోని వొస్తవు. గుంతలు, ఎత్తు గడ్డలని సూడకుంట మోటర్ నడ్పుతవు. ఎవడన్న సైడియ్యకుంటె నీకు కోపం రావొచ్చు. నీ యాస్టనంత యాది మర్సెతందుకు బీఆర్ఎస్ కత జెప్త ఇను'' అని అన్నడు బేతాలుడు.

''చెప్పుడు నీ పనైతె ఇనుడు నా పనే గదా'' అని విక్రమార్కుడు అన్నడు.


''కతంత అయినంక నేనడ్గేటి సవాల్కు జవాబ్ జెప్పుడు గుడ్క నీ పనే. బొంతు పుర్గు సీతాకోక చిల్క అయిన తీర్గ టీఆర్ఎస్ పార్టి బీఆర్ఎస్ అయ్యింది. టీఆర్ఎస్ జెండల తెలంగాన నక్ష ఉన్నది గని బీఆర్ఎస్ జెండల బారతదేసం జెండ ఉన్నది. బీఆర్ఎస్ అంటె బరండి, రమ్ము, స్కాచ్ అని కొందరనబట్టింండ్రు. టీఆర్ఎస్ బీఆర్ఎస్ అయ్యింది; బీఆర్ఎస్ వీఆర్ఎస్ అయితదని రేవంత్ రెడ్డి అసువంటోల్లు అనబట్టింండ్రు.''

''ఇంతకు బీఆర్ఎస్ అంటె ఏంది?''

''భారత రాష్ట్ర సమితి. ముందుగాల రాష్ట్రం సంగతి జూస్కోవాలె. అటెంకల దేసంను బాగ జేస్త ననాలె. గట్ల గాకుంట కేసీఆర్ ఇల్లు మించిన పందిరేస్తున్నడు. ఎంటిక పోసతోని గుట్టను గుంజాలని సూస్తున్నడు.''

''తెలంగాన గురించి కేసీఆర్ ఎన్నిటినో జేస్తె గిట్లంటవేంది?''

''శాన జేసిండు. మాటల్తోని కోటలు గట్టిండు. రొండేండ్ల కిందట వాసాల మర్రి ఊరును దత్తు దీస్కుండు. యాదాదిల గా ఊరును బంగారి మర్రి జేస్తనన్నడు. రొండు సూర్ల గజాల వొంతున అందర్కి ఇండ్లు గట్టిపిచ్చి ఇస్తనన్నడు. శ్రమదానం కమిటి, హరిత హారం కమిటి అసువంటి కమిటిలు ఏసిండు. మొగులు మీది సర్గంను కిందికి దించుతనని ఒక్క తీర్గ జెప్పిండు. తొవ్వ ఏసెతందుకు అడ్డమున్నయని శానమంది ఇండ్లను కూలగొట్టింండ్రు. అంగన్‌వాడి, బడి, పంచాయతి ఆపీస్, చెర్వులను బాగ జేసెతందుకు 150 కోట్లు కర్సయితదని అప్సర్లు సర్కార్‌కు జెప్పింండ్రు. గని ఇదువర దాంక సర్కార్ ఒక్క రూపాయి గుడ్క మంజూరు జెయ్యలేదు. గిప్పుడు వాసాల మర్రిల వాసాలే మిగిలినయి. కొత్త ఇండ్లేమొగని ఉన్న ఇండ్లు బోయినయి'' అని బేతాలుడు



అన్నడు.

''ఇంతకు కేసీఆర్, బీఆర్ఎస్ జెండను యాడ ఎగిరేసిండు?''

''డిల్లిల సర్దార్ పటేల్ మార్గ్‌ల ఒక బంగ్లను కిరాయికి దీస్కుండు. తీస్కునే ముంగట గది వాస్తు ప్రకారం మంచి గున్నదా లేదా అని అర్సుకుండు. పెండ్లాం, పిల్లలను దీస్కోని డిల్లికి బోయిండు. అయ్యగార్లు బెట్టిన మంచి మూర్తంల నవ చండీయాగం జేసిండు. యాగ మైనంక 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అని వొచ్చి నోల్లందరు వొర్లుతుండంగ బీఆర్ఎస్ జెండ ఎక్కిచ్చిండు. మంగలార్తి దీస్కోని పార్టి అపీస్లకు బోయిండు.''

'మోదీ జైశ్రీరాం అంటడు. జైశ్రీరాం గాదు జైసియా రాం అనాలని రాహుల్ గాందీ అంటున్నడు. రాంరాం అన్కుంట సీతా మాతను ఇడ్సిపెడ్తె ఎట్లని అడుగుతున్నడు. మన దేసమే గాకుంట దునియంత మంచి గుండెతందుకే రాజ శ్యామల యాగం జేసినని కేసీఆర్ అంటున్నడు. గీల్లు గిట్లెందుకు జేస్తున్నరు'' అని విక్రమార్కుడు అడిగిండు.

''లీడర్లందరు మతం పేరు మీద మాయలు జేస్తుంటరు. గుళ్లు గట్టిస్తరు. దీపాలు ముట్టిస్తరు. జెనాలను గొర్లను జేస్తరు. జెనం గొర్రెలు గుడ్క లీడర్ల యెంబడి దిరుక్కుంట మురుస్తుంటయి. రేపొద్దుగాల ఏమైతయో మరుస్తుంటయి. దేసంల అన్నిటి కన్న ఎక్వ గొర్లున్న రాష్ట్రం తెలంగాన అని గీనడ్మ ఒక పేపర్ల రాసింండ్రు ఎందుకు? గీ సవాల్కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ బిరక్ ఫేలైతది'' అని బేతాలుడన్నడు.

''ముందుగాల నీ లెక్కనే నాకు అర్తం గాలేదు. జెర సోంచాయిస్తె అర్తమైంది. ఆడు అబద్ధం రాయలేదు. ఉన్న నిజమే రాసిండని'' విక్రమార్కుడు జెప్పిండు.

ఇంతల బొందల గడ్డ వొచ్చింది. బేతాలుడు మోటర్ దిగి ఇంట్లకు బోయిండు.

తోక:- ''నేను ఇంటర్ల ఫస్ట్ కిలాస్ల పాసైన. గీ సదువుతోని నీకు కొల్వు యాడ దొరుక్తది. డిగ్రి మంచిగ సద్వు. మంచిగ సద్వకుంటివా అంటె మిర్చి బజ్జీలు ఏస్కోని బత్కాలె అని మా నాయిన అన్నడు. డిగ్రీల ఫస్ట్ కిలాస్ల పాసైన. కొల్వు దొర్కలే. బిటెక్ మంచిగ సద్వు. మంచిగ సద్వకుంటివా అంటె మిర్చి బండి బెట్టుకోని బత్కాలె అని మా కాక అన్నడు. బిటెక్‌ల మంచి మార్కు లొచ్చినయి. కొల్వు దొర్కలే. ఎంబిఏ మంచిగ సదివితివా అంటె సర్కార్ కొల్వు దొర్కతది. మంచిగ సద్వకుంటివా అంటె మిర్చి బజ్జీలు ఏస్కోని బత్కాలె అని మా మామ అన్నడు. ఎంబిఏ గుడ్క మంచి మార్కులతోని పాసైన. ఏం లాబం. కొల్వులు లెవ్వు. మిర్చి బజ్జీలేస్కోని బత్కు అని సర్కారోల్లు జెప్పింండ్రు. ముప్పై రూపాయలకు నాలుగు మిర్చి బజ్జీలు. మీకెన్ని బజ్జీలు గావాలె.''

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

పొదుగుడు కోడి

అనుమానం పెనుభూతం అంటారు. అనుమానం అంటె శంక. శంక శరీరాన్ని ఎంతగా కుంచింప చేస్తుందో దానికి పదింతలు మనస్సుని మెలిపెట్టేస్తుంది. ఆలోచనల్ని వణికింప చేస్తుంది. అటు ముందుకూ పోనివ్వదు, ఇటు వెనక్కూ రానివ్వదు. దేనిమీదా మనస్సును లగ్నం చేయనివ్వదు. అందుకే... శంక అనేది సర్వ శక్తి వినాశని. శంక కంటే చిత్తానికి హాని కలిగించేది మరొకటి లేదు. కాబట్టి శంకను తొలగించుకోనివారు సాధించేది ఏమీ ఉండదు.

అందుకే బుద్ధుడు శంకను గురించి చెప్తూ- 'శంక ఉన్నవాడు ధర్మాన్ని శంకిస్తాడు. సంఘాన్ని శంకిస్తాడు. గురువుని శంకిస్తాడు. శ్రద్ధను శంకిస్తాడు. ప్రయత్నాన్ని శంకిస్తాడు. సహచరులను శంకిస్తాడు' అంటాడు. ఈ శంకితులు తమకు తామే దుఃఖ సంకెళ్లను తగిలించుకుంటారు. క్షణ కాలం సుఖంగా బ్రతకలేరు. నిశ్చింతగా నిలువలేరు. నిలబడలేరు. శంకితుల గురించి బుద్ధుడు చెప్పిన ఉపమానం ఇది:



జ్యోతిర్మయం

కోడిపెట్ట గుడ్లు పెడుతుంది. వాటిని ఒక చోట పొదివి చేసి, వాటి మీద పడుకుని పొదుగుతుంది. ఈకలు విచ్చి, రెక్కలు విప్పి గుడ్లను కప్పుతుంది. ఎప్పుడూ ఒకే వైపునకు కాకుండా, అన్ని దిశలకు తిరుగుతూ, గుడ్లను తిప్పుతుంది. అన్ని గుడ్లకు వేడి తగిలేట్టు చేస్తుంది. అంతేగానీ, తన పిల్లలు ముక్కుతో పెంకుని పగల గొట్టుకుని రావాలి అని అనుకోదు. గుడ్డులోంచి పిల్లలు ఎలా రావాలో తాను ఊహలు అల్లుకోదు. తన ప్రయత్నం తాను శ్రద్ధగా చేస్తుంది. తల్లి కోడి తన ప్రయత్నం శ్రద్ధగా చేయడం వల్ల, పిల్లలు పెంకును పగులగొట్టుకుని వచ్చే సమర్థతను సంతరించుకుంటాయి. తల్లి కోడి తన పని తాను చేస్తుంది తప్ప 'పిల్లలు ఎలా వస్తాయి? ఎప్పుడు వస్తాయి? వస్తాయా? రావా?' అని శంకించదు. అలా శంకిస్తే అది సరిగా పొదగలేదు. ఫలితం ఉండదు.

జ్ఞానం, ధ్యానం విషయంలో మనమైనా అంతే... సరైన ప్రయత్నం ఉంటే సరైన ఫలితం దాని వెనుకే ఉంటుంది. అదే బుద్ధుడు చెప్పిన సమ్యక్ ప్రయత్నం!

- బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.అష్టమి రా.10.11 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తర తె.5.27 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి హస్త, వర్జ్యం: ప.11.37 నుండి 1.20 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.37 నుండి 9.20 వరకు, తదుపరి ప.12.15 నుండి 1.01 వరకు, అమృతఘడియలు: రా.9.46 నుండి 11.28 వరకు; రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు; సూర్యోదయం 6.26 ; సూర్యాస్తమయం 5.27.

ఒకేరోజు 80 వేల మంది భవానీల దీక్షల విరమణ


దీక్షలు విరమిస్తున్న భవానీ మాలధారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ గురువారం నుంచి ప్రారంభమైంది. తొలి రోజు 80,000 మందికిపైగా భవానీలు దీక్షలను విరమించినట్లు ఆలయాధికారుల అంచనా. ఉదయం 6.30 గంటలకు హోమగుండాల్లో అగ్నిప్రతిష్ఠాపనతో దీక్షల విరమణ మొదలైంది. అగ్నిప్రతిష్టాపన కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు, దుర్గగుడి ఈవో భ్రమరాంబ పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివచ్చి దీక్షలను విరమించారు. దీక్షల విరమణకు తొలి రోజే భవానీలు పోటెత్తారు. బుధవారం సాయంత్రానికే విజయవాడకి చేరుకున్న భవానీలు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుని అర్ధరాత్రి సమయంలో క్యూలైన్లలోకి చేరుకున్నారు. తెల్లవారుజాము ఆరు గంటలకు కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి.

పెద్ద దర్గాలో రజనీకాంత్, ఏఆర్ రెహ్మాన్ ప్రార్థనలు


దర్గాకు వస్తున్న రజనీకాంత్, ఏఆర్ రెహ్మాన్, రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య

కడప కల్చరల్/తిరుమల: కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గాకు సూపర్ స్టార్ రజనీకాంత్, ఆయన కుమార్తె ఐశ్వర్య, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్, ఆయన ఇద్దరు కుమారులు గురువారం వచ్చారు. వీరికి దర్గా ప్రతినిధులు ఫేటా (తలపాగా) అలంకరించారు. అనంతరం వీరు దర్గాలోని హజరత్ పీరుల్లామాలిక్ మజార్ వద్ద చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని చాదర్ సమర్పించి ప్రార్థనలు, ఫాతెహా చేశారు. కొద్దిసేపు దర్గాలో ధ్యానం చేశారు. దర్గా ముజావర్ అమీర్ వారికి దర్గా చరిత్ర, విశిష్టతల గురించి వివరించారు. దర్గాలోని అన్ని ప్రాంతాలను దర్శింపజేసి వాటి విశిష్టతను తెలియజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌ను కలిసి ఆశీస్సులు పొందారు. రజనీకాంత్, ఏఆర్ రెహ్మాన్‌లను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు.

శ్రీవారి సుప్రభాత సేవలో రజనీకాంత్

తిరుమల శ్రీవారిని రజనీకాంత్ గురువారం సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

క్లుప్తంగా...

సర్వ దర్శనానికి 28 గంటలు

తిరుమల: తిరుమలలో 5 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 28 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. బుధవారం అర్ధరాత్రి వరకు 59,752 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,000 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.65 కోట్లు వేశారు.

22 నుంచి జనవరి 15 వరకు అధ్యయనోత్సవాలు

శ్రీవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి 2023 జనవరి 15 వరకు అధ్యయనోత్సవాలు జరగనున్నాయి. సాధారణంగా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో దివ్యప్రబంధ అధ్యయనంగా పిలిచే ఈ అధ్యయనోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా శ్రీవైష్ణవ జీయంగార్లు స్వామి వారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను గోష్ఠిగానం చేస్తారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను 25 రోజుల పాటు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీవైష్ణవులు పారాయణం చేస్తారు.

రేణిగుంట విమానాశ్రయంలో 'శ్రీవాణి' కౌంటర్ ప్రారంభం


శ్రీవాణి ట్రస్ట్ టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

రేణిగుంట: శ్రీవారి దర్శనార్థం శ్రీవాణి ట్రస్ట్ ఆఫ్‌లైన్ టికెట్ జారీ కౌంటర్‌ను రేణిగుంట ఎయిర్‌పోర్టులో గురువారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రారంభించారు. జేఈవో మీడియాతో మాట్లాడుతూ..శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10,000 విరాళమిచ్చి, టికెట్‌కు రూ.500 చెల్లించే భక్తులకు తిరుమలలో శ్రీవారి దర్శన టికెట్ జారీ చేస్తున్నామని, ఇకనుంచి అక్కడకు వెళ్లవలసిన అవసరం లేకుండా ఎయిర్‌పోర్ట్‌లోనే దర్శన టికెట్లను అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి మాధవం అతిథిగృహంలో శ్రీవాణి టికెట్లు జారీ చేసే కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో కౌంటర్ల నిర్వహణకు ముందుకువచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు జేఈవో కృతజ్ఞతలు తెలిపారు.

యాచకుడే దాతగా మారిన వేళ!

- కోటి రుద్రాక్ష అభిషేక, అర్చనకు రూ.2 లక్షల విరాళం


డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి రూ.2లక్షల నగదు అందజేస్తున్న యడ్ల యాదిరెడ్డి సాధువు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): యాచకుడే దాతగా మారాడు...ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం చేపట్టిన కోటి రుద్రాక్ష అభిషేక, అర్చనకు రూ.2లక్షల విరాళమిచ్చాడు. ఆలయంలో 2023 మార్చి 28న తలపెట్టిన ఈ కార్యక్రమానికి యాచకుడు యాదిరెడ్డి గురువారం రూ.2 లక్షల విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశాడు. యాదిరెడ్డిని గౌతంరెడ్డి అభినందించి, బాబావారి శేషవస్త్రంతో సత్కరించారు. యాదిరెడ్డి గతంలో మందిరంలో గోశాల, దత్తాత్రేయస్వామివారికి వెండి ఆభరణాలు, నిత్యాన్నదానం తదితర కార్యక్రమాలకు రూ.9 లక్షలు విరాళంగా ఇచ్చాడు.

సొంతింటి కల.. సాకారమైన వేళ..!



నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం నిండ్ర మండల పరిధిలోని ఆరూరు ఎస్టీ కాలనీలో 26 ఇళ్లను మంత్రి ఆర్కే రోజా గురువారం ప్రారంభించారు. తమ సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కోచ్‌ల కోసం అయ్యప్పల ఆందోళన

- కొల్లాం రైలుకు నాలుగు స్లీపర్‌క్లాస్ కోచ్‌ల తొలగింపు
- ఆందోళనకు దిగి రైలు నిలిపివేసిన భక్తులు
- అయ్యప్పల ఆందోళనతో దిగివచ్చిన రైల్వే అధికారులు
- నాలుగు కోచ్‌లు జతచేసి పంపిన అధికారులు


కొల్లాం రైలు వద్ద ఆందోళన చేస్తున్న అయ్యప్పలు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : విశాఖపట్నం నుంచి శబరిమలకు వెళ్లే విశాఖపట్నం–కొల్లాం (18567) రైలుకు సంబంధించిన నాలుగు స్లీపర్ కోచ్‌లను అర్ధంతరంగా తొలగించడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. దీంతో దిగొచ్చిన రైల్వే అధికారులు ఆ నాలుగు కోచ్‌లను జతచేసి రైలును పంపించడంతో సమస్య సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి శబరిమల వెళ్లే ప్రయాణికులకు ఉన్న ఏకైక డైరెక్ట్ రైలు విశాఖపట్నం–కొల్లాం (18567). ఇది కూడా ప్రతి గురువారం నడిచే వీక్లీ రైలు మాత్రమే. రిజర్వేషన్ ఉన్న అయ్యప్ప భక్తులందరూ యథావిధిగా గురువారం ఈ రైలెక్కేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అయితే వీరిలో చాలామందికి సీట్లు లేవు. కనీసం వారికి కేటాయించిన కోచ్‌లు కూడా లేవు. దీంతో వీరంతా రైలుకు అడ్డంగా నిలబడి రైలును నిలిపివేశారు. అప్రమత్తమైన రైల్వే అధికారులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియ జేసిన రైల్వే సిబ్బంది హుటాహుటిన తొలగించిన నాలుగు స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేయడంతో ఉదయం 7.20 గంటలకు బయల్దేరవలసిన రైలు నాలుగు గంటలు ఆలస్యంగా 11.05 గంటలకు విశాఖ నుంచి కదిలింది.

వివాహం.. వింతాచారం!

కొనకనమిట్ల: లగ్నం అవ్వాలంటే.. కట్టు తెంచాలి మరి.. అదే ఇక్కడ అనాదిగా కొనసాగుతున్న పెళ్లి ఆచారం. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం చినారికట్ల గ్రామంలో బుధవారం రాత్రి ఉడుముల వారి వివాహ వేడుక జరిగింది. ఉడుముల ఇంద్రసేనారెడ్డి వివాహం సందర్భంగా వారి సంప్రదాయం ప్రకారం పెళ్లి కుమారుడి ఇంట్లో తయారైన నైవేద్యాలతో నెత్తిన గంప, చేతిలో ఖడ్గం పట్టుకుని మేళతాళాలతో ఊరి చివర ఉండే జమ్మిచెట్టు దగ్గరికి వెళ్లి చెట్టుకు పూజలు చేస్తాడు. ఆపై పెద్దలు పెళ్లి కుమారుడిని 101 నూలు పోగులతో జమ్మి చెట్టుకు కట్టేస్తారు. తదుపరి వరుడు ఆ కట్లు తెంపుకొని అందరికంటే ముందుగానే పెళ్లి పందిరి వద్దకు చేరతాడు. ఈ ఉత్సవంలో మహిళలు పాల్గొనకపోవడం విశేషం.

వరుడే వధువుగా..

అలాగే మండలంలోని గొట్లగట్టులో కూడా ఇటీవల జరిగిన ఓ తెగవారి పెళ్లిలో కూడా మరో ఆచారాన్ని పాటించారు. నాలి రామయ్య కుమారుడు యోగేంద్రబాబు వివాహం సందర్భంగా తమ వంశాచారం ప్రకారం పెళ్లి కుమారుడు ప్యాంటు, చొక్కా కాకుండా చీర, జాకెట్, బారెడు విగ్గు పెట్టుకుని తలనిండా పూలు, బొట్టూ, కాటుక, గాజులు, దండలతో అచ్చం పెళ్లి కుమార్తెలా ముస్తాబయ్యాడు. ఆచారం ప్రకారం


గొట్లగట్టులో పెళ్లి కూతురు వేషధారణలో ఉత్సవం

పెళ్లికి ముందు దేవుడికి ఎదురు నడిచే తతంగం ఉంది. అందులో భాగంగా తమ ఇలవేల్పు అయిన గురప్పడు స్వామికి పూజలు చేశారు. బంధుమిత్రులతో కలిసి మేళతాళాలు, బొల్లావుల ఉత్సవం చేసుకుంటూ ఎదురైన ముత్తయిదువుల నుదుట బొట్టు పెట్టుకుంటూ వారి ఆశీర్వచనాలు అందుకున్నాడు. అనంతరం ఊరి చివర్న ఉన్న జమ్మిచెట్టు దగ్గరకు వెళ్లి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

శనివారం కూడా పాస్‌పోర్ట్ కార్యాలయాలు పనిచేస్తాయి

విశాఖ ఆర్పీవో విశ్వంజలి గైక్వాడ్ వెల్లడి


విశ్వంజలి గైక్వాడ్

సాక్షి, విశాఖపట్నం: ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్న తరుణంలో విశాఖ పాస్‌పోర్ట్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఉన్న రెండు పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీఎస్‌కే) ఈ నెల 17న శనివారం కూడా సేవలు అందించనున్నట్లు విశాఖ రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి (ఆర్పీవో) విశ్వంజలి గైక్వాడ్ చెప్పారు. ఆ రోజున విశాఖతో పాటు భీమవరం పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో కొత్త అపాయింట్‌మెంట్లతో పాటు ఇప్పటికే అపాయింట్‌మెంట్ తీసుకున్న వారు రీషెడ్యూల్ చేసుకొనే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. సాధారణ, తత్కాల్ కేటగిరీల్లో https://www.passportindia.gov.in/ వెబ్‌సైట్ ద్వారా కొత్త, రీషెడ్యూల్ అపాయింట్‌మెంట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన అనంతరం ఆన్‌లైన్ చెల్లింపు చేసి, వెబ్‌సైట్‌లో అపాయింట్‌మెంట్‌ను ఖరారు చేసుకోవాలన్నారు. సరైన పత్రాలు లేకుండా ఎవరూ రావద్దని.. దీని వల్ల అత్యవసరం అయిన వారికి ఇబ్బంది కలుగుతుందన్నారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

దోపిడీల బాబుకు తగిన శాస్తి!

809వ రోజు దీక్షలో బహుజన నాయకులు


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధాని పేరుతో దోపిడీలకు పాల్పడిన చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనించినందునే.. గత ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 809వ రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ రాజధాని పేరుతో దోపిడీకి తెరలేపిన బాబు తన అనుచరులతో ముందస్తుగా ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేయించి రూ.లక్షల కోట్లు లబ్ధి పొందాడని విమర్శించారు. బహుజనుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజధానిలో జరిగిన అవినీతి కేసుల విచారణపై ఉన్న స్టేలను తొలగించి చంద్రబాబుపై సీబీఐ విచారణ చేస్తే అక్రమాలు బయటపడతాయని చెప్పారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఎల్లో మీడియాలో విష ప్రచారం చేస్తూ తన మనుగడ కోసం పాకులాడుతున్న చంద్రబాబుకు రాష్ట్రంలో మనుగడ లేదనేది గుర్తు పెట్టుకోవాలన్నారు. నాయకులు పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఈపూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మృతి

- 19న ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా ఘటన


రాఘవమ్మ (ఫైల్)

శావల్యాపురం: పల్నాడు జిల్లా కారుమంచి గ్రామ మాజీ సర్పంచ్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చుండూరి రాఘవమ్మ (60) విద్యుదాఘాతానికి గురై గురువారం సాయంత్రం మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రాఘవమ్మ తన నివాస గృహంలో వంట పనుల్లో భాగంగా మిక్సీ వేస్తుండగా షాక్‌కు గురై మృతి చెందారు. వైఎస్సార్ సీపీలో సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు భార్య చుండూరి రాఘవమ్మను ఇటీవల ఈపూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈనెల 19వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కాగా, మృతురాలి కుమారుడు విశ్వనాథ్ చౌదరి ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు.

రూ.కోటి ఎర్రచందనం స్వాధీనం


ఎర్రచందనం దుంగలు, వాహనాలను చూపుతున్న సీఐ తులసీరాం, సిబ్బంది

ఎర్రావారిపాళెం(తిరుపతి): రెండు వేర్వేరు కేసుల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.కోటి విలువైన ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట సీఐ తులసీరాం తెలిపారు. గురువారం ఎర్రావారిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు వేర్వేరు కేసుల్లో 30 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో బోడేవాండపల్లి సమీపంలోని సాయికాడగుట్ట వద్ద లారీలో అక్రమంగా తరలిస్తున్న 24 ఎర్రచందనం దుంగలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే యల్లమంద క్రాస్ వద్ద ముందస్తు సమాచారంతో వెంబడించి బైక్‌ను, కారును అదుపు చేయగా అందులోని ఐదుగురిని అదుపులోకి తీసుకుని కారులోని ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

- మార్గమధ్యలో పోలీసులను చూసి దొంగల పరారీ
- 7 కిలోల వెండి కవచం, బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దపప్పూరు: అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి పోలేరమ్మ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. అయితే గస్తీలో ఉన్న పోలీసులను గమనించి దొంగిలించిన 7 కిలోల బరువు గల అమ్మవారి వెండి కవచాన్ని వదిలి పోరిపోయారు. బుధవారం అర్ధరాత్రి ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ గస్తీ చేపట్టారు. నామనాంకపల్లి వద్దకు చేరుకోగానే పోలీసుల వాహనాన్ని గమనించిన ద్విచక్ర వాహన చోదకులు తమ వాహనాన్ని వదిలి పొలాల్లోకి పరుగులుదీశారు. అనుమానించిన పోలీసులు వారిని వెంబడించినా ఫలితం లేకపోయింది. వారు వదిలేసిన వాహనం వద్ద అమ్మవారి వెండి కవచం బయటపడింది. దీంతో వాహనాన్ని, వెండి కవచాన్ని స్వాధీనం చేసుకుని దుండగులు వచ్చిన మార్గంలో ముందుకు సాగి చిక్కేపల్లి గ్రామాన్ని చేరుకుని, పరిశీలించారు. దుండగులు అపహరించేందుకు ప్రయత్నించిన కవచం పోలేరమ్మ ఆలయంలోనిదని గుర్తించారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి తప్పతాగి ఏఎస్సైపై దాడి

- బీచ్‌రోడ్డులో బీరుబాటిల్‌తో వీరంగం
- బండబూతులు తిడుతూ హల్‌చల్
- అరెస్టు..14 రోజుల రిమాండ్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నడిరోడ్డుపై మద్యం తాగడం తప్పు..ఇంటికి వెళ్లిపోమని చెప్పిన పోలీసు అధికారిపై యువతి తన చేతిలో ఉన్న బీరు బాటిల్‌ను విసిరింది. త్రుటిలో ఏఎస్సై తప్పించుకోగా అక్కడే ఉన్న మరో యువకుడికి బీరు బాటిల్ తగిలి గాయమైంది. విశాఖలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన సంచలనం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై పీవీవీ సత్యనారాయణ బుధవారం నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఏఎస్సైకు డయల్ 112 నుంచి ఓ యువతి బహిరంగంగా మద్యం సేవించి స్కూటీపై వీరంగం సృష్టిస్తోందని, పార్క్ హోటల్ వైపునకు వస్తోందని రాత్రి 11:20 గంటలకు సమాచారం అందింది. దీంతో ఏఎస్సై వైఎంసీఏ కూడలి వద్ద రాత్రి 11:30 గంటలకు ఆ యువతికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నడిరోడ్డుపై ఇలా మద్యం తాగడం తప్పు...ఇంటికి వెళ్లిపోమని ఏఎస్సై చెప్పగా..నువ్వెవడువురా...అంటూ వీరంగం సృష్టించింది. ఏఎస్సై చొక్కా పట్టుకుని, కళ్లద్దాలను పగలగొట్టింది. అంతటితో ఆగకుండా కాళ్లతో తన్నింది. తనను ఎవరూ ఏమీ చేయలేరని పెద్దగా అరుస్తూ హంగామా చేసింది. నైట్ జోన్


ఏఎస్సైపై దాడి చేస్తున్న మహిళ

ఆఫీసర్ విధులు నిర్వర్తిస్తున్న నాలుగో పట్టణ సీఐ శ్రీనివాసరావు, మహారాణి పేట మహిళా ఎస్సై లక్ష్మీతో పాటు దిశ వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మహిళకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా 148.1ఎంజీ/100ఎంఎల్ రీడింగ్ నమోదు అయ్యింది. తర్వాత విచారణ జరపగా దాడి చేసిన మహిళ పేరు అమూల్య అని తెలిసింది. ఏఎస్సైపై దాడి చేసినందుకుగానూ 518/2022 యూ/ఎస్ 353, 324 ఐపీఎస్ సెక్షన్ 184, 185 ఎంవీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోర్టు యువతికి 14 రోజుల రిమాండ్ విధించింది.

డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి

- రెండు ప్రాజెక్టుల్లో నిలిచిన విద్యుదుత్పత్తి
- గండిని పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా): డొంకరాయి పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన పవర్ కెనాల్‌కు 3/6 రీచ్ వద్ద బుధవారం అర్ధరాత్రి భారీ గండి పడింది. సిబ్బంది అప్రమత్తమై గేట్లు మూసి డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్‌కు వచ్చే నీటిని నిలిపేశారు. అర్ధరాత్రి ఏవీపీ డ్యామ్ వద్ద నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఏవీపీ డ్యామ్‌లో నీటి మట్టం ఒక్కసారిగా తగ్గడాన్ని గమనించారు. అనుమానం వచ్చి పవర్ కెనాల్‌లోంచి పెట్రోలింగ్ నిర్వహిస్తూ 3/6 రీచ్ వద్ద పడిన గండిని గుర్తించారు. వెంటనే సివిల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పవర్ కెనాల్‌కు నీటిని పంపే గేట్లు మూసివేయడంతో పెను ప్రమాదం తప్పింది. సిబ్బంది అప్రమత్తంగా లేకపోతే కెనాల్‌కు భారీస్థాయిలో గండి పడే అవకాశం ఉండేది. దీంతో గురువారం ఉదయం ఇన్‌చార్జ్ సీఈ కేవీ నాగేశ్వరరావు, ఎస్ఈ సివిల్ ప్రశాంత్‌కుమార్, డొంకరాయి ఈఈ వరప్రసాద్ గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. జరిగిన నష్టంపై ఏపీ జెన్‌కో అధికారులకు సమాచారం అందించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు.

గండిని పూడ్చేందుకు 2 నెలల సమయం

సీలేరు కాంప్లెక్స్ పరిధిలో మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలున్నాయి. డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా నీరు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి రావాలి. పవర్ కెనాల్‌కు గండి పడడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో డొంకరాయి పవర్ ప్రాజెక్టు నుంచి 25 మెగావాట్లు, పొల్లూరు పవర్ ప్రాజెక్టు నుంచి 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రస్తుతం పవర్ కెనాల్‌కు పడిన గండిని పూడ్చేందుకు రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

రూ.10 కోసం గొడవ.. ఫ్రెండ్‌ను చంపేశాడు

సిలిగురి: రూ.10 విషయంలో స్నేహితుల మధ్య జరిగిన కొట్లాట ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన పశ్చిమబెంగాల్ రాష్ట్రం సిలిగురిలో చోటుచేసుకుంది. సిలిగురికి చెందిన రామ్‌ప్రసాద్ సాహా(20) మంగళవారం వైకుంఠపుర అటవీ ప్రాంతంలో స్థానికులకు శవమై కన్పించాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాహా స్నేహితులైన సుబ్రతా దాస్(22), అజయ్ రాయ్(24) అనే వారిని బుధవారం అదుపులోకి తీసుకుని విచారించారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారిన వీరు సోమవారం అటవీ ప్రాంతానికి వెళ్లారు. మత్తులో మునిగిన సాహా మరికొంత డ్రగ్స్ కొనుక్కునేందుకు రూ.10 ఇవ్వాలని సుబ్రతాను కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. సుబ్రతా బండరాయితో కొట్టడంతో సాహా చనిపోయినట్లు తేలిందని సిలిగురి మెట్రో పోలీసులు చెప్పారు.

రోజ్‌గార్ మేళాల ద్వారా 1.47 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: రోజ్‌గార్ మేళాల కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, స్వతంత్ర్య సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల్లో కొత్తగా 1.47 లక్షల మందిని నియమిస్తూ నియామకపత్రాలు అందజేశామని కేంద్రప్రభుత్వం తెలిపింది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ఈ విషయం వెల్లడించారు. ఇంకా భర్తీకాని పోస్టులకుగాను నియామక ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు. 2020–21 కాలానికిగాను దేశంలో నిరుద్యోగిత 4.2 శాతంగా నమోదైందని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అదే కాలానికి దేశంలోని మొత్తం జనాభాలో ఏదైనా ఒక వృత్తిలో నిమగ్నమైన జనాభా(వర్కర్ పాపులేషన్ రేషన్-డబ్ల్యూపీఆర్) 52.6 శాతంగా నమోదైందని తెలిపారు. కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు, కోవిడ్ సంక్షోభం నుంచి దేశార్థికాన్ని ఆదుకునేందుకు ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద కేంద్రప్రభుత్వం రూ.27 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీని అమలుచేసిందన్నారు. ఈ పథకం కింద లబ్ధిపొందాలనుకునే సంస్థల రిజిస్ట్రేషన్ గడువు ఈ ఏడాది మార్చి 31నాడే ముగిసిందన్నారు. 60 లక్షల ఉద్యోగాల సృష్టి కోసం రూ.1.97 లక్షల కోట్లతో ఉత్పత్తి ప్రోత్సాహక రాయితీ పథకం తెచ్చామని మంత్రి చెప్పారు.

నీరవ్ మోదీకి ఎదురుదెబ్బ

లండన్: బ్యాంకులను మోసగించి, విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ(51)కి దారులు మూసుకుపోతున్నాయి. అతడి న్యాయ పోరాటం ఫలించడం లేదు. తనను భారత్‌కు అప్పగించవద్దంటూ అతడు చేసుకుంటున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ఉన్నాడు. ఫ్రాడ్, మనీ లాండరింగ్ కేసుల్లో విచారించడానికి నీరవ్ మోదీని తమకు అప్పగించాలని భారత్‌లోని దర్యాప్తు సంస్థలు విజ్ఞప్తి చేయడంతో లండన్‌లోని ద్విసభ్య హైకోర్టు ధర్మాసనం అంగీకరించింది. నిందితుడిని భారత్‌కు అప్పగించేందుకు వీలుగా గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ యూకే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని, అందుకు అనుమతి ఇవ్వాలంటూ నీరవ్ మోదీ దాఖలు చేసిన దరఖాస్తును హైకోర్టు (రాయల్ కోర్ట్స్ ఆఫ్ జస్టిస్) గురువారం తిరస్కరించింది. అంతేకాకుండా ఈ దరఖాస్తు విషయంలో అయిన ఖర్చులకు గాను 1,50,247 పౌండ్లు చెల్లించాలని నీరవ్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జెర్మీ స్టువార్ట్-స్మిత్, జస్టిస్ రాబర్ట్ జే తీర్పు వెలువరించారు. దీంతో నీరవ్ మోదీని భారత్‌కు తీసుకొచ్చి, విచారించేందుకు అవకాశాలు మరింత మెరుగయ్యాయి.

అగ్ని5 క్షిపణి పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యమున్న అగ్ని–5 బాలిస్టిక్ క్షిపణిని భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో అబ్దుల్ కలాం దీవి నుంచి ఈ ప్రయోగం చేపట్టినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అగ్ని–2 క్షిపణి సామర్థ్యం 2 వేల కిలోమీటర్లు కాగా తాజాగా అభివృద్ధి పరిచిన అగ్ని–5 క్షిపణి 5 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. పలు పరామితులను ఈ ప్రయోగంతో ధ్రువీకరించుకున్నట్లు తెలిపాయి. దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడలేదు. చైనాతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో చేపట్టిన ఈ ప్రయోగం..దేశ వ్యూహాత్మక పోరాట సామర్థ్యాన్ని చాటుతుందని విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. జూన్‌లో రాత్రివేళ చేపట్టిన అగ్ని–4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతమైంది.

ఈశాన్యంలో వైమానిక విన్యాసాలు ప్రారంభం

న్యూఢిల్లీ: ఈశాన్య ప్రాంతంలో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) విన్యాసాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రఫేల్ జెట్లతో సహా ఈస్టర్న్ ఎయిర్ కమాండ్ పరిధిలోఉన్న సుఖోయ్–30 యుద్ధవిమానం, ఇతర అత్యాధునిక యుద్ధ విమానాలు ఇందులో పాల్గొంటున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లో వాస్తవాధీన రేఖ వద్ద చైనా సైనికుల చొరబాటు యత్నం నేపథ్యంలో ఈ విన్యాసాలు ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారమే ఇవి జరుగుతున్నాయని, సైనికుల ఘర్షణతో వీటికి సంబంధం లేదని భారత వైమానిక దళం స్పష్టం చేసింది. విన్యాసాలు శుక్రవారం ముగియనున్నాయి. ఇదిలా ఉండగా, 36 రఫేల్ యుద్ధ విమానాలు ఫ్రాన్స్ నుంచి భారత్‌కు చేరుకున్నాయని ఐఏఎఫ్ ట్వీట్ చేసింది. దీంతో ఒప్పందం మేరకు మొత్తం విమానాలు వచ్చినట్లయ్యిందని పేర్కొంది.

జడ్జీల నియామకం ప్రభుత్వ హక్కు

రాజ్యాంగ స్ఫూర్తి అదే చాటుతోంది
- కానీ, ప్రభుత్వ పాత్ర పరిమితంగా ఉండడం ఏమిటి?
- పార్లమెంట్, ప్రజల సెంటిమెంట్‌ను కొలీజియం ప్రతిబింబించడం లేదు
- కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అసంతృప్తి


రిజిజు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం అమల్లో ఉన్న కొలీజియం వ్యవస్థ పట్ల ప్రభుత్వ అసహనం మరోసారి తేటతెల్లమయ్యింది. కొలీజియం విషయంలో ఇప్పటికే ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ రెండు వర్గాలుగా విడిపోయాయి. ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల నియామకంలో ప్రభుత్వం పాత్ర పరిమితంగానే ఉండడం ఏమిటని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన గురువారం రాజ్యసభలో మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్ కేసుల విషయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానామిచ్చారు. ఆయన ఏం చెప్పారంటే..

పెండింగ్ కేసులు ఆందోళనకరం

'దేశవ్యాప్తంగా కోర్టుల్లో ఐదు కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉండడం ఆందోళకరం. ఇందుకు ప్రధాన కారణం కోర్టుల్లో జడ్జి పోస్టులు ఖాళీగా ఉండడం. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. కానీ, జడ్జి పోస్టుల భర్తీలో ప్రభుత్వం పాత్ర పరిమితమే. నియమించాల్సిన జడ్జీల పేర్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన కొలీజియమే ప్రతిపాదిస్తుంది. అందులో ప్రభుత్వానికి ఎలాంటి హక్కు ఉండదు.

20 పేర్లను పునఃపరిశీలించండి
కొలీజియంకు తిప్పి పంపిన కేంద్ర ప్రభుత్వం

హైకోర్టుల్లో న్యాయమూర్తులుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన 20 పేర్లను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపించింది. ఆ 20 పేర్లను మరోసారి పరిశీలించాలని కోరింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ 9వ తేదీ నాటికి హైకోర్టుల్లో 331 జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. మొత్తం శాంక్షన్డ్ పోస్టులు 1,108 కాగా, 25 హైకోర్టుల్లో ప్రస్తుతం 777 మంది జడ్జీలు ఉన్నారని తెలిపారు. 30 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పోస్టుల భర్తీ కోసం పలు హైకోర్టుల నుంచి అందిన 147 ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం మధ్య వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి వివిధ హైకోర్టుల్లో రికార్డు స్థాయిలో 165 మంది జడ్జిలను నియమించినట్లు కిరణ్ రిజిజు వివరించారు. ఒక సంవత్సరంలో ఇంతమందిని నియమించడం ఒక రికార్డు అని పేర్కొన్నారు.

మార్పులు చేయకపోతే..

న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు దేశ వైవిధ్యాన్ని, నాణ్యతను ప్రతిబింబించే పేర్లను ప్రతిపాదించాలని కొలీజియంకు ప్రభుత్వం తరచుగా విజ్ఞప్తి చేస్తూనే ఉంది. కానీ, ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థ పార్లమెంట్, దేశ ప్రజల సెంటిమెంట్‌ను ప్రతిబింబించడం లేదు. ఎక్కువ మాట్లాడితే న్యాయ వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నట్లుగా కనిపిస్తుంది. అందుకే ఎక్కువ మాట్లాడడం నాకు ఇష్టం లేదు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం చూస్తే కోర్టుల్లో జడ్జీలను నియమించడం ప్రభుత్వ హక్కు. కానీ, 1993 తర్వాత ఈ పరిస్థితిని మార్చేశారు. జడ్జిల అపాయింట్‌మెంట్లలో ప్రభుత్వానికి భాగస్వామ్యం కల్పిస్తూ 2014లో నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్(ఎన్‌జేఏసీ) చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టాన్ని 2015లో సుప్రీంకోర్టు రద్దు చేసింది. జడ్జిలను నియమించే ప్రక్రియలో మార్పులు చేయకపోతే ఉన్నత న్యాయస్థానాల్లో ఖాళీల సమస్య తలెత్తూనే ఉంటుంది' అని రిజిజు తేల్చిచెప్పారు. కొలీజియం అనేది దేశ ప్రజలు కోరుకుంటున్న వ్యవస్థ కాదని ఆయన కొన్ని వారాలుగా గట్టిగా వాదిస్తున్న సంగతి తెలిసిందే. కొలీజియంకు వ్యతిరేకంగా పలువురు ప్రస్తుత, మాజీ కేంద్ర మంత్రులు గళం విప్పుతున్నారు. కానీ, కొలీజియం వ్యవస్థను పట్టాలు తప్పించేలా ఎవరూ మాట్లాడొద్దని సుప్రీంకోర్టు ఇటీవలే హెచ్చరించింది.

పారదర్శకంగా పాలనా వ్యవస్థ

మోదీ 'సుపరిపాలనా వారం' సందేశం



న్యూఢిల్లీ: ప్రజలపై ప్రభుత్వ పరిపాలన ప్రభావాన్ని పెంచడానికి, వారి జీవితాల్లో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించడానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రతిస్థాయిలో విధానాలను, ప్రక్రియలను సులభతరం చేయడం ద్వారా పాలనా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా తీర్చిదిద్దడానికి శ్రమిస్తున్నామని అన్నారు. సుపరిపాలనా వారం(సుశాసన్ సప్తాహ్) సందర్భంగా ప్రధాని మోదీ గురువారం ఈ మేరకు దేశ ప్రజలకు సందేశామిచ్చారు. దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 25వ తేదీ దాకా సుపరిపాలనా వారం జరుపుకోనున్నారు. 'ప్రజలే కేంద్రంగా' కేంద్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని మోదీ వివరించారు. ఫిర్యాదుల పరిష్కారం, ఆన్‌లైన్ సేవలు, దరఖాస్తుల స్వీకరణ–పరిష్కారం, సుపరిపాలనా విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తుచేశారు. కాలం చెల్లిన వేలాది చట్టాలను రద్దు చేశామన్నారు. అనవసర విధానాలు, పద్ధతులకు స్వస్తి పలికామని వెల్లడించారు. ప్రభుత్వానికి ప్రజలను చేరువ చేయడంలో టెక్నాలజీ పాత్ర చాలా కీలకమని మోదీ పేర్కొన్నారు. ప్రజలు సాధికారత సాధించడంలో సాంకేతికత ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు.



ఫొటోలో ఉన్నది సైన్స్ ఫెయిర్ కోసం ఏర్పాటుచేసిన పగడపు దిబ్బ ఆకృతి అనుకుంటే పొరపాటే. వాస్తవానికి ఇదంతా కేక్. బెంగళూరులో ప్రారంభమయ్యే 48వ వార్షిక కేక్ షోలో భాగంగా దీనిని ఏర్పాటుచేశారు. 340 కేజీల కేక్‌తో దీనికి ఇలా తుదిరూపునిచ్చారు.

అవి శ్రద్ధా శరీర భాగాలే

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఢిల్లీ హత్యా ఘటనలో మెహ్రౌలీ అటవీ ప్రాంతంలో లభ్యమైన ఎముకలు శ్రద్ధా వాకర్‌వేనని పోలీసు వర్గాలు గురువారం తెలిపాయి. హత్యారోపణలు ఎదుర్కొంటున్న అఫ్తాబ్ గది నుంచి సేకరించిన రక్తం నమూనాలు శ్రద్ధవేనని తేలింది. ఎముకలు, రక్తం నుంచి సేకరించిన డీఎన్ఏ నమూనాలు శ్రద్ధా వాకర్ తండ్రి డీఎన్ఏతో సరిపోలాయని ఆ వర్గాలు వివరించాయి. డీఎన్ఏ రిపోర్టుతోపాటు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదిక అందిందని స్పెషల్ పోలీస్ కమిషనర్(శాంతిభద్రతలు) సాగర్ ప్రీత్ హుడా మీడియాకు తెలిపారు. అఫ్తాబ్‌కు నిపుణులు నిర్వహించిన పాలీగ్రాఫ్ పరీక్ష నివేదిక కూడా బుధవారం పోలీసులకు అందింది. కేసు దర్యాప్తులో ఈ నివేదికలు కీలకంగా మారాయి. శ్రద్ధావాకర్‌తో సహజీవనం చేస్తున్న అఫ్తాబ్ పూనావాలా ఆమెను గొంతుపిసికి చంపిన అనంతరం శరీరాన్ని 35 భాగాలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడవేశాడు.

లంచగొండి అధికారులకు శిక్షలు పడాల్సిందే

ఆ దిశగా కృషి జరగాలి: సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: అవినీతిమయ, లంచగొండి ప్రభుత్వ అధికారులను చట్టం ముందు బోనులో నిలబెట్టేందుకు మరింత కృషి జరగాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. లంచగొండి అధికారికి వ్యతిరేకంగా నేరుగా సాక్ష్యాలు లేని సందర్భాల్లో ఇతరత్రా సాక్ష్యాధారాలతో శిక్ష ఎలా ఖరారుచేయాలనే వాదనల సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పై విధంగా స్పందించింది. లంచం తీసుకున్న కేసులో అవినీతి ప్రభుత్వ అధికారి అక్రమంగా లబ్ధి పొందాడనే బలమైన సాక్ష్యాలు, డాక్యుమెంట్లు లేకున్నా ఆ నేరంలో అతడికి ప్రమేయముందని తెలిపే నమ్మదగ్గ సాక్ష్యాలుంటే సరిపోతుందని, అతనిని దోషిగా నిర్ధారిస్తామని జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ బీవీ నాగరత్నల రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యానించింది. అవినీతి అధికారులకు శిక్ష పడేలా చేసేందుకు ఫిర్యాదుదారులు, ప్రభుత్వ లాయర్లు అంకితభావంతో కృషిచేయాలని కోర్టు సూచించింది. లంచగొండి అధికారులను పక్కకు తప్పిస్తేనే అవినీతిరహిత పాలన సాధ్యమవుతుందని ధర్మాసనం పేర్కొంది. 'ప్రాథమిక, బలమైన సాక్ష్యాలు, ఆధారాల లేని పక్షంలో, ఫిర్యాదుదారులు, బాధితుడు మరణించినా లేదా భయంతో ఫిర్యాదుదారు విచారణ సమయంలో సాక్ష్యం చెప్పలేకపోయినా నిందితుడికి నేరంలో ప్రమేయముందని తెలిపే మౌఖిక, నమ్మదగ్గ ఇతరత్రా సాక్ష్యాలు ఉన్న సరిపోతుంది. ఆ అధికారిని దోషిగా తేలుస్తాం. కేసు విచారణలో ప్రభుత్వ అధికారిని శిక్షించకుండా వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని కోర్టు వ్యాఖ్యానించింది. ' ఆ అధికారి లంచం అడగడానికి, లబ్ధి పొందడానికి పూర్తి అవకాశం ఉందనేది మొదట నిరూపించగలిగితే చాలు' అని కోర్టు పేర్కొంది.

జమిలి ఎన్నికలతో ప్రజాధనం ఆదా

- ఎన్నికలు భారీ బడ్జెట్ వ్యవహారం
- రాజ్యసభలో న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికలు అనేవి భారీ బడ్జెట్ వ్యవహారంగా మారిపోయాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్నారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు ఒకేసారి(జమిలి) నిర్వహిస్తే ఎంతో ప్రజాధనం ఆదా అవుతుందని చెప్పారు. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా రాజ్యసభలో కిరెణ్ చెప్పారు. ఎన్నికలు ఖరీదైన అంశంగా మారిన నేపథ్యంలో జమిలి ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల చట్టాల్లో సంస్కరణల కోసం లా కమిషన్ సమర్పించిన నివేదిక జమిలి ఎన్నికల ఆవశ్యకతను గుర్తుచేసిందన్నారు. పరిపాలనలో స్థిరత్వం కోసం లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. జమిలి ఎలక్షన్స్‌తో ప్రజలకే కాదు, పార్టీలకు, అభ్యర్థులకు కూడా లాభమేనని తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి'ని రెండుసార్లు అమలు చేయాల్సి వస్తోందని, దీనివల్ల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతోందని కిరణ్ రిజిజు వెల్లడించారు. దేశంలో 1951–52, 1957, 1962, 1967లో జమిలి ఎన్నికలు జరిగాయి. అయితే, 1968, 1969లో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు రద్దయ్యాయి. దాంతో జమిలి ఎన్నికల గొలుసు తెగిపోయింది.

చైనాపై కన్నెర్ర జేసేదెప్పుడు?

లోక్‌సభలో ప్రధాని మోదీని ప్రశ్నించిన అధీర్ రంజన్

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ వెంట చైనా సైనికుల చొరబాటు యత్నంపై ప్రధాని మోదీ వైఖరిని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి తీవ్రంగా తప్పుబట్టారు. గురువారం లోక్‌సభలో జీరో అవర్ సందర్భంగా రంజన్ ఈ అంశాన్ని లేవనెత్తారు. ' భారత భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు చైనా ప్రయత్నిస్తుంటే మోదీ సర్కార్ మాత్రం అదే దేశం నుంచి దిగుమతులను పెంచడంపై శ్రద్ధపెట్టింది. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రి సర్వర్లను హ్యాక్ చేసింది చైనా హ్యాకర్లేనని ప్రముఖ జాతీయపత్రికలో గురువారం కథనం వెలువడిన నేపథ్యంలో ఈ అంశాలపై కేంద్రప్రభుత్వం లోక్‌సభలో శ్వేతపత్రం జారీచేయాల్సిందే. ఒక వైపు హ్యాక్ చేస్తూ, మరోవైపు సరిహద్దు ప్రాంతాల్లో చొరబడుతున్న చైనాపై ప్రధాని మోదీ ఎప్పుడు కఠిన చర్యలకు దిగుతారు? అని అధీర్ రంజన్ ఆగ్రహంగా మాట్లాడారు. ' అమెరికాతో భారత వాణిజ్యం తగ్గిన ప్రతిసారీ చైనా లాభపడుతోంది. మోదీ సర్కార్ హయాంలో చైనా నుంచి దిగుమతులు మరింత పెరుగుతుంటే చైనా విషయంలో మోదీ వైఖరి చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. దిగుమతులు పెంచేసి ఆ దేశానికి లబ్ధిచేకూరుస్తుంటే మరి చైనాపై మోదీ కన్నెర్రజేసేది ఎప్పుడు ? ' అని అధీర్ రంజన్ ప్రశ్నించారు.

గోద్రా దోషికి బెయిల్

న్యూఢిల్లీ: 2002 నాటి గోద్రా రైలు దహనం కేసులో దోషి, యావజ్జీవ కారాగార శిక్ష పడిన ఫరూఖ్‌కు సుప్రీంకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. అతడు గత 17 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తున్నాడని, అందుకే బెయిల్ ఇస్తున్నట్లు వెల్లడించింది. తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఫరూఖ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసులోని కొన్ని వాస్తవాలు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అతడి బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. 2002 ఫిబ్రవరి 27న గుజరాత్‌లోని గోద్రా స్టేషన్‌లో ఆగిన సబర్మతి ఎక్స్‌ప్రెస్‌పై దుండగులు నిప్పు పెట్టారు. ఎస్6 కోచ్ పూర్తిగా దహనమయ్యింది. అందులోని 59 మంది ప్రయాణికులు మరణించారు. రాళ్లు రువ్విన ఘటనలో ఫరూఖ్‌సహా కొందరు దోషులుగా తేలారు.

నాలాంటి వారు ఎప్పుడూ సజీవులే: షారూక్ ఖాన్

కోల్‌కతా: తనవంటి సానుకూల దృక్పథం కలిగిన వారు ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటారని బాలీవుడ్ హీరో షారూక్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన కోల్‌కతా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్(కేఐఎఫ్ఎఫ్)కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రేక్షకులనుద్దేశించి మాట్లాడారు. కొన్ని సంకుచిత ధోరణుల కారణంగా సామాజిక మాధ్యమం ఒక్కోసారి విభేదాలకు, విధ్వంసాలకు కారణమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో రానున్న పఠాన్ సినిమాలోని 'బేషరమ్ రంగ్' పాటపై వీహెచ్‌పీ వంటి సంస్థలు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో షారూక్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

కల్తీ మద్యం తాగితే చస్తారు: నితీశ్

పట్నా: కల్తీ మద్యం తాగితే ప్రాణాలు కోల్పోతారంటూ బిహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రజలను హెచ్చరించారు. శరన్ జిల్లాలో కల్తీ మద్యం కాటుకు గురువారం మరో ఐదుగురు మృతి చెందడంతో ఈ ఘటనలో మరణాల సంఖ్య 26కు చేరుకుంది. ఈ నేపథ్యంలో పట్నాలో సీఎం నితీశ్ మీడియాతో మాట్లాడారు. సమాజ హితం కోసం తీసుకువచ్చిన మద్య నిషేధంపై విమర్శలు ఎందుకో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. కల్తీ సారా మరణాలకు, మద్య నిషేధానికి సంబంధమే లేదన్నారు. నిషేధం లేని రాష్ట్రాల్లోనూ కల్తీ మద్యం మరణాలు సంభవిస్తున్నాయని నితీశ్ తెలిపారు. మద్య నిషేధం రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా మహిళల ఆకాంక్ష అని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లోనూ బీజేపీ ఆందోళన చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు, కల్తీ సారా మరణాలపై గురువారం ప్రతిపక్ష బీజేపీ రాష్ట్ర శాసనసభలో ఆందోళన కొనసాగించింది. పార్టీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు చేబూని వెల్‌లో నినాదాలు చేశారు. దీంతో, స్పీకర్ ఆదేశాలతో మార్షల్స్ వారి వద్ద నుంచి ప్లకార్డులను లాగేసుకున్నారు. అనంతరం వారు సభ నుంచి వాకౌట్ చేశారు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కూడా సీఎం నితీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్య నిషేధం నవ్వులాటగా మారిందని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ మద్యం మానుకునేలా ప్రజల్లో పరివర్తన తేవాలన్నారే తప్ప, నితీశ్ మాదిరిగా బలవంతంగా మాన్పించాలని చెప్పలేదని పేర్కొన్నారు.



లూసియానా రాష్ట్రంలోని కిల్లోనా జనావాసంపై టోర్నడో సృష్టించిన బీభత్సం. అమెరికాలోని ఉత్తర లూసియానాలో టోర్నడో ఘటనల్లో ఇద్దరు మరణించారు. 20 మంది గాయపడ్డారు. చాలా ఇళ్లు నామరూపాల్లేకుండా పోయాయి.

ఎంబీబీఎస్ సీట్లు 87% పెరిగాయ్

ఎన్‌డీఏ హయాంలో సీట్ల సంఖ్యపై కేంద్రం



న్యూఢిల్లీ: ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో దేశంలోని మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 87%, పీజీ మెడికల్ సీట్లు 105% పెరిగాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పారు. గురువారం ఆయన పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. దేశంలో యువతకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం 2014 తర్వాత పలు చర్యలు చేపట్టిందన్నారు. ఫలితంగా, 2014లో 387 మెడికల్ కాలేజీలుండగా, 2022 కల్లా వాటి సంఖ్య 648కి పెరిగిందన్నారు. 2014 తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 96%, ప్రైవేట్ కళాశాలల సంఖ్య 42% పెరిగిందని చెప్పారు.ప్రస్తుతం దేశంలో 355 ప్రభుత్వ, 293 ప్రైవేట్ వైద్య కళాశాలలున్నాయని తెలిపారు. అదేవిధంగా, 2014లో ఎంబీబీఎస్ కాలేజీల్లో 51,348 సీట్లుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 96,077కు చేరిందన్నారు. 2014లో 31,185 పీజీ మెడికల్ సీట్లుండగా, 2022కు వచ్చే సరికి అవి 63,842కు పెరిగినట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను 10వేలకు పెంచాలనే లక్ష్యంతో 16 రాష్ట్రాల్లోని 58 కాలేజీలకు గాను 3,877 ఎంబీబీఎస్ సీట్ల పెంపుదలకు ఆమోదం తెలిపామన్నారు. ఇదే విధంగా, 21 రాష్ట్రాల్లోని 72 మెడికల్ కాలేజీల్లో మొదటి దశలో 4,058 పీజీ సీట్ల పెంపునకు అనుమతించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా యోజన(పీఎంఎస్ఎస్‌వై) ద్వారా 22 కొత్త ఎయిమ్స్ ఏర్పాటుకు, 75 ప్రభుత్వ వైద్య కళాశాలల ఆధునీకరణ పనులను చేపట్టినట్లు తెలిపారు.

భారత్ జోడో యాత్ర @ 100 రోజులు


దౌసా జిల్లాలో పశుగ్రాసాన్ని కత్తిరించే యంత్రం తిప్పుతున్న రాహుల్ గాంధీ

జైపూర్: భారత్ దక్షిణ కొన నుంచి ఒక్క అడుగుతో మొదలైన కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర వడివడిగా ముందుకు సాగుతూ శుక్రవారం 100 రోజులు పూర్తి చేసుకోనుంది. కన్యాకుమారినుంచి కశ్మీర్‌దాకా సాగే 3,500 కిలోమీటర్ల పొడవునా సాగే ఈ యాత్రలో రాహుల్‌కు మద్దతుగా అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. అయితే ఈ ప్రజాదరణ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుబ్యాంక్‌ను పెంచుతుందో లేదోనని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఈ తరుణంలో ఇటీవల ముగిసిన గుజరాత్, హిమాచల్ శాసనసభ ఎన్నికలు పార్టీకి మిశ్రమ ఫలితాలను ఇచ్చాయి. అయితే, యాత్ర ఫలితం వచ్చే ఏడాది కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలిసే అవకాశముంది. దీర్ఘకాలంలో చూస్తే యాత్ర.. పార్టీకి పూర్వవైభవాన్ని తెస్తుందని ఒకప్పటి కాంగ్రెస్ సీనియర్ నేత సంజయ్ ఝా విశ్లేషించారు. ' ప్రజలతో మమేకమవుతూ కాంగ్రెస్ మరోసారి క్షేత్రస్థాయిలో బలపడుతోంది. తన ఇమేజ్‌పై బీజేపీ కురిపిస్తున్న నకిలీ, తప్పుడు కథనాలను పటాపంచలు చేస్తూ కొత్త రాజకీయ బ్రాండ్‌గా రాహుల్‌గాంధీ ఎదుగుతున్నారు' అని ఆయన అన్నారు. కాగా, యాత్రలో రాహుల్ ఆహార్యం, విమర్శలపై కాంగ్రెస్, బీజేపీ వాగ్బాణాలు సంధించుకున్నాయి. నెరిసిన గడ్డంతో ఇరాన్ నియంత సద్దాం హుస్సేన్‌లా ఉన్నాడంటూ రాహుల్‌పై బీజేపీ నేత, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించడం, వివాదాస్పద క్రైస్తవ బోధకుడితో రాహుల్ భేటీ, పాదయాత్రకు కోట్లాది మంది ప్రజానీకం మద్దతు వంటి భిన్న అంశాలతో పాదయాత్ర ముందుకుసాగుతోంది.

మోదీ మౌనం వెనక ఉద్దేశమేంటి?

దౌసా: చైనా సైనికుల చొరబాటు యత్నంపై చర్చించకుండా మోదీ సర్కార్ తప్పించుకుంటోందని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం చీఫ్ పవన్ ఖేరా ఆరోపించారు. రాజస్తాన్‌లో భారత్ జోడో యాత్రలో పాల్గొన్న సందర్భంగా దౌసాలో మీడియాతో మాట్లాడారు. 'చైనా అంశంలో ప్రధాని మోదీ మౌనం వెనుక ఉద్దేశమేంటి? ఒకవేళ మాట్లాడాల్సి వస్తే చైనాకు క్లీన్‌చిట్ ఇస్తారు. మోదీ గుజరాత్‌కు సీఎంగా ఉన్న కాలంలో అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో చైనా మాండరీన్ భాషను ప్రవేశపెట్టాలనుకున్నారు. భారత సార్వభౌమత్వానికి భంగం కలిగేలా జమ్మూకశ్మీర్ సరిహద్దు జిల్లాల్లో స్మార్ట్‌మీటర్లు బిగించే బాధ్యత మోదీ ఒక చైనా కంపెనీకి కట్టబెట్టారు. గుజరాత్‌లో స్థానిక సంస్థలను కాదని చైనా కంపెనీలకు భూమి కేటాయించారు. పీఎం కేర్స్ ఫండ్‌కు చైనా కంపెనీలు విరాళాలు పంపాయి. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిందే ' అని అన్నారు.

సాక్షి
విజయనగరం
శుక్రవారం । 16 । డిసెంబర్ । 2022

రుషింగిలో రాష్ట్రస్థాయి పౌరాణిక నాటిక పోటీలు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో వచ్చే ఏడాది జనవరి 19వ తేదీన రాష్ట్రస్థాయి పౌరాణిక నాటిక ప్రత్యేక సన్నివేశ పోటీలు నిర్వహించనున్నట్టు ఆలిండియా కళాకారుల సంఘం ప్రతినిధి యలకల మురళీకృష్ణ తెలిపా రు. శ్రీదుర్గాపిర్దిసాయి ఆలయం 16వ వార్షికో త్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తా మని, ఈ నెల 31వ తేదీలోగా కళాకారుల పేర్లు నమో దు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9182696233ను సంప్రదించాలని కోరారు.



ముగిసిన జగనన్న స్వర్ణోత్సవాలు

విశాఖపట్నంలో జరిగిన జోనల్‌స్థాయి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో జిల్లా కళాకారులు రాణించారు. విజేతలుగా నిలిచారు.

- 8లో

మాజీ సీఎస్ సమీర్‌శర్మ రాక రేపు

విజయనగరం అర్బన్: ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జి క్యూటివ్ అధికారి సమీర్‌శర్మ ఈ నెల 17న జిల్లాకు రానున్నారు. ఆ రోజు ఉదయం కలెక్టర్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారని కలెక్టర్ సూర్యకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. సంబంధిత విభాగాల అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలో విజయనగరం జిల్లాలో ఖాళీగా ఉన్న మెడికల్ రికార్డు టెక్నీషియన్ పోస్టులు రెండింటికి ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకో వాలని రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి గురువారం ఒక ప్రక టనలో తెలిపారు. పీయూసీ, తత్సంబంధమైన విద్యా అర్హతతో పాటు టైపింగ్‌లో లోయర్‌పాస్ అయి ఉండాలన్నారు. సీఎంసీ వెల్లూరులో మెడికల్ రికార్డు టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసిన వారు, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థ, వర్సిటీ నుంచి మెడికల్ రికార్డు టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నా రు. గుర్తింపు పొందిన ఆస్పత్రిలో కనీసం 6 నెలల పాటు పనిచేసి ఉండాలని, 18 నుంచి 42 సంవత్సరాలలోపు వయసు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాల మినహాయింపు ఉంటుందన్నారు.

నేడు ఉపాధ్యాయుల సర్టిఫికెట్స్ పరిశీలన

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధ్యా యుల అంగవైకల్యానికి సంబంధించిన సర్టిఫికె ట్స్‌ను పరిశీలిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జిల్లా పరిషత్, గవర్న మెంట్ యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీ ఫిఫరెన్సియల్ కేటగిరీకి (మెడికల్) సంబంధించి వారు, లేదంటే వారి సంబంధీకులు సర్టిఫికెట్స్ పరిశీలనకు హాజరు కావాలన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోలు

విజయనగరం అర్బన్: జిల్లాలో ధాన్యం కొను గోలు ప్రక్రియ జోరుగా సాగుతోందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ధాన్యానికి మద్దతు ధర గత ఏడాది కంటే ఈ ఏడాది క్వింటాపై రూ.100ను ప్రభు త్వం పెంచిందన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంత వరకు 383 ఆర్‌బీకేల పరిధిలో 4,266 మంది రైతుల నుంచి 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రూ.6 కోట్లను రైతుల ఖాతాలకు జమచేసినట్టు తెలిపారు.

17న ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ రాక


- సెంచూరియన్ వర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవానికి హాజరు



సెంచూరియన్ వర్సిటీలో స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 17న జరగనున్న టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీ ద్వితీయ స్నాత కోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకాను న్నట్టు వీసీ డాక్టర్ జీఎస్ఎన్ రాజు తెలిపారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు స్నాతకోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇంజినీరింగ్, పారా మెడికల్ సైన్సెస్‌కు సంబం ధించి వివిధ బ్రాంచిలలో 10 మంది టాపర్లకు గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేస్తామన్నారు. పద్మశ్రీ డాక్టర్ దేవి ప్రసన్న పట్నాయక్ అధ్యక్షతన జరిగే స్నాతకో త్సవంలో గౌరవ అతిథిగా కేంద్ర ప్రభుత్వ అద నపు కార్యదర్శి సేవలనాయక్ పాల్గొంటా రన్నారు. సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ ఒక పేద విద్యార్థికి నగదు బహుమతి అందజే స్తారని వివరించారు. అనంతరం స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రి జిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, డీన్లు డాక్టర్ కృష్ణమూర్తి, సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలకు 20 మంది ఎంపిక



కర్రసాములో చిన్నారి

లక్కవరపుకోట: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్జాం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిలంబం (కర్రసాము) ఎంపిక పోటీ లు గురువారంతో ముగిశాయి. జిల్లా నలుమూ లల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొ న్నారు. వీరిలో ప్రతిభ చూపిన 20 మందిని అం డర్–14,17 విభాగాల్లో బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు వీడీఎస్ ఎస్ఏ కార్యదర్శి జి.లక్ష్మణరావు తెలిపారు.

• హ్యాపీ బర్త్‌డే సీఎం సార్...





ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి 50వ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన పోస్టుకార్డులను చూపిస్తున్న కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థులు, రాసిన లేఖలను పోస్టుబాక్స్‌లో వేస్తున్న విద్యార్థులు

హ్యాపీ బర్త్‌డే సీఎం సార్... పుట్టిన రోజు శుభా కాంక్షలు జగన్ మామయ్యా.. అంటూ విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న విద్యార్థులు ముఖ్యమంత్రిపై తమ అభి మానాన్ని లేఖల ద్వారా వెల్లబుచ్చారు. ఈ నెల 21న జగన్‌మోహన్‌రెడ్డి 50వ పుట్టినరోజును పురస్కరిం చుకుని నగరంలోని 48 పాఠశాలలకు చెందిన 7 వేల మంది విద్యార్థులు పోస్టుకార్డులపై తమ అభిమాన నాయకునికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేస్తూ ఉత్తరాలను గురువారం పోస్ట్ చేశారు. ప్రభు త్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు సొంత మేనమామలా నాడు–నేడు పనులతో మెరుగైన వస తులు కల్పించడంతో పాటు ఉన్నత విద్యనందించ డంపై కృతజ్ఞతలు తెలిపారు. అమ్మఒడి, విద్యాకా నుక, విద్యాదీవెన వంటి పథకాలను అందించి విద్యార్థులకు భవిష్యత్‌కు గట్టిపునాది వేస్తున్నారం టూ సంతోషం వ్యక్తంచేశారు. తమ అభిమానాన్ని ఉత్తరాల్లో అక్షర రూపంలో నిక్షిప్తంచేశారు. స్థానిక కస్పా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కార్పొరేషన్ విద్యా కమిటీ చైర్మన్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ వెంప డాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు.

– విజయనగరం

రోడ్డు ప్రమాదాలను తగ్గించాలి

- పార్లమెంట్‌లో ఎంపీ బెల్లాన



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగే నష్టాలపై గురువారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు ద్వారా 2015 నుంచి ఇంతవరకు ప్రతీ సంవ త్సరం 1.5లక్షల మంది మరణిస్తున్నారన్నారు. అనధికార స్పీడు బ్రేకర్లు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సేవలు, ఇతర మౌలిక సేవలు అందించడంలో జాప్యాన్ని నివారించేందుకు ఏజెన్సీలను క్రమబద్ధీకరించాలని సూచించారు.

కిమ్మి–రుషింగి వంతెన పనులు శరవేగం



అందుబాటులోకి రానున్న కిమ్మి–రుషింగి వంతెన

కిమ్మి–రుషింగి వంతెన పనులు ప్రారంభించి సరిగ్గా దశాబ్ద కాలం అవుతోంది. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారారే తప్ప వంతెన నిర్మాణం పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లా ప్రజల రాక పోకల సమస్యకు పరిష్కారం దొరకలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు నడుంబిగించింది. ప్రజల రాకపోకల కష్టాలకు చెక్‌పెట్టేలా మిగిలిపోయిన వంతెన పనులను చకచకా పూర్తిచేయిస్తోంది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో ఊపందుకున్న పనులు
- 2023 ఫిబ్రవరిలో అందుబాటులోకి రానున్న వంతెన
- రూ.25.4 కోట్ల వ్యయంతో సాగుతున్న నిర్మాణం
- చకచకా కాంక్రీటు పనులు
- ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకు దగ్గరి దారి

వీరఘట్టం:

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండ లం, విజయనగరం జిల్లా వంగర మండలాల ప్రజల చిరకాల వాంఛ కొద్ది నెలల్లో తీరనుంది. కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణం ఊపందుకుంది. మరో రెండునెలల్లో వంతెన నిర్మాణం పూర్తిచేసే దిశగా పనులు సాగుతున్నాయి. సంక్రాంతి తర్వాత వంతెన ప్రారంభించేలా అధికారులు పనులు చేస్తు న్నారు. వంతెనలోని ఒక శ్లాబు పనులను గురు వారం పూర్తిచేశారు. ఈ నెలాఖరుకు రెండో శ్లాబును వేసేందుకు సమాయత్తమవుతున్నారు. వంతెన అం దుబాటులోకి వస్తే ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల రాకపోకల కష్టాలు తీరుతాయి. వంగర–వీర ఘట్టం మండలాల ప్రజలకు వ్యయప్రయాసలు తప్పనున్నాయి. దారి దగ్గరవుతుంది.

వంతెన పనులు పట్టించుకోని టీడీపీ...

నాగావళి నదిలో కిమ్మి–రుషింగి గ్రామాల మధ్య 2008లో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ విషాద ఘటనకు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనుకున్న ట్లుగానే అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆయన మరణానంతరం అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.25.4 కోట్ల నాబార్డు నిధులతో 2012లో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినపుడు కొత్తూరు మండలంలో రిమోట్‌తో వం తెన పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చి న తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధి చూపకపోవడం తో కిమ్మి–రుషింగి వంతెన పనుల్లో వేగం తగ్గింది. నిర్మాణం ఆగిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం పై దృష్టి సారించింది. పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేసింది. ఈ మూడున్నరేళ్లలో మిగులు పనులు చేసినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడం తో పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం వాతావ రణం బాగుండడంతో చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఒక్క అడుగు దూరంలో....

వంతెనను 2 అపార్టుమెంట్లు, 15 పిల్లర్లు, 16 శ్లాబులతో డిజైన్ చేశారు. 2014 మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అప్పటికి 75 శాతం పనులు పూర్తయినప్పటికీ 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు ముందు కు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో 2 అపా ర్టుమెంట్లు, 15 పిల్లర్ల నిర్మాణాలు పూర్తికాగా గురు వారంతో 15 శ్లాబుల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన ఇంకో శ్లాబును డిసెంబర్ నెలాఖరుకు పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు. జనవరి లో అప్రోచ్ రోడ్డును నిర్మించి ఫిబ్రవరిలో వంతెనను వాడుకలోకి తీసుకువస్తామని పేర్కొంటున్నారు.



సాగుతున్న వంతెన శ్లాబు పనులు

వంతెన నిర్మాణం పూర్తవుతోంది..

దశాబ్దకాలంగా సాగుతున్న కిమ్మి–రుషింగి వం తెన శ్లాబు పనులను ఈ నెలాఖరుకు పూర్తిచే స్తాం. రెండునెలల్లో వాడుకలోకి తీసుకువస్తాం. ఇంకా ఒక శ్లాబు మాత్రమే వేయాల్సి ఉంది. మిగిలిన శ్లాబును కూడా నెలాఖరుకు పూర్తి చేస్తాం. సంక్రాంతి పండగ తర్వాత రాకపోకలు సాగించవచ్చు.

– జగన్‌మోహన్‌రాజు, జేఈ, కిమ్మి–రుషింగి వంతెన

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి

- డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు
- చీపురుపల్లిలో టెన్నికాయిట్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక



టెన్నికాయిట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవ రావు కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లో గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టెన్నికాయిట్ అండర్ –14, 17 విభాగంలో జిల్లా స్థాయి ఎంపిక కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరె డ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, సర్పంచ్ మంగళగిరి సుధారాణితో కలిసి ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా పుట్టి పెరిగిన ఊరితో బాటు దేశానికి మంచి పేరు వస్తుందన్నారు. క్రీడల్లో రాణించే అవకాశం ప్రతి ఒక్కరికీ వస్తుందని, నిరు త్సాహం వహిస్తే సచిన్, కరణం మల్లేశ్వరి వంటి క్రీడాకారులు దేశానికి పరిచయమై ఉండేవారు కారని స్పష్టం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఇస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసు కుని క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంత రం వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందజేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, మంగళగి రి శ్రీను, గిరడ రాందాసు, తాడేల ఉమ, ఆదిబా బు, కరణం ఆది, దాలయ్య, పాఠశాల హెచ్ఎం ఎస్.శ్యామలసాయి, వ్యాయామ ఉపాధ్యాయులు పీసీ స్వరూప్, కె.మురళీధర్, కంది సత్యనారాయ ణ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని జిల్లా పరి షత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలుగుజాతి కోసం ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రాణాలు విడిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కు మార్, జిల్లా పంచాయతీ అధికారి నిర్మలాదేవి, జెడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్



రైతులకు భూహక్కు పత్రాలను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి, జేసీ, ఆర్డీఓ తదితరులు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: దశాబ్దాల తరబడి రైతులను క్యాన్సర్‌లా పట్టిపీడిస్తున్న భూ సమస్యలను భూముల సమగ్ర రీ సర్వేతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిష్క రిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయ ఆవర ణలో గురువారం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జేసీ మయూర్‌అశోక్ తదితర అధికారులతో కలిసి బొబ్బిలి డివిజన్‌లోని ఎంపిక చేసిన రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ శాశ్వత హక్కు పత్రాలతో భూముల టాంపరింగ్‌కు చెక్ పడుతుందన్నారు. మనకు తెలియకుండా భూ బదిలీలు జరగవన్నారు. సచివాలయంలోనే రిజిస్ట్రే షన్ సదుపాయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు మాట్లాడుతూ భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రూ.వెయ్యి కోట్ల వ్యయంతో సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టారని, దేశంలో ఎక్కడాలేని బృహత్తర కార్యక్రమంగా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఒకట్రెండు చోట్ల ఉన్న ఇనాంభూముల సమస్యలను పరిష్క రించాలని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో రాసు కున్న సాదాబైనామాలనూ రెగ్యులర్ చేస్తామని చెప్పారు. రెండున్నర ఎకరాల పల్లం, ఐదెకరాల మెట్టును ఒక్కో రైతుకూ ఉచితంగా ఖర్చులేకుండా రెగ్యులరైజ్ చేసి బీహెచ్‌పీలను (భూహక్కు పత్రాలు) అందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 155 గ్రామాల్లో సర్వే జరగ్గా అందులో బొబ్బిలి డివి జన్‌లో వంద గ్రామాల్లో సర్వే పూర్తయినట్టు వెల్ల డించారు. ఇక నుంచి సర్వే నంబర్లుండవనీ, ఎల్‌పీ ఎంలు మాత్రమే ఉంటాయని తెలిపారు. కార్యక్ర మంలో సర్వే సమస్యలు, భూ తగాదాలపై తెర్లాం రెవెన్యూ సిబ్బంది ప్రదర్శించిన లఘునాటిక రైతులను ఆలోచింపజేసింది. విశ్రాంత తహసీల్దార్ విజయకుమార్ అప్పటికప్పుడే రచించి పాడిన పాట అలరించింది. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శేషశై లజ, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, నాలుగు మండలాల తహసీల్దార్లు రాజారావు, బాలమురళీ కృష్ణ, గణపతిరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- జిల్లాలో 52 మత్స్యకార సొసైటీలు
- 7,800 మందికిపైగా మత్స్యకారులు
- 278 ఫిష్ ఆంధ్రాషాపులకు దరఖాస్తులు
- 40నుంచి 60 శాతం రాయితీతో పరికరాలు
- ఫిషరీస్ డీడీ ఎన్.నిర్మలకుమారి

రాజాం:



డీడీ ఎస్.నిర్మలాకుమారి

జిల్లాలోని మత్స్యకార కుటుంబాల నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముం దుకు సాగుతున్నామని ఫిషరీస్ జిల్లా డీడీ ఎస్. నిర్మలాకుమారి అన్నారు. ఇప్పటికే మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందని, వారి జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. రాజాంలోని ఫిషరీస్ కార్యాలయం లో స్థానిక విలేకరులతో ఆమె గురువారం మాట్లా డారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 52 మత్స్యకార సంఘాలు ఉన్నాయని, వాటిలోని సభ్యులకు రాయితీపై రుణాలు, వేటకు సంబంధించిన పరిక రాలు, చేపల విక్రయాలకు సంబంధించి ప్రోత్సా హక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏడు మహిళా మత్స్యకార సహకార సం ఘాలతో పాటు పూసపాటిరేగ, భోగాపురం వద్ద మెరైన్ సహకార సంఘాలు, మిగిలిన చోట్ల స్వదేశీ మత్స్యసహకార సంఘాలున్నట్టు వెల్లడించారు. వీటి పరిధిలో మొత్తం 7,800 మంది మత్స్యకా రులు సభ్యులుగా ఉన్నారన్నారు. చెరువులు, రిజ ర్వాయర్లు, సముద్రంలో చేపలవేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ఏడాది ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజనాపథకం కింద సొసైటీల్లోని మత్స్యకారులకు చేపపిల్లలు రాయి తీపై ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకూ 3,39,000 చేప పిల్లలు సరఫరా చేశామని వెల్లడిం చారు. చేపపిల్లలు కావాల్సిన వారు మత్స్యకార పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని, డిస్ట్రిక్ట్ కమిటీ పరి శీలన అనంతరం సీడ్ ఇస్తామని స్పష్టంచేశారు. సాధారణ కుటుంబాలకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ లకు 60 శాతం రాయితీపై బొచ్చ, రాగండి, ఎర్ర మైలు రకం చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

178 దరఖాస్తులు..

ఫిష్ ఆంధ్ర షాపుల కోసం జిల్లా వ్యాప్తంగా 178 మంది దరఖాస్తు చేసుకున్నట్టు నిర్మలాకుమారి తెలిపారు. ఇప్పటివరకు 109 షాపుల కేటాయిం చగా, 48 షాపులు ప్రారంభించామన్నారు. రూ.1 లక్ష, రూ.1.70లక్షలు, రూ.3.20లక్షల యూనిట్లను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. షాపులకు తూనిక యంత్రాలు, టేబుల్స్, కట్టర్స్, కటింగ్ మిషన్లు, ఫ్రీజర్లు, ఇన్వర్లు వంటివి రాయితీపై ఇస్తామని పేర్కొన్నారు. ఇవి కాకుండా లైవ్‌ఫిష్ ట్యాంకు, వెహికల్స్ వంటివి సమకూర్చు తున్నామని తెలిపారు. రెస్టారెంట్లు పెట్టుకుని వ్యాపారాలు చేసేవారికి రూ.10లక్షల నుంచి రూ.20 లక్షలు విలువచేసే వాహనాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు.

18, 19 తేదీలో స్కూల్ గేమ్స్ క్రీడా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండ ర్–19 స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 18,19 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ ఆర్గనైజిం గ్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి వాలీబాల్ పోటీలు, 19న త్రోబాల్ జట్ల ఎం పిక పోటీలు రాజీవ్ క్రీడామైదానంలో జరుగుతాయ న్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకా రులు విధిగా ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తూ 2004 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకా రులను త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అం డర్–19 స్కూల్‌గేమ్స్ అంతర్‌జిల్లాల పోటీలకు జిల్లా తరఫున పంపిస్తామన్నారు. అర్హత, ఆసక్తి కలి గిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న సబ్ జూనియర్స్ వాలీబాల్ జట్ల ఎంపికలు

రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్‌జిల్లాల బాల, బాలికల సబ్‌జూనియర్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొ నబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 18న మధ్యాహ్నం 2 గంటల నుంచి రాజీవ్ క్రీడామై దానంలో నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణంరాజు, భగవాన్‌దాస్‌లు తెలిపారు. 2006 జనవరి1వ తేదీ అనంతరం జని 0ంచిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హు లుగా పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకా రులు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు యలమంచిలిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

క్లుప్తంగా

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు



శిక్షణార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం క్రైమ్: ఉత్తర కోస్తా జిల్లాల్లో పీఎస్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పీటీసీలో రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎస్‌ఓలుగా విధుల్లో ఉన్నప్పుడు వీఐపీని కాపాడడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శిక్షణలో నేర్చుకుని, సేవాభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పీవీ.అప్పారావు, ఇంటెలిజెన్స్ డీఎస్పీ డి.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జేపీఎల్



టాస్‌వేసి పోటీలు ప్రారంభిస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం: జగనన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. విజయనగరంలోని అయోధ్యామైదానంలో జరుగుతున్న పోటీలు రెండో దశకు చేరుకున్నాయి. గురువారం జరిగిన ఆరు మ్యాచ్‌లను మొదటి రౌండ్‌లో గెలిచిన 12 జట్ల మధ్య నిర్వహించారు. ఈ పోటీల్లో డెవిల్ హంటర్స్, దత్తి అజయ్ లెవెన్, పూల్‌బాగ్ పైరేట్స్, పవర్ థండర్స్, జగనన్న లెవెన్, అంబేడ్కర్ లెవెన్, విజయం సాధించి మూడో రౌండ్ పోటీలకు అర్హత సాధించాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అవనాపు విక్రమ్, భావన దంపతులు తెలిపారు.

షాపు దగ్ధం



దగ్ధమవుతున్న దుకాణం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైతు బజారు రోడ్డు వద్దగల ఓ షాపులో గురువారం అగ్నిప్రమాదం సంభవించడంతో షాపు పూర్తి దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏర్పడిన ప్రమాదంలో రైతు బజార్ సమీపంలో గల దుకాణం పూర్తిగా దగ్ధమైంది. ఆ షాపు పక్కనే పెట్రోల్‌బంకు, విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్, హోటల్ ఉండడంతో సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



వామాసీ గ్రామంలో స్వాధీనం చేసుకున్న సారాను చూపిస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ గిరిశిఖర గ్రామమైన వామాసీ పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరంపై ఎల్విన్‌పేట పోలీసులు గురువారం ఉదయం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 800 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే 50 లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాలు నేరమని, ఏ గ్రామంలోనైనా సారా వంటకాలు చేపట్టినా, విక్రయించినా తమకు సమాచారం అందివ్వాలని తెలియజేశారు. దాడుల్లో ఎస్సై ఎస్.షన్ముఖరావు, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 545.00
విజయనగరం	రూ. 549.00
శ్రీకాకుళం	రూ. 549.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,280–00
బంగారం(22సి. 10గ్రా.)	49,750–00
వెండి (కిలో)	72,500–00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

రంగ రంగ రంగపతి రంగనాథా..!

- విష్ణుమూర్తికి ప్రీతిపాత్రం..ధనుర్మాసం
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో నెలకొన్న ఆధ్యాత్మిక, పండగ వాతావరణం



రాణావీధిలోని వైష్ణవాలయం, (ఇన్‌సెట్లో) పూజలందుకోనున్న మూలవిరాట్

రాజాం సిటీ: ధనుర్మాసం విష్ణుమూర్తికి చాలా ప్రీతిపాత్రమైంది. అన్ని విష్ణు ఆలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో నెలరోజులపాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తిని మధుసూదనుడిగా పూజిస్తారు. మొదటి 15 రోజులు చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాతి 15 రోజులు దద్దోజనం సమర్పిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు ఇంటి ముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు లభిస్తాడని ప్రతీతి. ఈ మాసంలోని నెల రోజులూ శ్రీకృష్ణుడికి తులసి మాల సమర్పించే యువతులకు నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

నెలరోజులపాటు ఉత్సవాలు

ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ధనుర్మాస వ్రతాలను కూడా ఆచరిస్తారు. ఆలయాల్లో నిత్యం ఉదయం సుప్రభాతం, మంగళవాయిద్యాలు, తిరుప్పావై గానం, ఆండాళ్ కోవెల సేవ జరుపుతారు. ప్రతి శుక్రవారం గోదాదేవికి కుంకుమార్చన చేస్తారు. జనవరి 14న మకర సంక్రాంతి పండగ రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ మాసమంతా వైష్ణవ ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణంతో పండగ పందడి నెలకొంటుంది.

ధనుర్మాసం విశిష్టత

సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశిస్తాడు కాబట్టి ఈ మాసాన్ని ధనుర్మాసంగా పేర్కొంటారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంత వరకు ఉండే పవిత్ర మాసం ఇది. వైష్ణవ సంప్రదాయాలలో ఈ మాసం అత్యంత పుణ్యదాయకం. ఈ మాసమంతా వైష్ణవాలయాల్లో ప్రతిరోజూ వేకువ జాము నుంచే విశేష పూజలు నిర్వహిస్తారు. గోదాదేవి తన ఆరాధనను పూలమాలలుగా భావించి రంగనాథునికి సమర్పించి మోక్షం పొందినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆమె రచించిన 30 పాశురాలను ధనుర్మాసమంతా వైష్ణవాలయాల్లో పారాయణం చేస్తారు. వచ్చే పుష్యశుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) అంటారు. వైకుంఠ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉంటే విష్ణువు ఏకాదశి రోజున మేల్కొని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తాడని పెద్దలు చెబుతున్నారు. ఆ రోజున ప్రభాత వేళలో స్వామిని ఉత్తరద్వారంలో దర్శనం చేసుకోవడం ముక్తిదాయకమని ప్రతీతి. ఈ మాసమంతా గృహిణులు ఇళ్ల ముందు కళ్లాపిచల్లి రంగురంగుల ముగ్గులతో అలంకరణ చేపట్టడం సంప్రదాయకంగా వస్తుంది.

ఎంతో శుభప్రదమైనది



భక్తురాలు గోదాదేవి రంగనాథుడిని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేసినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పాశురాలు పఠించినా, విన్నా, గోదా కల్యాణం తిలకించినా శుభాలు కలుగుతాయి. 12 మాసాలలో ధనుర్మాసాన్ని వైష్ణవులు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.

తిరుమల రంగనాథం, వైష్ణవాచార్య పీఠాధిపతి, పనసలవలస, రేగిడి మండలం

మూడోరోజే ముగిసిన రంజీ

- ఆంధ్రాపై 9 వికెట్ల తేడాతో గెలుపొందిన ముంబై
- మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ తనుష్ కొటియాన్



విజయం సాధించిన ముంబై జట్టు

విజయనగరం/విజయనగరం రూరల్: ఆంధ్రాతో ప్రారంభమైన రంజీ పోరులో స్టార్ ఆటగాళ్లతో నిండిన ముంబై జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొంది, రంజీ సీజన్‌ను ఘనంగా ఆరంభించింది. విజయనగరం జిల్లా కేంద్రం, చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్ జోన్ క్రికెట్ మైదానంలో ఈ నెల 13 నుంచి ఎలైట్ 'బి' గ్రూపులో ఉన్న ఆంధ్రా, ముంబై జట్ల మధ్య రంజీ మ్యాచ్ ఆరంభమైంది. తొలి ఇన్నింగ్స్‌లో 238 పరుగులతో ముంబై జట్టుకు పోటీనిచ్చిన ఆంధ్రా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో చేతులెత్తేసింది. మూడో రోజైన గురువారం ఆటను 290/6 స్కోర్‌తో, తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై జట్టు మరో 41 పరుగులు జోడించి, 331 పరుగుల స్కోర్ వద్ద ఆలౌటైంది. దీంతో ముంబై జట్టుకు 93 పరుగుల తొలిఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు, ముంబై జట్టు బౌలర్ల ధాటికి 131 పరుగులకే కుప్పకూలింది. జట్టులో ఏ ఒక్క బ్యాటర్ అర్ధ సెంచరీ సాధించలేకపోయాడు. ఓపెనింగ్ బ్యాటర్ గిరినాథ్‌రెడ్డి 27 పరుగులు చేయగా, ఆంధ్రా జట్టు కెప్టెన్ హనుమ విహారి (14 పరుగులు), రికీభుయ్ (16), కె.నితీష్‌కుమార్ రెడ్డి (15), సోహెబ్ మహమ్మద్ ఖాన్ (11), కేవీ శశికాంత్ (13)లు మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. మిగతా బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు.



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ తనుష్ కొటియాన్

స్కోర్లు సంక్షిప్తంగా..	
ఆంధ్ర తొలి ఇన్నింగ్స్:	238/10
ముంబై తొలి ఇన్నింగ్స్:	331/10
ఆంధ్రా రెండో ఇన్నింగ్:	131/10
ముంబై రెండో ఇన్నింగ్స్:	40/1

స్వల్ప విజయ లక్ష్యం

ఆంధ్ర జట్టు తక్కువ స్కోర్‌కే రెండో ఇన్నింగ్స్‌ను ముగించడంతో 39 పరుగుల స్వల్ప విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టు ఓపెనింగ్ స్టార్ బ్యాటర్ పృథ్వీషా (6 పరుగులు, అవుట్) వికెట్‌ను త్వరగానే కోల్పోయినా, యశస్వీ జైశ్వాల్ (17 పరుగులు), తొలి ఇన్నింగ్స్ హీరో అర్మాన్ జాఫర్ (17 పరుగులు), అజేయంగా నిలిచి విజయాన్ని పూర్తి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు సాధించిన ముంబై జట్టు బౌలర్ తనుష్ కొటియాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో ముంబై జట్టుకు 6 పాయింట్లు లభించాయి.

సైనిక పాఠశాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వం సహకారం అభినందనీయం
- తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్, ఎల్‌బీఏ చైర్మన్ విశ్వజిత్ దాస్‌గుప్తా



ఎల్‌బీఏ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల మరింత పురోగతి సాధించడానికి తమ వంతు కృషి చేస్తామని తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్, లోకల్ బోర్డ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఏ) చైర్మన్ విశ్వజిత్ దాస్‌గుప్తా పేర్కొన్నారు. కోరుకొండ సైనిక పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎల్‌బీఏ సమావేశానికి చైర్మన్ హోదాలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి, ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల అభివృద్ధికి చేపట్టిన చర్యలు, పురోగతి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అనంతరం ఎల్‌బీఏ చైర్మన్ విశ్వస్వజిత్ దాస్‌గుప్తా మాట్లాడుతూ పాఠశాల సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, ఇదే ఒరవడి కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముందుగా ఎల్‌బీఏ చైర్మన్‌కు పాఠశాల అధికారులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అడ్మిరల్ వార్ మెమోరియల్ వద్ద యుద్ధ వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కె.సురేంద్రనాథ్, ఎంపీ బి.చంద్రశేఖరరావు, ఏపీ ప్రభుత్వ ప్రధాన ఆర్థిక కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, జేఎన్‌వీ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఎం.సీతారామరాజు, ఏపీఈ డబ్ల్యుఐడీసీ ఈఈ ఎం.శామ్యూల్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వీకే విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 75 కుష్ఠు కేసుల గుర్తింపు

- జిల్లాలో 5,01,612 ఇళ్లు సర్వే చేసిన వైద్యసిబ్బంది
- సర్వేలో పాల్గొన్న 1,790 టీమ్‌లు
- 1,469 మంది అనుమానితుల గుర్తింపు

విజయనగరం ఫోర్ట్: కుష్ఠు వ్యాధి వ్యాప్తి గణనీయంగా తగ్గిందనుకుంటున్న తరుణంలో కొత్త కేసులు నమోదవుతుండడంతో కలకలం రేపుతోంది. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా కుష్ఠు వ్యాధిని గుర్తించే ప్రక్రియ జరగలేదు. ఈ క్రమంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వే చేయించింది. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 5వతేదీ వరకు కుష్ఠువ్యాధిపై చేసిన సర్వేలో 1,790 టీమ్‌లు పాల్గొని జిల్లాలోని 5,01,612 ఇళ్లను సర్వే చేశాయి. 20,01,014 మందిని స్క్రీనింగ్ చేసి వారిలో కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న 1,790 మందిని గుర్తించారు. వారికి పరీక్షలు చేయగా 75 మందికి వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయింది.



కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

ఈ ఏడాది జిల్లాలో సర్వే

జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహించి 20 లక్షల మందిని స్క్రీనింగ్ చేశాం. గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ వల్ల సర్వే జరగలేదు. అందువల్ల ఈ ఏడాది చేపట్టాం.

డాక్టర్ రామేశ్వరి ప్రభు, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి

18న యోగా క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న శాప్ యోగా లీగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో 8 నుంచి 12 సంవత్సరాలు, 13 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాలు, 18 నుంచి 21 సంవత్సరాల వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు శాప్‌లీగ్స్ యాప్‌లో వారి పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీలకు పంపించనున్నట్లు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8374904262 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి

పార్వతీపురం: బొబ్బిలి మండలం కృష్ణాపురానికి చెందిన చుక్క కృష్ణమూర్తి టీవీఎస్ మోపెడ్‌పై కుమార్తె ఇంటికి బక్కుపేట వెళ్తుండగా వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన కృష్ణమూర్తిని అదే బస్సులో తరలిస్తుండగా, మార్గమధ్యంలో 108 వాహనం రావడంతో అందులో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ మేరకు కేసును నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

డెంకాడ: అక్రమంగా తరలిస్తున్న 1,150 కేజీల పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని చందకపేట వద్ద విజిలెన్స్ సీఐ ఆర్.అప్పలనాయుడు, భోగాపురం సీఎస్‌డీటీ బీవీ మురళీకృష్ణలు గురువారం పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాన్ని సీజ్ చేసి, డెంకాడ పోలీస్‌స్టేషన్‌కు అప్పజెప్పారు. దీంతో పాటు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న పెదతాడివాడకు చెందిన హెచ్.హరిప్రసాద్, డెంకాడకు చెందిన ఎస్.వెంకటరమణలపై 6ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాలకొండ రూరల్: ఈ నెల 12వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పట్టణంలోని ఎస్.కె.రాజపురానికి చెందిన కె.చిన్నమ్మడు(38) శ్రీకాకుళం జెమ్స్‌లో చికిత్సపొందుతూ గురువారం మరణించినట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. భర్త అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అండర్-17 స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన జిల్లా బాల,బాలికల జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం పూర్తయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 180 మంది క్రీడాకారులు హాజరై పోటీ పడ్డారు. వారికి బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ అంశాల్లో వ్యక్తిగత సామర్థ్య పరీక్షను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా జట్టులోకి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగబోయే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఎంపిక పోటీలను పీడీలు పెనుమత్స బంగార్రాజు, నాని, తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ కారుపై దాడి

- నిందితుడిపై కేసు నమోదు




పోలీసులతోపాటు కారును పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రాజాం సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు కారుపై దాడి జరిగింది. ఆయన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి పెనుబాకలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కంబాల జోగులుతోపాటు శ్రీనివాసరావు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో పెనుబాక జంక్షన్‌కు వచ్చేసరికి ఎమ్మెల్యే కారుకు పక్కగా మున్సిపాల్టీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన మజ్జి కృష్ణ స్కూటీని ఆపాడు. దీంతో కార్యాలయానికి రావాలని చేయి ఊపి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. శ్రీనివాసరావు కూడా తన కారులో ఇంటికి బయల్దేరారు. శ్రీకాకుళం రోడ్డులో సురక్ష ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి శ్రీనివాసరావు కారుకు అడ్డంగా మజ్జి కృష్ణ స్కూటీని ఆపి సమస్య ఉంది మాట్లాడాలని చెప్పాడు. సమస్యను ఎమ్మెల్యేకు చెప్పు అని శ్రీనివాసరావు సమాధానమిచ్చి ఇంటికి వెళ్లిపోయారు. దీంతో కోపోద్రిక్తుడైన మజ్జి కృష్ణ శ్రీనివాస రావు కారును వెనుక నుంచి ఫాలో అయి ఆయన కారు పార్కింగ్ చేసిన తరువాత రాయితో వెనుక అద్దం పగలగొట్టాడు. తన కారుపై దాడిచేసి అద్దాలు పగలగొట్టిన వ్యక్తిపై శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ముగిసిన జగనన్న స్వర్ణోత్సవాలు

- విజేతలకు 20న నగదు బహుమతుల ప్రదానం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణి ప్రియా



బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించారు. తప్పెటగుళ్లు, భరతనాట్యం, జానపద నృత్యం, పులివేషాలు, బుర్రకథలు, కాళికావేషాలు, కర్ణాటక సంగీతం, లలిత సంగీతం, కూచిపూడి తదితర కళారూపాలను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన కళాకారులు ఈ నెల 19, 20వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. జోనల్ స్థాయి విజేతలకు ఆ రోజు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు.

జోనల్‌స్థాయి విజేతలు వీరే..			
కళారూపం	విజేత పేరు	జిల్లా	నగదు బహుమతి
కూచిపూడి	ఆర్.శ్రీకాంత్(బృందం)	శ్రీకాకుళం	రూ.25,000
కూచిపూడి	ఎం.శ్రీ రవళి(సోలో)	విశాఖపట్నం	రూ.10,000
భరత నాట్యం	టి.తన్మయి(బృందం)	విజయనగరం	రూ.25,000
భరత నాట్యం	డి.నేహ(సోలో)	శ్రీకాకుళం	రూ.10,000
జానపద సంగీతం	పి.పాపరత్నం(బృందం)	విజయనగరం	రూ.25,000
జానపద సంగీతం	బి.శివకుమార్	విజయనగరం	రూ.10,000
కోలాటం	ఎన్.లక్ష్మీ బృందం	శ్రీకాకుళం	రూ.25,000
థింసా	పొద్దు అర్జున్(బృందం)	అల్లూరి సీతారామరాజు	రూ.25,000
పులివేషాలు	పైడిమాంబ(బృందం)	విజయనగరం	రూ.25,000
కాళికావేషాలు	బాలాజీ బాబు (బృందం)	అల్లూరి సీతారామరాజు	రూ.25,000
తప్పెటగుళ్లు	నేలబోను సత్యం (బృందం)	విజయనగరం	రూ.25,000
జానపద నృత్యం	గాయత్రి (బృందం)	శ్రీకాకుళం	రూ.25,000
జానపద నృత్యం	జి.ప్రవల్లిక (సోలో)	విజయనగరం	రూ.10,000
కర్ణాటక సంగీతం	ఎస్.పార్థివ	విశాఖపట్నం	రూ.10,000
లలిత సంగీతం	ఎ.లక్ష్మీ శైలజ	విశాఖపట్నం	రూ.10,000

క్లుప్తంగా

ఐక్య క్రిస్మస్ వేడుకలకు తరలిరండి

విజయనగరం టౌన్: జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ సంఘ సభ్యులందరూ హాజరు కావాలని జిల్లా ఐక్య క్రిస్మస్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ వి.విజయకుమార్‌శర్మ, డాక్టర్ ఉదయ్‌చంద్ర, బిషప్ పాల్సన్, రెవరెండ్ ఎస్.మధు, డాక్టర్ పి.ప్రేమానందం, రెవరెండ్ డి.ఎలీషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం సీఎస్ఐ చర్చి గ్రౌండ్స్‌లో నిర్వహించే వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంట్యాడ మండలంలోని ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి విజయనగరానికి తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్‌లకు ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో 37, 38, 39, 40, 41, 46, 47 డివిజన్‌లతో పాటు ఉడా కాలనీ ఫేజ్–1, 2, 3, 4 ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నాణ్యత లోపించకూడదు..



రహదారి పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో చేపడుతున్న సీసీ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని కొండవెలగాడ గ్రామం మొయిదపేటలో జరుగుతున్న సీసీ రహదారి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

18న బీసీ కులాల ఆత్మీయ కలయిక

విజయనగరం ఫూల్‌బాగ్: బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఫూల్‌బాగ్‌లోని అటవీశాఖ కార్యాలయంలో ఈ నెల 18న ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు గురువారం తెలిపారు. స్థానిక కోరాడవీధిలోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బీసీ కులాలకు చెందిన వారంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మజ్జి అప్పారావు, చోడి ఆదినారాయణ, రామేశ్వరపు రామారావు, ముదిలి నాగభూషణం ఉన్నారు.

ఈనాడు అసత్య కథనంపై వలంటీర్ల నిరసన

చీపురుపల్లిరూరల్(గరివిడి): గ్రామ వలంటీర్ల వ్యవస్థపై ఈనాడు దినప్రతిక అసత్యకథనం ప్రచురించడాన్ని వ్యతిరేకిస్తూ గరివిడి మండల గ్రామ వలంటీర్లు గరివిడి పట్టణంలో గురువారం నిరసన ర్యాలీ చేశారు. ఈనాడు డౌన్‌డౌన్, రామోజీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థపై తప్పుడు కథనం ప్రచురించిన రామోజీరావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు పథకాలు, సేవలు వారి ఇంటివద్దకే అందుతున్నాయని, రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందని, ఓర్వలేని చంద్రబాబునాయుడు ఈనాడు సహకారంతో ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారని మండిపడ్డారు .వలంటీర్ల మనోభావాలు దెబ్బతీసేలా వార్తలు రాస్తే సహించేది లేదని హెచ్చరించారు.

రూ.1.04 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం నుంచి ముద్దానపేట గ్రామానికి రూ.1.04 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి గురువారం ముద్దానపేటలో భూమిపూజ చేశారు. వంగర సర్పంచ్ దత్తి నారాయణ అప్పలనాయుడు, టెలికాం అడ్వయిజరీ బోర్డ్ మెంబర్ దత్తి చిరంజీవి ఆధ్వర్యంలో ముందుగా కొత్తమ్మతల్లికి పూజలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. పెదమానాపురం సర్పంచ్ గొటివాడ దాసు, ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తి, పోరలి పీఏసీఎస్ అధ్యక్షుడు సుమ ల శ్రీను, వైస్ ఎంపీపీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు పనులకు శ్రీకారం

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామం నుంచి కొనిశ గ్రామానికి సుమారు రూ.4 లక్షల ఉపాధి నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ చల్ల చలంనాయుడు గురువారం భూమిపూజ చేశారు. గ్రామ సర్పంచ్ పోతల రమణమ్మ, రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్ గొల్లు సతీష్, పల్లి రామునాయుడు, పోతల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు



విజయనగరం: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నెల్లిమర్ల: ఆంధ్రకేసరి, ఉక్కుమనిషి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న రామారావు, తదితరులు

పొట్టి శ్రీరాములు మహనీయుడు

● ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ అదనపు ఎస్పీ సోల్మన్

విజయనగరం క్రైమ్: అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయుడని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ అదనపు ఎస్పీ ఎం.ఎం సోల్మన్ అన్నారు. పొట్టి శ్రీరాముల వర్ధంతిని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి, ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు మహనీయుడని కొనియాడారు. స్వతంత్ర్య సంగ్రామంలో గాంధీ వెంట నడిచి, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాముల త్యాగాలను గుర్తిస్తూ నెల్లూరు జిల్లాకు 2008లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేశారన్నారు. అటువంటి మహనీయుడ్ని స్మరించుకోవడం తెలుగువారి బాధ్యతన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీఓ ఏఓ వెంకటరమణ, న్యాయ సలహాదారులు వై.పరశురాం, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రభాకరరావు, ఆర్ఎస్సైలు నీలిమ, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం క్రైమ్: పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్

ఘన నివాళులు..

విజయనగరం: జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన తెలుగు బిడ్డ పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ అమరజీవి ఫౌండేషన్, పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమంలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణ, కోశాధికారి విజ్జపు శ్రీనివాసరావు, అవోపా అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, జిల్లా వాసవీ ఫౌండేషన్ అధ్యక్షుడు మండవిల్లి వెంకటరాజు, ఏడుకొండలు, రత్నారావు, సంఘం కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు, వాసవీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పేర్ల సీతారామయ్య శెట్టి, వాసవీ క్లబ్ కోశాధికారి రత్నాకరరావు, తోట పాలెం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఆకి సూర్య ప్రకాశరావు, తవ్వా మోహనరావు, కంటోన్మెంట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముమ్మిడి శెట్టి సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, ఉపేంద్ర, కందుల సంతోష్, జనార్ధనరావు, గుంపిన నారాయణరావు, తదితరు లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

విజయనగరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు ఆమరణ దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని అమరజీవి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా రోటరీ రక్తనిధి సెంటర్ వద్ద రక్తదానశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యుడు అబ్దుల్ రవూఫ్, ఫౌండేషన్ కార్యదర్శి నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు, గుంపిన నారాయణరావు, కందుల సంతోష్, ముమ్మిడిశెట్టి సత్యనారాయణ, చెన్నా బుచ్చి జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో..

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట వార్డు సచివాలయంలో ఆంధ్రకేసరి పొట్టి శ్రీరాములు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. వైస్‌చైర్మన్ ఎస్.రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, నారాయణమూర్తి, హైమావతి, సచివాలయ కార్యదర్శులు ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు, యువత ఆంధ్రకేసరి, ఉక్కుమనిషి బాటలోనే నడవాలని సూచించారు.

పచ్చదనం పెంపొందించేలా చర్యలు

విజయనగరం ఫూల్‌బాగ్: పచ్చదనం పెంపొందించే చర్యలు తీసుకోవాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఫూల్‌బాగ్‌లోని అటవీశాఖ జిల్లా కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం అక్కడ నర్సరీని సందర్శించారు. ఆ తర్వాత సారిపల్లి సెంట్రల్ నర్సరీలో నిర్మాణంలో ఉన్న నగరవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఎఫ్ఓ వెంకటేష్, ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డీఆర్ఓ ప్రహ్లాదరావు, కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సారిపల్లి సెంట్రల్ నర్సరీలో నగరవనాన్ని సందర్శిస్తున్న సీఎఫ్ శ్రీకాంత్ రెడ్డి

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



విజయనగరం టౌన్: రైల్వే ఉన్నతాధికారులకు నివేదించనున్న సమస్యల పత్రాన్ని చూపిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు

● రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్

విజయనగరం టౌన్: రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు జీకే ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక రైల్వే న్యూకాలనీలో ఉన్న సంఘ కార్యాలయంలో సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరోనా తర్వాత సీనియర్ సిటిజన్లు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నామన్నారు. పింఛనుదారుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వయోవృద్ధులకు అదనపు పెన్షన్ ఉత్తర్వులు వెంటనే అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎం.కె.విశ్వనాథం, కోశాధికారి, ఎస్.రామారావు, ఉపాధ్యక్షుడు దుక్కరాజు, ప్రధాన కార్యదర్శి వంకర అప్పారావు, సహాయ కార్యదర్శి కె.కాళిదాసు, ఎం.భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక రుగ్మతలు దూరం



శతజయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ డీవీ శ్రీకాంత్, తదితరులు

విజయనగరం టౌన్: సంగీతంతోనే మానసిక రుగ్మతలు దూరమవుతాయని రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ చీఫ్ పాట్రన్ డాక్టర్ డీవీ శ్రీకాంత్ అన్నారు. ఈ నెల 23న రోటరీ కమ్యూనిటీ హాల్‌లో దశిగి పేర్రాజు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక మ్యూజిక్ అకాడమీలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం సంగీతం ద్వారానే ఆందోళనలు లేకుండా ఆరోగ్యమైన, ఆనందమైన జీవనం గడపడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్వాంసుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మల్లాది సూరిబాబు (విజయవాడ) హాజరవుతారన్నారు. అనంతరం ఆయన సంగీత కచేరి నిర్వహిస్తారన్నారు. అభిమానులందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఆకాడమీ అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, మేఘరాజ్ రాతీ, కోశాధికారి జి.వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణసహాయం అందజేత

గుర్ల: మండలంలోని పాలవలసకు చెందిన గొలగాన శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య గొలగాన గంగమ్మకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10 వేల నగదును తక్షణ సహాయంగా ఎంపీపీ పొట్నూరు ప్రమీల గురువారం పాలవలస సచివాలయం వద్ద అందజేశారు. మిగిలిన రూ.90 వేలు గంగమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని అధికారులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బూర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. నగరంలోని 37వ డివిజన్ పరిధి వీటీ అగ్రహారం బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం అందడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్‌కు ఆరు రోడ్లు మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే కోలగట్లకే దక్కుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ, సమస్యల్లేని డివిజన్‌గా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, నగర పాలక సంస్థ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

తడి, పొడి చెత్తపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల: హానికర చెత్త వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ అన్నారు. క్లాప్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదిత్య పాఠశాలలో విద్యార్థులకు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపదను ఎలా సృష్టించాలో వివరించారు. హోం కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం తడి–పొడి, హానికర చెత్తలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం స్థానిక వార్డులోని మహిళలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేసిన బుట్టల్లోనే చెత్తను వేరు చేసి వేయాలని సూచించారు. పట్టణాన్ని కాలుష్యరహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, ఆదిత్య పాఠశాల డైరెక్టర్ వి.సూరిబాబు, హెచ్ఎం అమృత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం

● మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం: విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు రేవతీదేవి, కోలగట్ల శ్రావణి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కస్పా హైస్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం వారు పరిశీలించారు. ఆహారం శుచిగా, రుచిగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు తీసుకొచ్చి సంపూర్ణ పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. రుచికరమైన పౌష్టికాహారం అందించడం వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎదుగుతారని చెప్పారు. విద్యా కమిటీ సభ్యురాలు బాలి పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, మధ్యాహ్న భోజన నిర్వహకులు పిలక శ్రీను పాల్గొన్నారు.



ఆహారాన్ని రుచి చూస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

అవినీతి రహిత పాలన

కొత్తవలస రూరల్: సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అవినీతి రహిత, మెరుగైన పాలన అందిస్తు న్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ ఎర్రవానిపాలెంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చిన వారికి, టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే పథకాలు అందేవని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, లంచాలు, సిఫార్సులకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, నాయకులు పి.చెల్లయ్య, పి.ఎస్.ఎన్.పాత్రుడు, గొరపల్లి రవి, మదిన అప్పలరమణ, సర్పంచ్‌లు పీతల కృష్ణ, భూసాల దేముడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

చీపురుపల్లిరూరల్(గరివిడి)/ గజపతినగరం/ గంట్యాడ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు బాలురు, బాలికల విభాగాల్లో గరివిడి మండలం తోండ్రంగి, గజపతినగరం మండలం మరుపల్లి, గంట్యాడ మండలం పెదవేమలి ఉన్నత పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 14న విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించి న జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్–17 కేటగిరిలో ఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు తరఫున ఎంపికయ్యారు. ఈనెల 17,18,19 తేదీ ల్లో తూర్పుగోదావరి జిల్లా కుతుకులూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. తోండ్రంగి పాఠశాల నుంచి విద్యార్థులు కర్రి వెన్నెల, చందక శాంతి, వాళ్లే హరిప్రసాద్, మరుపల్లి నుంచి గెద్ద చరణ్ తేజ, దేవర వంశీ, గెద్ద గాయిత్రి, పెదవేమలి పాఠశాల నుంచి కె.శివాజీ, కె.రఘుపతి రాఘవ, ఎం.రూపాదేవి ఎంపికయ్యారు. వీరిని తోండ్రంగి, మరుపల్లి హెచ్ఎంలు ఎ.వి.రమణరాజు, ఎం.యశోద, పీడీ సత్యనారాయణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

రోప్ స్కిప్పింగ్‌లో..

మెరకముడిదాం/ చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు మెరకముడిదాం కేజీబీవీ విద్యార్థినులు అండర్–17 విభాగంలో కె.సంధ్యారాణి, అండర్–14 విభాగంలో యు.పూజిత, గరివిడి మండలంలోని తాటిగూడ ఉన్నత పాఠ శాల విద్యార్థినులు సోపేటి శశికళ, యడ్ల భానుమతి ఎంపికయ్యారు. ఇటీవల గరివిడి మండలం కాపుశంభాంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో తణుకులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

క్లుప్తంగా...

21 నుంచి విశాఖలో జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలు



సాక్షి, అమరావతి: జాతీయ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్ షిప్–2022 పోటీలకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 21 నుంచి 23 వరకు స్థానిక రాజీవ్‌గాంధీ పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీల్లో దేశవ్యాప్తంగా రెజ్లింగ్ క్రీడాకారులు తలపడనున్నారు. పురుషుల ఫ్రీ స్టైల్‌లో 57, 61, 65, 70, 74, 79, 86, 92, 97, 125 కేజీలు, గ్రీకో రోమన్ స్టైల్‌లో 55, 60, 63, 67, 72, 77, 82, 87, 97, 130 కేజీలు, మహిళల విభాగంలో 50, 53, 55, 57, 59, 62, 65, 68, 72, 76 కేజీల కేటగిరీలో పోటీలు జరగనున్నాయి.

వైజాగ్ టెక్ సమ్మిట్ 2023కు కేంద్రం మద్దతు



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన సదస్సు నిర్వాహకులు

సాక్షి, అమరావతి: ఐటీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైజాగ్ టెక్ సమ్మిట్ 2023కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మద్దతు ప్రకటించారు. ఫిబ్రవరి 16–17 తేదీల్లో జరిగే సమ్మిట్‌కు కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చినట్లు సమ్మిట్ నిర్వాహకులు పరల్స్ గ్రూప్ సీఈవో శ్రీనుబాబు గేదెల ప్రకటించారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో నిర్మలా సీతారామన్‌ను కలిసి సమ్మిట్ వివరాలను తెలియచేసినట్లు తెలిపారు. జీ20 అధ్యక్ష దేశంగా భారత్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గ్లోబల్ టెక్ సమ్మిట్ విజయవంతానికి సహకారం అందిస్తామని, సమ్మిట్ ద్వారా జీ–20 విజన్‌ను ముందుకు తీసుకెళ్లాల్సిందిగా కోరినట్లు శ్రీనుబాబు తెలిపారు. జీ20 సదస్సులకు మద్దతుగా న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరులో గ్లోబల్ టెక్ సమ్మిట్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మిట్ ద్వారా రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

సీఎం పుట్టిన రోజు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి: సంక్షేమాభివృద్ధి పథకాలతో సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమ పోస్టర్‌ను, వైఎస్సార్‌సీపీ బ్లడ్ డొనేషన్.కామ్ పేరుతో వెబ్‌సైట్‌ను తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, పేదలకు సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మందికి లబ్ధి చేకూర్చారన్నారు. వీరంతా సీఎం పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా క్రీడల పోటీలు, 20న సామాజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు. 21న సర్వమత ప్రార్థనలు చేసి.. అనాథాశ్రమాలలో దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. కేక్ కట్ చేశాక.. రెడ్‌క్రాస్‌తో కలిసి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

కేడర్‌ను కాపాడుకోవడానికే బాబు ముందస్తు జపం

వరుస పరాజయాలతో టీడీపీకి కొద్దో గొప్పో మిగిలిన కార్యకర్తల్లో నైతిక స్థైర్యం నింపి, కాపాడుకోవడానికే ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. 2024 ఎన్నికల్లోనూ ఘోర పరాజయం తప్పదనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ శ్రేణుల్లో స్థైర్యం నింపడానికే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నట్లు చంద్రబాబు తనదైన శైలిలో అబద్ధాలు వల్లె వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు.. రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సోషల్ మీడియా విభాగం ఇన్‌చార్జ్ సజ్జల భార్గవరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (మహిళా శిశు సంక్షేమం) పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాల వద్ద ప్రతిజ్ఞ పత్రాలు ఇవ్వొచ్చు

ఈనెల 21న రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో కూడా వైఎస్సార్‌సీపీతో కలిసి రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ కుమార్ తెలిపారు.



అనంతపురం జిల్లా రాయదుర్గంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఏలూరు జిల్లా సూరంపాలెంలో బుక్‌లెట్ అందజేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



అనకాపల్లి జిల్లా దోసూరులో యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



కృష్ణా జిల్లా వణుకూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

మన ప్రభుత్వం

వచ్చే ఏడాది ప్రభుత్వ సెలవులు ఇవే

సాధారణ సెలవుల్లో మూడు ఆదివారాలు, ఒకటి రెండో శనివారం

- ఐచ్ఛిక సెలవుల్లో నాలుగు ఆదివారాలు
- మొత్తం 23 సాధారణ సెలవులు, 22 ఐచ్ఛిక సెలవులు
- నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కింద 16 సెలవులు
- సెలవుల క్యాలండర్ విడుదల చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది (2023) పండుగలు, పర్వదినాలకు చెందిన సాధారణ సెలవుల్లో మూడు ఆదివారాలు, ఒకటి రెండో శనివారం వచ్చాయి. ఐచ్ఛిక సెలవుల్లో నాలుగు ఆదివారాలు వచ్చాయి. 2023లో ప్రభుత్వ సాధారణ సెలవులు, ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రెండో శనివారం భోగి సాధారణ సెలవుల్లో వచ్చింది. మకర సంక్రాంతి, దుర్గాష్టమి, దీపావళి ఆదివారాల్లో.. సాధారణ సెలవుల్లో వచ్చాయి. ఐచ్ఛిక సెలవుల్లో నాలుగు ఆదివారాలు వచ్చాయి. 2023లో మొత్తం 23 సాధారణ, 22 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ మేరకు బ్యాంకింగ్ తోపాటు జాతీయ స్థాయిలో నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కింద 16 సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

2023లో సాధారణ సెలవులు

పండుగ/పర్వదినం	తేదీ	వారం
భోగి	14-01-2023	శనివారం
మకర సంక్రాంతి	15-01-2023	ఆదివారం
కనుమ	16-01-2023	సోమవారం
రిపబ్లిక్ డే	26-01-2023	గురువారం
మహాశివరాత్రి	18-02-2023	శనివారం
హోలి	08-03-2023	బుధవారం
ఉగాది	22-03-2023	బుధవారం
శ్రీరామనవమి	30-03-2023	గురువారం
బాబు జగ్జీవన్‌రామ్ జయంతి	05-04-2023	బుధవారం
గుడ్ ఫ్రైడే	07-04-2023	శుక్రవారం
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి	14-04-2023	శుక్రవారం
రంజాన్	22-04-2023	శనివారం
బక్రీద్	29-06-2023	గురువారం
మొహర్రం	29-07-2023	శనివారం
స్వాతంత్ర్య దినోత్సవం	15-08-2023	మంగళవారం
శ్రీకృష్ణాష్టమి	06-09-2023	బుధవారం
వినాయకచవితి	18-09-2023	సోమవారం
ఈద్ మిలాదున్ నబీ	28-09-2023	గురువారం
మహాత్మాగాంధీ జయంతి	02-10-2023	సోమవారం
దుర్గాష్టమి	22-10-2023	ఆదివారం
విజయదశమి	23-10-2023	సోమవారం
దీపావళి	12-11-2023	ఆదివారం
క్రిస్మస్	25-12-2023	సోమవారం

రెండో శనివారం, ఆదివారం వచ్చిన సాధారణ సెలవులు ఇవే

భోగి	14-01-2023	రెండో శనివారం
మకర సంక్రాంతి	15-01-2023	ఆదివారం
దుర్గాష్టమి	22-10-2023	ఆదివారం
దీపావళి	12-11-2023	ఆదివారం

2023లో ఐచ్ఛిక సెలవులు

కొత్త ఏడాది	01-01-2023	ఆదివారం
హజ్రత్ అలీ పుట్టినరోజు	05-02-2023	ఆదివారం
షబ్-ఇ-బారత్	07-03-2023	శుక్రవారం
మహావీర్ జయంతి	04-04-2023	మంగళవారం
షబ్-ఇ-ఖాదర్	18-04-2023	మంగళవారం
జుమాతుల్ వాద	21-04-2023	శుక్రవారం
బసవజయంతి	23-04-2023	ఆదివారం
షహద్ హజ్రత్ అలీ	24-04-2023	సోమవారం
బుద్ధపూర్ణిమ	05-05-2023	శుక్రవారం
రథయాత్ర	20-06-2023	మంగళవారం
ఈద్-ఇ-గదీర్	06-07-2023	గురువారం
9వ మొహర్రం	28-07-2023	శుక్రవారం
పార్సీ నూతన సంవత్సరం డే	16-08-2023	బుధవారం
వరలక్ష్మీవ్రతం	25-08-2023	శుక్రవారం
అర్బయిన్ (చాహల్లమ్)	05-09-2023	మంగళవారం
హజ్రత్ సయ్యద్ మహమ్మద్ జువాన్‌పురి మెహదీ పుట్టినరోజు	09-09-2023	శనివారం
మహాలయ అమావాస్య	14-10-2023	శనివారం
విజయదశమి (తిథిద్వయం)	24-10-2023	మంగళవారం
యాజ్-దహుమ్-షరీఫ్	26-10-2023	గురువారం
కార్తీకపూర్ణిమ/గురునానక్ జయంతి	27-11-2023	సోమవారం
క్రిస్మస్ ఈవ్	24-12-2023	ఆదివారం
బాక్సింగ్ డే	26-12-2023	మంగళవారం

కొత్త జిల్లాలకు లీడ్ బ్యాంకుల కేటాయింపు

- వాటికి జిల్లా మేనేజర్లను నియమించాలని ఆర్‌బీఐ ఆదేశం
- ప్రత్యేకంగా కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించండి
- తగిన నైపుణ్య సిబ్బందితో పాటు కంప్యూటర్లను సమకూర్చండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు బాధ్యత ఈ మేనేజర్లదే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన 13 జిల్లాలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) లీడ్ బ్యాంకులను కేటాయించింది. వీటికి లీడ్ జిల్లా మేనేజర్లను నియమించాలిసిందిగా ఆర్‌బీఐ ఆదేశించింది. జిల్లాల వారీగా ఆయా లీడ్ జిల్లా మేనేజర్లకు ప్రత్యేకంగా కార్యాలయాలతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరింది. ఈ మేనేజర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, కార్యక్రమాల అమలు, వాటి సమన్వయ బాధ్యతను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ కార్యాలయాలకు అవసరమైన నైపుణ్య సిబ్బందితో పాటు కంప్యూటర్లను ఏర్పాటుచేయాలని ఇటీవల బ్యాంకర్ల సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆయా బ్యాంకులకు సూచించింది. నాయకత్వ లక్షణాలు కలిగిన వారిని లీడ్ జిల్లా మేనేజర్లుగా నియమించాలని కోరింది. నైపుణ్య సిబ్బంది కొరత ఉంటే ఆ సేవలను బయట నుంచి పొందడానికి అనుమతిస్తున్నట్లు కమిటీ పేర్కొంది. జిల్లాల్లో వివిధ బ్యాంకింగ్, ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన నిమిత్తం సమావేశాలు నిర్వహించేందుకు, వాటికి హాజరయ్యేందుకు వీలుగా లీడ్ జిల్లా మేనేజర్లకు ప్రత్యేకంగా వాహనాలూ సమకూర్చాల్సిందిగా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సూచించింది.

కొత్త జిల్లాల వారీగా లీడ్ బ్యాంకులు..

జిల్లా	లీడ్ బ్యాంకు
అల్లూరి సీతారామరాజు	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అనకాపల్లి	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అన్నమయ్య	స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బాపట్ల	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఏలూరు	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కాకినాడు	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
డా.అంబేద్కర్ కోనసీమ	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నంద్యాల	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎన్టీఆర్	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పల్నాడు	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పార్వతీపురం మన్యం	స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
శ్రీ సత్యసాయి	కెనరా బ్యాంకు
తిరుపతి	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మన టార్గెట్ 151 కాదు.. 175



మైలవరం నియోజకవర్గ కార్యకర్తలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- మైలవరం నియోజకవర్గ కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం
- గ్రామంలో 89 శాతం ఇళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తున్నాం
- గడప గడపకూ వెళ్లి చేసిన మేలును వివరించండి
- నేనూ, మీరు అందరం ఒక్కటై పనిచేస్తే 175 స్థానాల్లోనూ విజయం ఖాయం

సాక్షి, అమరావతి: 'వచ్చే ఎన్నికల్లో మన టార్గెట్ 151 కాదు.. 175కు 175 శాసనసభ స్థానాల్లో విజయం సాధించడమే' అని ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ కార్యకర్తలకు ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్య నిర్దేశం చేశారు. మనం నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు విజయబావుటా ఎగుర వేయాలంటే యథావిధిగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మీరు, ఎమ్మెల్యే కలిసి.. అందరూ ఒక్కటై.. మనం చేస్తున్న మేలు, అభివృద్ధిని ప్రతి ఇంట్లో వివరించి, వారి ఆశీర్వాదం తీసుకోవాలని చెప్పారు. అలా అందరూ కలిసికట్టుగా పని చేస్తే మొత్తం 175 సీట్లు గెల్చుకోగలం అని దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రతి కార్యకర్తతో విడివిడిగా మాట్లాడిన సీఎం.. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైలవరం నియోజకవర్గంలో చేసిన మంచిని గణాంకాలతో వివరించారు. ఈ సమావేశంలో సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

అర్హులందరికీ పథకాలు అందించడానికే..

- 'మరో 16 నెలల్లో ఎన్నికలు రానున్నాయి. అందుకు చాలా సమయం ఉంది కదా అని అనుకోవద్దు. నాలుగు నెలల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టాం. ఆ కార్యక్రమం ద్వారా ప్రజల వైపు అడుగులు వేగంగా వేస్తున్నాం. ఒక్క మైలవరం నియోజకవర్గంలోనే సుమారు 89 శాతం ఇళ్లకు మేలు జరిగింది. వివిధ పథకాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా దాదాపు రూ.900 కోట్ల నగదు నియోజకవర్గంలోని ఇళ్లకు చేర్చాం.
- ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి.. ఆ ఇంట్లో అక్కకూ, చెల్లెమ్మకూ పథకాల ద్వారా ప్రభుత్వం చేసిన మేలును వివరించండి. ఇంత మేలు చేసిన ప్రభుత్వానికి మీ ఆశీస్సులు కావాలి.. దీవించండి అని అడిగే గొప్ప కార్యక్రమం గడప గడపకు మన ప్రభుత్వం. అర్హత ఉండి మిగిలిపోయిన వారినిఅలానే వదిలేయకుండా.. వారికీ మేలు చేయాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశం.
- మరోవైపు ప్రతి సచివాలయంలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు కేటాయించాం. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ప్రతి సచివాలయంలో కనీసం 2 రోజులు.. రోజుకు కనీసం 5 లేక 6 గంటలు గడపాలి. ప్రతి ఇంటికీ వెళ్లాలి. దాని వల్ల ఎమ్మెల్యేలు మీకు దగ్గర అవుతారు. దాంతో సచివాలయాలు కూడా మీకు మరింత చేరువవుతాయి. ఇంకా రూ.20 లక్షల పనుల వల్ల గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతాయి. వీటన్నింటి కోసమే గడప గడపకు కార్యక్రమం.
- వచ్చే జనవరి నుంచి అడుగులు ఇంకా వేగంగా ముందుకు పడనున్నాయి. బూత్ కమిటీలు ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు.. వారిలో ఒకరు మహిళ. వారిని ఎమ్మెల్యే ఎంపిక చేస్తారు. ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు గృహ సారథులు.. ఒక తమ్ముడు, ఒక చెల్లెమ్మను కన్వీనర్లు ఎంపిక చేస్తారు. కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీసి.. అర్హులందరికీ పథకాలు అందేలా చూడటంలో భాగస్వాములవుతారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

ఏపీలో 28 ఉడాన్ రూట్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఉడాన్ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 28 రూట్లు ఆపరేషనలైజ్ చేసినట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. లోక్‌సభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు చింతా అనూరాధ, బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. కడప, కర్నూలు (విమానాశ్రయం), ప్రకాశం బ్యారేజీ (వాటర్ ఏరోడ్రోమ్)లను ఉడాన్ విమానాలు నడపడానికి ఆధునికీకరణ, పునరుద్ధరణ నిమిత్తం గుర్తించినట్లు ఎంపీ సత్యనారాయణ ప్రశ్నకు జవాబిచ్చారు.

అమృత్ సబ్ స్కీంలో 10 పట్టణాలు

అమృత్‌లో భాగంగా జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ ఫార్ములేషన్ సబ్‌స్కీంలో ఆంధ్రప్రదేశ్‌లోని 10 పట్టణాలున్నాయని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి తెలిపారు. విశాఖపట్నానికి రూ.0.89 కోట్లు సహా ఆంధ్రప్రదేశ్‌కు రూ.13.65 కోట్లు విడుదల చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు సమాధానమిచ్చారు.

తెలంగాణను విద్యుత్తు బకాయిలు చెల్లించమని చెప్పాం

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించిన బకాయిలు ఆంధ్రప్రదేశ్‌కు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వానికి చెప్పామని కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రి ఆర్కే సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

నెలాఖరు నుంచి విద్యుదుత్పత్తి

దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్ స్టేజ్–2 (800 మెగావాట్లు)లో ఈ నెలాఖరు నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. ఈ మేరకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

డీఆర్‌ఐపీ రెండోదశలో ఏపీని అధికారికంగా చేర్చలేదు

డ్యాం రీహ్యాబిలిటేషన్, ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డీఆర్‌ఐపీ) రెండోదశలో ఆంధ్రప్రదేశ్ ఉందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. రూ.667 కోట్లతో పునరుద్ధరించడానికి రాష్ట్రంలోని 31 డ్యాంలు గుర్తించామని వైఎస్సార్‌సీపీ ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

కాకినాడ–విశాఖ గ్యాస్ పైప్‌లైన్ గడువు పొడిగింపు

కాకినాడ–విశాఖపట్నం సెక్షన్ పైపులైన్‌ను 2021 జూన్ నాటికి పూర్తిచేయాల్సి ఉందని, ఈ గడువును 2024 జూన్ వరకు పొడిగించామని కేంద్ర పెట్రోలియం సహజవనరులశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. ఇప్పటివరకు కాకినాడ–విశాఖ సెక్షన్‌లో 75 కిలోమీటర్ల మేర పైపులైను పూర్తయిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు జవాబిచ్చారు.

విజయవాడ విమానాశ్రయ పనులకు రూ.611.80 కోట్లు

విజయవాడ విమానాశ్రయంలో ఎన్ఐటీబీ ఆప్రాన్, ఏటీసీ టవర్, అనుబంధ పనుల కోసం రూ.611.80 కోట్లు అనుమతించినట్లు పౌరవిమానయానశాఖ సహాయమంత్రి వీకే సింగ్ తెలిపారు. ఈ మేరకు ఎంపీ మద్దిళ్ల గురుమూర్తి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో 5 బయోసీఎన్‌జీ ప్లాంట్లు

ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు 4,780 కిలోల బయో సీఎన్‌జీ ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న ఐదుప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి ఆర్కే సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బి.వి.సత్యవతి, తలారి రంగయ్య ప్రశ్నకు జవాబిచ్చారు.

రాజ్యసభ

ఏపీలో మరో 11 పట్టణాల్లో క్లీన్ ఎయిర్

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద గాలి నాణ్యతను పెంచడానికి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నంతోపాటు అదనంగా మరో 11 పట్టణాలను ఎంపిక చేసినట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి అశ్వినీ కుమార్ చౌబే చెప్పారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 15వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు ఈ పట్టణాలు గుర్తించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన 11 పట్టణాల్లో శ్రీకాకుళం, చిత్తూరు, ఒంగోలు, విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, అనంతపురం, కడప, కర్నూలు, గుంటూరు, నెల్లూరు ఉన్నాయని చెప్పారు. జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం కింద ఈ పట్టణాల్లో గాలి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 15వ ఆర్థికసంఘం సిఫార్సు గ్రాంట్ కింద విజయవాడకు 2022–23 సంవత్సరానికి రూ.163 కోట్లు కేటాయించామన్నారు.

నిజాయతీగా పని చేస్తే అసత్యవార్తలు రాస్తారా!

- 'ఈనాడు'పై వలంటీర్ల ఆగ్రహం.. వివిధ ప్రాంతాల్లో నిరసన
- శంఖవరంలో రామోజీరావు దిష్టిబొమ్మ దహనం



పాలసముద్రం గ్రామ సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

కార్వేటినగరం/పాలసముద్రం/శంఖవరం/వాల్మీకిపురం: 'నిజాయతీగా ప్రజలకు సేవ చేస్తున్న మాపై అసత్యవార్తలు రాస్తే అంతుచూస్తాం. మీ రాతలు మారకపోతే, మీ తలరాతను మార్చేందుకు 4లక్షల మంది వలంటీర్లం సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే ఈనాడు అధినేత రామోజీరావు ఇల్లు ముట్టడిస్తాం..' అని గ్రామ, వార్డు వలంటీర్లు హెచ్చరించారు. వలంటీర్లపై 'ఈనాడు'లో వచ్చిన అసత్య కథనాన్ని ఖండిస్తూ గురువారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా, జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, పాలసముద్రం, అన్నమయ్య జిల్లాలోని వాల్మీకిపురం, కాకినాడ జిల్లా శంఖవరంలో వలంటీర్లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. శంఖవరంలో రామోజీరావు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయా ప్రాంతాల్లో వలంటీర్లు మాట్లాడుతూ 'రామోజీరావు గుర్తుంచుకో... మీ చంద్రబాబు పెట్టుకున్న జన్మభూమి కమిటీ సభ్యులం కాదు మేము. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనాన్ని తీసుకుని నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్నాం. మేము జన్మభూమి కమిటీల మాదిరి అక్రమాలకు పాల్పడటం లేదు. వలంటీర్ల వ్యవస్థ అంటే మోసం చేసే చిట్ ఫండ్ సంస్థ కాదు. కరోనా కష్టకాలంలో సైతం ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల కోసం పనిచేసిన గొప్ప వ్యవస్థ అని గుర్తుంచుకోండి. ఈనాడు, టీవీలో ప్రచారం చేసినట్లుగా మేము వేగులం కాదు. ప్రజాసేవకులం. వలంటీర్ వ్యవస్థకు ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోంది. దానిని ఓర్వలేక రాజకీయ కోణంలో దుష్ప్రచారం చేయడం తగదు. వలంటీర్ల వ్యవస్థపై అపోహలు సృష్టించేందుకు ఎన్ని తప్పుడు కథనాలు ప్రచురించినా, ప్రజల నుంచి మమ్మల్ని వేరుచేయలేరు' అని స్పష్టంచేశారు.

శభాష్... వలంటీర్

చీరాల టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన గ్రామ వలంటీర్లు సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారు. బాపట్ల జిల్లా చీరాల మండలంలోని సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీకి చెందిన గ్రామ వలంటీర్ పేర్ల వెంకట ఫణిరాజ శమన్ తమ గ్రామస్తుల కోసం గురువారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామ సచివాలయం సమీపంలో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో 142 మందికి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన వలంటీర్‌ను శభాష్.. అని గ్రామస్తులు అభినందించారు.



ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట అందమైన రంగవల్లులు... కొలువు తీరాల్సిందే! మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

ఫ్యాషన్

వధూవరుల ఫొటోలు పెళ్లి పత్రికల్లోనూ, ఆహ్వాన వేదిక ముందూ చూస్తాం. కొబ్బరి బోండాం, మధ్య తెర ఇలాంటి వాటి మీదా పేర్లను అలంకరించడం చూశాం. ఇప్పుడిక ఆ వంతు చేతి గాజులకూ వచ్చింది.







చేతులకు ఫొటోలు వేద్దాం...

కస్టమైజ్డ్... కస్టమైజ్డ్ బ్యాంగిల్స్ రూ. 2,000/- నుంచి డిజైన్, హంగులను బట్టి ధరలో పెరుగుదల ఉంటుంది. ఆన్‌లైన్ మార్కెట్లో వీటిని ఆర్డర్ మీద తెప్పించుకోవచ్చు.



వధూవరుల ఫొటోలే కాదు... రాధా-కృష్ణ, రాజా- రాణి పెయింటింగ్స్ కూడా ఈ లేటెస్ట్ బ్యాంగిల్ సెట్స్‌లో చూడొచ్చు.



కుందన్స్... గోటా పట్టీ గుజరాతీ, రాజస్థాన్, పంజాబీ కళ ఈ గాజుల్లో కనిపిస్తుంటుంది. గోటాపట్టీ, కుందన్ వర్క్, పూసలు, చమ్కీల మెరుపులతోనూ, సిల్క్ దారాల మెరుగులతోనూ గాజులు కొత్తరూపుగా కనిపిస్తున్నాయి.

బ్రైడల్ కలెక్షన్‌లో బ్యాంగిల్స్‌ది కూడా ముఖ్య పాత్రగా ఉంటుంది. శారీ కలర్ మ్యాచింగ్ బ్యాంగిల్స్ ఎంపిక చేసుకోవడం మనకు తెలిసిందే. చేతుల నిండుగా ధరించే గాజుల అలంకరణా ప్రత్యేకంగా ఉండాలనుకునేవారి ఆశలకు తగినట్టు డిజైనర్లు తమ పనితనానికి కళాత్మకతను జోడిస్తున్నారు. అయితే, వీటిలో ఇప్పుడు కస్టమైజ్డ్ థీమ్ బేస్డ్ బ్యాంగిల్స్ వచ్చాయి. ఈ బ్యాంగిల్ సెట్‌లో వధూవరుల పేర్లు, వారి ఫొటోలు వచ్చే విధంగా సెట్ చేస్తున్నారు డిజైనర్లు. బ్రైడల్ ఫొటో బ్యాంగిల్స్ వేడుకల్లో ఓ కొత్త కళతో మెరిసిపోతున్నాయి.



జాగ్రత్త... ప్రమాదం పొంచే ఉంది

యాసిడ్ అమ్మకాల మీద నిఘా పెట్టాం. మహిళల రక్షణకు చట్టాలు కఠినతరం చేశాం. షీ టీమ్స్ సిద్ధంగా ఉన్నాయి. యాప్స్ డెవలప్ అయ్యాయి. నిజమే. కాని ప్రమాదం పొంచే ఉంది. ఢిల్లీలో తాజా యాసిడ్ దాడి ఘటన ఈ విషయమే నిర్ధరిస్తోంది. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్.సి.ఆర్.బి) నివేదిక ప్రకారం 2021లో దేశవ్యాప్తంగా 176 యాసిడ్ దాడులు నమోదయ్యాయి. మరో 73 అటెంప్ట్స్ జరిగాయి. అంటే ప్రమాదం పొంచే ఉంది. నిర్లక్ష్యం ఏ మాత్రం పనికి రాదు.

వాస్తవాలు ఆందోళన కలిగిస్తున్నప్పుడు ఎవరి జాగ్రత్తలో వారు ఉండటం మంచిది. 2013లో సుప్రీం కోర్టు యాసిడ్ అమ్మకాల మీద జవాబుదారీ ఉండాలని చెప్పింది. రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని చెప్పింది. అంతే కాదు ఐ.డి.ప్రూఫ్ లేకుండా యాసిడ్ అమ్మకూడదు. అలా చేస్తే 50 వేల రూపాయల ఫైన్ ఉంది. అయితే 2016లో ఢిల్లీలో కొంతమంది పోలీసులు మఫ్టీలో యాసిడ్ కొన ప్రయత్నిస్తే 23 షాపులు ఎవరు ఏమిటి అనకుండా అమ్మారు. అప్పుడు గగ్గోలు అయ్యింది. తాజాగా ఢిల్లీలో జరిగిన యాసిడ్ దాడిలో నిందితుడు ఫ్లిప్‌కార్ట్ ద్వారా యాసిడ్‌ను కొన్నాడని పోలీసులు గుర్తించారు. ఇప్పుడు ఆన్‌లైన్ అమ్మకం దారులను యాసిడ్ అమ్మకాలపై జాగ్రత్త వహించవలసిందిగా తాకీదులు పంపుతున్నారు. అంటే చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే.

పరిస్థితి దారుణం

కోవిడ్ కాలంలో తప్ప దేశంలో యాసిడ్ దాడులు జరుగుతూనే ఉన్నాయి. స్త్రీలు బలవుతూనే ఉన్నారు. ప్రేమ వద్దన్నారని, ప్రేమలో ఉన్నాక బ్రేకప్ చెప్పారని, పెళ్లయ్యాక విడిపోయారని రకరకాల కారణాల వల్ల పురుషులు ద్వేషంతో యాసిడ్ దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. 2016 నుంచి 2021 మధ్య 1300 యాసిడ్ దాడులు జరిగాయి. విషాదం ఏమిటంటే ఈ యాసిడ్ దాడుల్లో నేరస్తులకు శిక్ష పడుతున్న శాతం అతి తక్కువగా ఉండటం. 400 కేసులు నమోదు అయితే 10 మందికి మాత్రమే శిక్ష పడుతోందంటే ఎన్ని విధాలుగా తప్పించుకుంటున్నారో, తప్పించుకోవచ్చులే అనే ధైర్యంతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

అప్రమత్తత అవసరం

విద్యార్థినులు, యువతులు, స్త్రీలు తమకు తారసపడుతున్న ప్రేమ, వైవాహిక బంధాలలో పురుషుల ధోరణి పట్ల అప్రమత్తంగా ఉండాలి. బెదిరిస్తున్న వారిని, వద్దనుకున్నా వెంటపడుతున్నవారిని, ఒకవేళ బంధం నుంచి బయటపడాలనుకుంటే ఆ మగవారిని గమనించి వారి ధోరణి ప్రమాదకరంగా అనిపిస్తే ముందే కుటుంబ సభ్యుల, పోలీసుల మద్దతు తీసుకోవాలి. ముఖ్యంగా ఇష్టం లేని ప్రేమ ప్రతిపాదిస్తున్నప్పుడు, ప్రేమలో నుంచి బ్రేకప్ చెబుతున్నప్పుడు, విడాకుల సందర్భాలలో ఒంటరిగా తిరిగేటప్పుడు అప్రమత్తంగా ఉండటం, ఎవరైనా అపరిచితుడు లేదా పాత మిత్రుడు దగ్గరిగా వస్తుంటే జాగ్రత్త పడటం, అసలు వీలైనంత సామరస్యంగా, ఒప్పుదలతో బంధాల నుంచి బయటపడటం... ఇవన్నీ ముఖ్యమైనవే.

దేశంలో యాసిడ్ దాడులను నిర్మూలించామని ఎవరూ హామీ ఇవ్వడం లేదు. కనుక మన రక్షణకు మనమే బాధ్యత వహించాలి. కుటుంబం, పోలీసుల వద్ద సమస్యను దాచకుండా సాయం పొందాలి.

ముగ్గులు



సి. రాజ్యలక్ష్మి
ఏఎస్‌రావ్ నగర్, హైదరాబాద్
సరిచుక్క, 18 చుక్కలు, 8 వరుసలు, 8 వరకు



గడగోజు స్రవంతి
ఈదులూరు, నల్గొండ జిల్లా
సరిచుక్క, 24 చుక్కలు, 8 వరుసలు, 8 వచ్చే వరకు



వంటిల్లు జొన్నవరం

జొన్న దోసె



కావలసినవి: మినపప్పు- కప్పు; జొన్న పిండి -3 కప్పులు ; అటుకులు- పావు కప్పు; మెంతులు- పావు టీ స్పూన్; ఉప్పు - అర టీ స్పూన్; నూనె లేదా నెయ్యి - 4 టీ స్పూన్‌లు.

తయారీ: ● మినపప్పు, మెంతులను కడిగి మంచినీటిలో ఐదారు గంటల సేపు నానబెట్టాలి. ఆ తర్వాత నీటిని వంపేసి మిక్సీలో వేసి, ఉప్పు కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఆ పిండిని ఒక పెద్ద పాత్రలోకి తీసుకుని, అదే జార్‌లో జొన్న పిండి, నీరు వేసి బాగా కలవడం కోసం కొద్దిసేపు గ్రైండ్ చేయాలి. దీనిని మినపప్పు మిశ్రమంలో వేసి బాగా కలిపి గట్టిగా మూత పెట్టి రాత్రంతా ఉంచాలి. ఉదయం పిండిని గరిటెతో కలిపి చూసుకుని తగినంత నీరు, ఉప్పు కలిపి దోసెలు వేసుకోవడమే. ● ఈ దోసెలు వేరుశనగపప్పు చట్నీ లేదా కొబ్బరి- పచ్చి శనగపప్పు చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి. ఇవి బరువు తగ్గాలనుకునే వారికి, డయాబెటిస్ పేషెంట్‌లకు మంచి ఆహారం.

జొన్న సమోసా



కావలసినవి: జొన్న పిండి - కప్పు; నీరు- కప్పు; ఉప్పు - చిటికడు; నూనె - వేయించడానికి తగినంత.

కర్రీ కోసం: బంగాళదుంప- 1 పెద్దది ; ఉల్లిపాయ ముక్కలు - పావు కప్పు; పోపు కోసం -ఆవాలు, జీలకర్ర (ఒక్కొక్కటి పావు స్పూన్); కొత్తిమీర తరుగు - పావు కప్పు; కరివేపాకు- రెండు రెమ్మలు; పసుపు - చిటికెడు; మిర్చి తరుగు - టీ స్పూన్; పచ్చి బఠాణి - పావు కప్పు; ఉప్పు - చిటికడు; నూనె - టేబుల్ స్పూన్.

తయారీ: ● నీటిని వేడి చేసి మరుగుతున్నప్పుడు ఉప్పు కలిపి జొన్నపిండి చేసి విస్కర్ లేదా ఫోర్క్ అదీ లేకపోతే స్పూన్‌తో కలిపి మూత పెట్టి పదిహేను నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ● ఈ లోపు బంగాళదుంప కూర సిద్ధం చేయాలి. బంగాళదుంపను ఉడికించి తొక్క తీసి చిదమాలి. స్టవ్ మీద పెనం పెట్టి నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, బఠాణి, మిర్చి, పసుపు, ఉప్పు, కరివేపాకు, కొత్తిమీర వేసి వేగిన తరవాత చిదిమిన బంగాళదుంప వేసి బాగా కలిపి దించేయాలి. గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఉన్న వాళ్లు బంగాళదుంపకు బదులుగా పనీర్ వేసుకుంటే పనీర్ కర్రీ సిద్ధం. ఇది కూడా సమోసాలోకి బావుంటుంది. ● ఇప్పుడు మరొక బాణలిలో నూనె పోసి వేడి చేయాలి. జొన్నపిండిని పెద్ద నిమ్మకాయంత సైజులో తీసుకుని చపాతీలా వత్తి రెండు సగాలుగా కత్తిరించాలి. ఒక భాగంలో కొద్దిగా బంగాళదుంప కూర పెట్టి మరొక భాగంతో కోన్ ఆకారంలో కప్పి అంచులు అతికించి నూనెలో వేయాలి. ఇలాగే మొత్తం పిండిని చేసుకోవాలి.

ఏపీహెచ్‌ఏఏ ఎన్నికల బైలాస్ తేలుస్తాం

- స్పష్టం చేసిన హైకోర్టు సీజే ధర్మాసనం
- విచారణ 21కి వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్‌సీఏఏ) ఎన్నికలను బార్ కౌన్సిల్ నిర్దేశించిన బై లాస్ ప్రకారం నిర్వహించాలా? లేక సంఘం పాత బైలాస్ ప్రకారం నిర్వహించాలా? అన్న విషయాన్ని తేలుస్తామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వివాదాన్ని తేల్చాల్సిన అవసరం ఉందని, లేని పక్షంలో పలు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను తమ ముందుంచాలని ఇరుపక్షాల న్యాయవాదులను ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సవరణ షెడ్యూల్‌ను ప్రస్తుత కార్యవర్గం తరఫున సీనియర్ న్యాయవాది సి.వి.మోహన్‌రెడ్డి మెమో రూపంలో గురువారం సీజే ధర్మాసనం ముందుంచారు. ఎన్నికల ప్రక్రియ ఈ నెల 19న మొదలై మార్చిలో పూర్తవుతుందని తెలిపారు. సంఘం రిజిస్టర్డ్ బైలాస్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ప్రస్తుత కార్యవర్గానికి వ్యతిరేకంగా వాదనలు వినిపిస్తున్న న్యాయవాది చాపర్ల సీతారాం స్పందిస్తూ.. ఏపీహెచ్‌సీఏఏ రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్దేశించిన మోడల్ బైలాస్‌ను అన్వయించుకుందని, దీని ప్రకారం ప్రస్తుత కార్యవర్గం ఎన్నికలు కూడా జరిగాయని తెలిపారు. అంతేగాక ప్రస్తుత కార్యవర్గ కాలపరిమితిని సైతం బార్ కౌన్సిల్ బైలాస్ ప్రకారమే పొడిగించారని చెప్పారు. ఇద్దరి వాదనలు విన్న ధర్మాసనం.. అసలు ఏ బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలో తేలుస్తామంటూ విచారణను వాయిదా వేసింది.

ఏపీ, తెలంగాణకు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం, పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులకు సంబంధించి పర్యావరణ అనుమతులు, ఉల్లంఘనలపై దాఖలైన పిటిషన్‌లో ఏపీ, తెలంగాణ, కేంద్రం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. పెంటపాటి పుల్లారావు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. మూడు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల్లేవని, ఉల్లంఘనలకు పాల్పడ్డారని పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎన్జీటీ కూడా సంయుక్త కమిటీ నియమించి నివేదిక ఇవ్వాలని కోరినట్లు గుర్తుచేశారు. ఒడిశా దాఖలు చేసిన ఒరిజినల్ సూట్ విచారణలో భాగంగా సుప్రీంకోర్టు జలశక్తి, పర్యావరణ శాఖలను పరిష్కారం చూపాలని ఆదేశించిన విషయాన్ని తెలిపారు. పోలవరం వ్యర్థాల డంపింగ్‌పై పుల్లారావు దాఖలు చేసిన పిటిషన్‌కు ఈ పిటిషన్ జత చేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

'సంగం'ను దివాలా తీయించింది మీరే

- డెయిరీలోకి టీడీపీ నేతల ప్రవేశంతో అక్రమాలు మొదలయ్యాయి
- డెయిరీ భూమి పదెకరాలు వీరయ్య చౌదరి ట్రస్టుకు బదలాయించారు
- డెయిరీని అడ్డగోలుగా కంపెనీ చట్టం కిందకు తేవడం చంద్రబాబు కుట్రే
- సంగం డెయిరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది
- సచివాలయాల పరిధిలో మహిళా కోఆపరేటివ్ డెయిరీలు ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు



సాక్షి, అమరావతి: రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటైన సంగం డెయిరీని దివాలా తీయించింది చంద్రబాబేనని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. డెయిరీలోకి టీడీపీ నేతల ప్రవేశంతోనే అక్రమాలు మొదలయ్యాయని, పథకం ప్రకారం నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. టీడీపీ నాయకుడు చౌదరి, మరో పేమెంట్ కుక్క పట్టాభి సీఎం వైఎస్ జగన్ గురించి ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 1994లో గుంటూరు మిల్క్ యూనియన్ అధ్యక్షుడు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పదెకరాల డెయిరీ భూమిని అక్రమంగా సొంత ట్రస్టుకు బదలాయించుకున్నారని తెలిపారు. చంద్రబాబు 1995లో మ్యాక్స్ చట్టం తెచ్చిన తర్వాత నిబంధనలు పట్టించుకోకుండా అడ్డగోలుగా మ్యాక్స్ చట్టంలోకి మార్చడం, ఆ తర్వాత కంపెనీ చట్టం కిందకు తేవడం వంటివన్నీ చంద్రబాబు కుట్రేనన్నారు. సంగం డెయిరీ కంపెనీ యాక్ట్ ఇల్లీగల్ అంటూ కేసులు కోర్టులో ఉన్నాయని తెలిపారు. ఏసీబీ కూడా కేసులు నమోదు చేసిందని చెప్పారు. కోర్టు స్టేలు ఇచ్చిందే తప్ప, కేసులు రద్దు చేయలేదని, ఏ రోజుకైనా డెయిరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. సచివాలయాల పరిధిలో మహిళా కోఆపరేటివ్ డెయిరీ సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వారికి మౌలిక వసతులు కల్పిస్తామని, పాల సేకరణకు కెపాసిటేటివ్ బిల్డింగ్, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్‌లు కూడా ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు.

హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీని మూసేసిన బాబు

రాష్ట్రంలో అన్ని డెయిరీలను అడ్డగోలుగా ప్రైవేటీకరణ చేసిన చంద్రబాబు చిత్తూరు డెయిరీ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పారు. దాని ప్రాంతంలో సొంత హెరిటేజ్‌ని నెలకొల్పారన్నారు. దేశంలోనే అత్యధికంగా రోజుకు 2.5లక్షల లీటర్ల పాల సేకరణ, అత్యధిక లాభాలు గడించే చిత్తూరు డెయిరీని మూసేసి సొంత హెరిటేజ్ డెయిరీని డెవలప్ చేసుకున్నారని వివరించారు. చిత్తూరు డెయిరీని తిరిగి తెరిపిస్తుంటే చంద్రబాబుకు, రామోజీరావుకు పట్టలేని బాధ కలుగుతోందని అన్నారు. వారి హెరిటేజ్‌కు, తన మనుషులకు కేటాయించిన సంగం, ఇతర డెయిరీల అక్రమ పునాదులు కదిలిపోతాయన్నదే వారి బాధ అని చెప్పారు.

రూ.1633 కోట్లతో వీసీఐసీ రెండో దశ పనులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని మార్చే విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండో దశలో సుమారు రూ.1,632.82 కోట్లతో మూడు పారిశ్రామిక క్లస్టర్లు, వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టడానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మొత్తంలో ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) నిర్మించే రహదారుల భూ సేకరణకు రూ.164.70 కోట్లు కేటాయించింది. కారిడార్ డెవలప్‌మెంట్‌లో భాగంగా రెండో దశలో నక్కపల్లి, రాంబిల్లి, చిత్తూరు సౌత్ జోన్ నోడ్స్‌ను అభివృద్ధి చేస్తారు. నక్కపల్లి వద్ద 1,120 ఎకరాల్లో ప్రధాన మౌలిక వసతులతో స్టార్టప్ ఏరియాను ఏపీఐఐసీ అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం రూ.399.03 కోట్లు కేటాయించారు. రాంబిల్లి వద్ద 396 ఎకరాల్లో రూ.149 కోట్లతో, చిత్తూరు సౌత్ జోన్‌లో 2,770 ఎకరాల్లో రూ.462.96 కోట్లతో స్టార్టప్ ఏరియాలు అభివృద్ధి చేస్తారు. పారిశ్రామిక నోడ్స్‌ను ప్రధాన రహదారులకు అనుసంధానించే నాలుగు రోడ్డు ప్రాజెక్టుల బాధ్యతను ఏపీఆర్‌డీసీకి ప్రభుత్వం అప్పగించింది. రూ.243.02 కోట్లతో అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు, రూ.120.78 కోట్లతో నాయుడుపేట పారిశ్రామిక క్లస్టర్‌ను ప్రధాన రహదారితో అనుసంధానం చేయడం, రౌతుసురమాల పారిశ్రామిక కారిడార్‌ను రూ.67.42 కోట్లతో ప్రధాన రహదారికి అనుసంధానించే ప్రాజెక్టు, నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్‌ను రూ.25.91 కోట్లతో ప్రధాన రహదారికి అనుసంధానించే రోడ్డు అభివృద్ధి చేస్తారు. ఈ రహదారులకు అవసరమైన భూమిని ఏపీఐఐసీ సేకరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేయడానికి వివిధ రంగాల నిపుణులతో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సూపర్‌విజన్ కన్సల్టెంట్స్‌ను నియమించుకోవడానికి అనుమతి మంజూరు చేసింది.

43 వైద్యుల పోస్టులు భర్తీ

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల భర్తీకి నిర్వహిస్తున్న వాక్-ఇన్ ఇంటర్వ్యూల్లో శాశ్వత ప్రాతిపదికన 27, కాంట్రాక్టు పద్ధతిలో 16 చొప్పున 43 పోస్టులను భర్తీ చేశారు. ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో 250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు బుధవారం ఐదు స్పెషాలిటీల్లో 77 పోస్టులను నోటిఫై చేశారు. ఇందులో జనరల్ మెడిసిన్ 25, జనరల్ సర్జరీ 16, డెర్మటాలజీ 2 చొప్పున ఎంపికైన అభ్యర్థులకు గురువారం పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం అనస్తీషియా 34, గైనకాలజీ 32, ఈఎన్‌టీ 11, పాథాలజీ 29 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులు విజయవాడ పాత జీజీహెచ్ ప్రాంగణంలోని డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల

డీఎంఈ పరిధిలో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ప్రాథమిక మెరిట్ జాబితా, తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను గురువారం విడుదల చేశారు.

జనవరి 24 నుంచి తొలివిడత జేఈఈ మెయిన్

షెడ్యూల్ విడుదల చేసిన ఎన్టీఏ

సాక్షి, అమరావతి : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-2023 తొలివిడత పరీక్షలు జనవరి 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి 31వ తేదీ వరకు ఇవి కొనసాగుతాయి. ఈ మేరకు జేఈఈ మెయిన్-2023 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం విడుదల చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచే ప్రారంభించింది. ఈ ప్రక్రియ జనవరి 12తో ముగుస్తుంది. అభ్యర్థులు jeemain. nta. nic. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఏ సూచించింది. తొలివిడత పరీక్షలు జనవరి 24, 25, 27, 28, 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షల సెంటర్ల వివరాలు జనవరి రెండవ వారంలో ప్రకటిస్తారు. అడ్మిట్ కార్డులను జనవరి మూడవ వారంలో విడుదల చేసి డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పిస్తారు. రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 6, 7, 8, 9, 10, 11, 12 తేదీల్లో జరుగుతాయి. ఆన్‌లైన్ మోడ్‌లో 13 భాషల్లో ఈ పరీక్షలు ఉంటాయి. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ తదితర మాధ్యమాల్లో వీటిని నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక విడత లేదా రెండు విడతల పరీక్షలకు హాజరుకావచ్చు. అయితే, అభ్యర్థులు రెండింటిలో సాధించిన స్కోర్‌లో ఎక్కువ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

సీఏఎస్ జనరల్ ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తోన్న పలువురు వైద్యులు పీజీ చదవడం కోసం వెళ్లడం, ఇతర కారణాలతో ఖాళీ అయిన 32 స్థానాల్లో కొత్త వైద్యులను నియమించడం కోసం ఎంపిక జాబితాను గురువారం ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి విడుదల చేశారు. వీరికి శుక్రవారం జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

ఐఐపీఈ శాశ్వత క్యాంపస్‌కు లైన్ క్లియర్

- రూ.2.98 కోట్ల విత్ డ్రాకు 29 మందికి హైకోర్టు అనుమతి

సాక్షి, అమరావతి: విశాఖ జిల్లా సబ్బవరం మండలం వంగలిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో జమచేసిన రూ.6 కోట్ల నుంచి 29 మంది పిటిషనర్లు రూ.2.98 కోట్లను విత్ డ్రా చేసుకునేందుకు హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ సొమ్ము తీసుకున్న తరువాత ఐఐపీఈ నిర్మాణాలకు ఆటంకాలు సృష్టించడానికి వీల్లేదని ఆ 29 మందిని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తాళ్లప్రగఢ మల్లికార్జునరావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 20 ఎకరాల భూ వివాదం కారణంగా ఐఐపీఈ క్యాంపస్ నిర్మాణ పనులు నిలిచిపోయిన నేపథ్యంలో హైకోర్టు ఇటీవల మధ్యేమార్గంగా ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారంలో హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లను హైకోర్టులో జమచేసింది. అయినా కొందరు భూయజమానులు నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తుండటంతో ఐఐపీఈ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై రెండు రోజుల కిందట జస్టిస్ దుర్గాప్రసాద్ ధర్మాసనం విచారించింది. హైకోర్టులో జమచేసిన రూ.6 కోట్ల నుంచి రూ.2.98 కోట్లను ఆ 29 మంది భూయజమానులు విత్‌డ్రా చేసుకునేందుకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. ఈ అప్పీల్ గురువారం విచారణకు వచ్చింది. రూ.2.98 కోట్ల పరిహారాన్ని విత్‌డ్రా చేసుకున్న తరువాత ఐఐపీఈ నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగించబోమని ఆ 29 మంది హైకోర్టుకు హామీ ఇచ్చారు.

హైకోర్టుకు హాజరైన డీఎఫ్‌వో, రేంజ్ అధికారి

సాక్షి, అమరావతి: హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా రొయ్యల చెరువులను ధ్వంసం చేసిన వ్యవహారంలో నెల్లూరు జిల్లా అప్పటి అటవీ అధికారి(డీఎఫ్‌వో) మంగమ్మ, రేంజ్ అధికారి మారుతీ ప్రసాద్ గురువారం వ్యక్తిగతంగా హైకోర్టు ముందు హాజరయ్యారు. తాము ఆదేశాలిచ్చినా రొయ్యల చెరువులను ధ్వంసం చేసినందుకు వారిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్లే కోర్టు ఉత్తర్వుల కాపీలను మీకు తెచ్చివ్వాలే తప్ప, కోర్టు ఉత్తర్వుల గురించి తెలుసుకునే బాధ్యత మీకు లేదా? అంటూ నిలదీసింది. ఈ సమయంలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. చెరువులు ధ్వంసం చేసే సమయానికి కోర్టు ఉత్తర్వుల గురించి డీఎఫ్‌వో, రేంజ్ ఆఫీసర్‌కు తెలియదన్నారు. కోర్టు ఆదేశాల గురించి తెలిసి ఉంటే వాటిని గౌరవించి ఉండేవారిని చెప్పారు. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించలేదని, పూర్తి వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. తదుపరి వ్యక్తిగత హాజరు నుంచి ఇద్దరు అధికారులకు మినహాయింపునివ్వాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు అంగీకరిస్తూ విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు. వ్యక్తిగత హాజరు నుంచి ఇద్దరు అధికారులకు మినహాయింపునిచ్చారు.

విద్యారంగంలో రాష్ట్రాన్ని ప్రథమస్థానంలో నిలపాలి

పాఠ్యాంశ సంస్కరణలపై సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: సంస్కరణల ద్వారా విద్యారంగంలో ఏపీని ప్రథమస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. 'ఎస్సీఈఆర్టీ, ఎన్సీఈఆర్టీ సంయుక్తంగా పాఠ్యపుస్తకాల ప్రచురణ ప్రతిపాదన' అంశంపై చర్చించేందుకు గురువారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ ట్యాబ్‌లు పంపిణీ చేస్తారని తెలిపారు. విద్యార్థులను ప్రపంచపౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ దిశగా ప్రభుత్వం వివిధ పథకాలు, విద్యా సంస్కరణలు అమలు చేస్తోందని చెప్పారు. పాఠశాలవిద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ మాట్లాడుతూ ఎస్సీఈఆర్టీ 1 నుంచి 10 తరగతుల వరకు 376 శీర్షికలతో పాఠ్యపుస్తకాలను 2020లో ప్రచురించిందని చెప్పారు. జేఎన్టీయూ మాజీ వైస్ ఛాన్సలర్, ఏపీపీఎస్సీ విశ్రాంత చైర్మన్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2020-21 నుంచి దశలవారీగా పాఠశాలలను సీబీఎస్ఈతో అనుసంధానం చేయడం వల్ల 8, 9 తరగతుల పాఠాలను ముందు తరగతి పాఠ్యాంశాలకు అనుసరిస్తూ విద్యార్థులకు సులభంగా అవగాహన చేసుకునే విధానం గురించి చర్చించారు.



నాడు తండ్రి... నేడు తనయుడు...

తన తండ్రి మైకేల్ షుమాకర్ ఏ జట్టుకైతే ప్రాతినిధ్యం వహించాడో అదే జట్టు తరఫున వచ్చే ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో మిక్ షుమాకర్ బరిలోకి దిగనున్నాడు. 2023 సీజన్ కోసం మిక్ మెర్సిడెస్ జట్టు తరఫున రిజర్వ్ డ్రైవర్‌గా నియమితుడయ్యాడు. రెగ్యులర్ డ్రైవర్లు హామిల్టన్, జార్జి రసెల్‌లలో ఒకరు అందుబాటులో లేకపోతే మిక్‌కు అవకాశం వస్తుంది. ఈ ఏడాది హాస్ జట్టు తరఫున మిక్ పోటీపడ్డాడు. మైకేల్ షుమాకర్ 2010-2012 వరకు మెర్సిడెస్ తరఫున బరిలోకి దిగాడు.



క్వార్టర్ ఫైనల్లో రష్మిక

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి... డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. షోలాపూర్‌లో జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో రష్మిక 6-3తో తొలి సెట్‌ను గెల్చుకొని, రెండో సెట్‌లో 3-0తో ఆధిక్యంలో ఉన్న దశలో ఆమె ప్రత్యర్థి సౌజన్య గాయంతో వైదొలిగింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి ద్వయం 6-1, 4-6, 10-6తో లెక్సీ (నెదర్లాండ్స్)-వలేరియా (ఉక్రెయిన్) జోడీపై గెలిచింది.


థియో హెర్నాండెజ్

ఫైనల్‌కు ‘ఫ్రెంచ్ కిక్’

ప్రపంచకప్ టైటిల్ పోరుకు ఫ్రాన్స్ | రెండో సెమీఫైనల్లో 2-0తో మొరాకోపై విజయం | ఆదివారం అర్జెంటీనాతో అమీతుమీ | తుదికంటా పోరాడి ఓడిన ఆఫ్రికా జట్టు

ఎట్టకేలకు మొరాకో తన ప్రత్యర్థికి గోల్స్ సమర్పించుకుంది. మేటి జట్లకే కంటిమీద కునుకు లేకుండా చేసిన ఈ ఆఫ్రికా జట్టు చివరకు సెమీఫైనల్లో ఓడింది. సంచలనానికి ఛాన్స్ ఇవ్వని ఫ్రాన్స్ నిర్ణీత సమయంలోనే విజయం సాధించింది. ‘డిఫెండింగ్ చాంపియన్’ వరుసగా రెండో ప్రపంచకప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నిజానికి మొరాకో ఆషామాషీగా తలొగ్గలేదు. గోల్ కోసం ఆఖరి ఇంజ్యూరీ టైమ్ దాకా శ్రమించింది. మైదానం మొత్తం మీద ఫ్రాన్స్ స్ట్రయికర్లకు దీటుగా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై గురి పెట్టినప్పటికీ అదృష్టం కలిసి రాలేదు. మరోవైపు ఫ్రాన్స్... ఈ టోర్నీలోనే కొరకరాని కొయ్యను ఐదో నిమిషంలోనే దారికి తెచ్చుకుంది. ద్వితీయార్ధంలో ఎదురులేని విజయానికి స్కోరును రెట్టింపు చేసుకుంది. ఏమాత్రం అంచనాలు లేకుండా ఖతర్‌కు వచ్చి తమ అద్భుత పోరాటపటిమతో తమకంటే ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టించిన మొరాకో ఇక మూడో స్థానం కోసం శనివారం గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియాతో తలపడుతుంది.

దోహా: అర్జెంటీనా ఫైనల్ ప్రత్యర్థి ఎవరో తేలింది. ఇక ఆఖరి సమరమే మిగిలుంది. విజేత ఎవరో... రన్నరప్‌గా మిగిలేదెవరో ఆదివారం రాత్రి తెలుస్తుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ 2-0 గోల్స్ తేడాతో ఈ టోర్నీలో మింగుడు పడని ప్రత్యర్థి మొరాకోను ఓడించి ఫైనల్ చేరింది. మ్యాచ్ 5వ నిమిషంలో థియో హెర్నాండెజ్... 79వ నిమిషంలో ‘సబ్‌స్టిట్యూట్’ రాన్‌డల్ కొలొముని ఫ్రాన్స్ జట్టుకు చెరో గోల్ అందించారు. 78వ నిమిషంలోనే మైదానంలోకి వచ్చిన సబ్‌స్టిట్యూట్ రాన్‌డల్ 44 సెకన్లలోనే గోల్ చేయడం విశేషం. ఈ మెగా టోర్నీలోనే నిర్ణీత సమయంలో క్వార్టర్స్ దాకా ప్రత్యర్థులెవరికీ గోల్ ఇవ్వని మొరాకో సెమీస్‌లో రెండు గోల్స్ ఇవ్వడమే కాకుండా ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. మొరాకో గత మ్యాచ్‌లకి, తాజా సెమీఫైనల్స్‌కు ఇదొక్కటే తేడా! దీని వల్లే సంచలనం, టైటిల్ సమరం రెండు సాకారం కాలేకపోయాయి.

ఆట మొదలైన కాసేపటికే ఫ్రాన్స్ పంజా విసరడం మొదలు పెట్టింది. గ్రీజ్‌మన్ ‘డి’ ఏరియాలో బంతిని ప్రత్యర్థి గోల్‌పోస్ట్ సమీపానికి తీసుకెళ్లాడు. కానీ క్రాస్ షాట్ కష్టం కావడంతో కిలియాన్ ఎంబాపెకు క్రాస్ చేశాడు. కానీ అతని షాట్ విఫలమైంది. అక్కడే గుమిగూడిన మొరాకో డిఫెండర్లు అడ్డుకున్నారు. అయితే బంతి మాత్రం అక్కడక్కడే దిశ మార్చుకుంది. గోల్‌పోస్ట్‌కు కుడివైపు వెళ్లగా అక్కడే ఉన్న థియో హెర్నాండెజ్ గాల్లోకి ఎగిరి ఎడమ కాలితో కిక్ సంధించాడు. దీన్ని ఆపేందుకు గోల్ కీపర్ యాసిన్ బోనో అతని ముందుకెళ్లగా... మొరాకో కెప్టెన్ రొమెయిన్ సైస్, అష్రాఫ్ దారి గోల్‌పోస్ట్‌ను కాచుకున్నారు. అయినా సరే హెర్నాండెజ్ తన ఛాతీ ఎత్తున ఉన్న బంతిని ఎడమ కాలితో తన్ని లక్ష్యానికి చేర్చాడు. ఆఖరి క్షణంలో గోల్‌పోస్ట్‌లోనే ఉన్న అష్రాఫ్ దారి దాన్ని ఆపేందుకు విఫల యత్నం చేశాడు. కానీ అతని కుడి మోకాలికి వెంట్రుకవాసి దూరంలోనే బంతి గోల్ అయ్యింది.


ఫ్రాన్స్‌కు రెండో గోల్ అందించిన రాన్‌డల్

ఫ్రాన్స్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మరో 5 నిమిషాల వ్యవధిలోనే... మొరాకోకు ఆట పదో నిమిషంలో సమం చేసే అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. ‘డి’ ఏరియా వెలుపలి నుంచి అజెడైన్ వావున్‌హి ఫ్రాన్స్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా లాంగ్‌షాట్ కొట్టాడు. ఫ్రాన్స్ గోల్‌కీపర్ లోరిస్ ఎడమ చేతితో అడ్డుకున్నప్పటికీ బంతి రీబౌండ్ అయింది. కానీ సమీపంలో తిరిగి షాట్ కొట్టే మొరాకో స్ట్రయికర్లు ఎవరూ లేకపోవడంతో గోల్ అవకాశం త్రుటిలో చేజారింది. 17వ నిమిషంలో ఫ్రాన్స్ స్కోరు రెట్టింపయ్యే ఛాన్స్ కూడా మిస్సయ్యింది. ఒలివియర్ జిరూడ్ మెరుపు వేగంతో మొరాకో ‘డి’ ఏరియాలోకి దూసుకొచ్చి బలంగా కొట్టిన షాట్ ప్రత్యర్థి గోల్‌కీపర్ కూడా ఆపలేకపోయాడు. కానీ బంతి గోల్‌పోస్ట్ కుడివైపున బార్ అంచును తాకి బయటికి వెళ్లిపోయింది. మళ్లీ 36వ నిమిషంలోనూ ఫ్రాన్స్ ఆటగాడు జిరూడ్ గట్టిగానే ప్రయత్నించాడు. వాయువేగంతో కొట్టిన షాట్‌ను మొరాకో డిఫెండర్ జవాద్ ఎల్ యామిక్ కళ్లు చెదిరే కిక్‌తో అడ్డుకున్నాడు. లేదంటే బంతి బుల్లెట్ వేగంతో గోల్‌పోస్ట్‌లోకి వెళ్లేది! 44వ నిమిషంలో కార్నర్‌ను గోల్‌పోస్ట్ కుడివైపున ఉన్న జవాద్ ఎల్ యామిక్ చక్కగా తనను తాను నియంత్రించుకొని బైసైకిల్ కిక్ కొట్టాడు. దాదాపు గోల్ అయ్యే ఈ షాట్‌ను ఫ్రాన్స్ గోల్‌కీపర్ లోరిస్ కుడి వైపునకు డైవ్ చేసి చేతితో బయటికి పంపించాడు.

ద్వితీయార్ధంలోనూ మొరాకో గోల్స్ కోసం అదే పనిగా చేసిన ప్రయత్నాల్ని ఫ్రాన్స్ ఆటగాళ్లు ఎక్కడికక్కడ కట్టడి చేసి అడ్డుకున్నారు. 78వ నిమిషంలో రాన్‌డల్ మైదానంలోకి వచ్చాడు. అప్పుడే సహచరులు మార్కస్ తురమ్, ఎంబాపెలు మొరాకో ‘డి’ ఏరియాలో పరస్పరం పాస్ చేసుకొని గోల్‌పై గురి పెట్టారు. కానీ డిఫెండర్లు చుట్టుముట్టడంతో గోల్‌పోస్ట్‌కు మరింత సమీపంలో ఉన్న రాన్‌డల్‌కు ఎంబాపె క్రాస్‌పాస్ చేశాడు. 79 నిమిషంలో రాన్‌డల్ ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా సులువుగా గోల్‌పోస్ట్‌లోకి పంపడంతో ఫ్రాన్స్ ఆధిక్యం రెట్టింపైంది. మొరాకో విజయంపై ఆశలు వదులుకుంది.


ఓటమి అనంతరం అష్రాఫ్ హకీమిని ఓదారుస్తున్న సహచరుడు రొమైన్ సైస్ (ఎడమ)

4 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో ఫ్రాన్స్ నాలుగోసారి (1998, 2006, 2018, 2022) ఫైనల్ చేరింది. రెండుసార్లు (1998, 2018) విజేతగా నిలిచింది.

5 వరుసగా రెండు అంతకంటే ఎక్కువసార్లు ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్ చేరిన ఐదో జట్టుగా ఫ్రాన్స్ నిలిచింది. గతంలో ఇటలీ (1934, 1938), బ్రెజిల్ (1958, 1962), నెదర్లాండ్స్ (1974, 1978), పశ్చిమ జర్మనీ (1982, 1986), బ్రెజిల్ (1994, 1998, 2002) ఈ ఘనత సాధించాయి.

4 తమ జట్టును వరుసగా రెండు ప్రపంచకప్‌లలో ఫైనల్‌కు చేర్చిన నాలుగో కోచ్‌గా ఫ్రాన్స్‌కు చెందిన దిదీర్ డెషాంప్ గుర్తింపు పొందాడు. గతంలో విటోరియో పోజో (ఇటలీ; 1934, 1938), కార్లోస్ బిలార్డో (అర్జెంటీనా; 1986, 1990), బెకన్‌బాయెర్ (జర్మనీ; 1986, 1990) ఈ ఘనత సాధించారు. 1998లో తొలిసారి ప్రపంచకప్ గెలిచిన ఫ్రాన్స్ జట్టులో డెషాంప్ ప్లేయర్‌గా ఉన్నాడు. అనంతరం 2018లో విశ్వవిజేతగా నిలిచిన ఫ్రాన్స్ జట్టుకు ఆయనే కోచ్‌గా ఉన్నారు.


మొరాకో అభిమాని ఆవేదన

3 ప్రపంచకప్ చరిత్రలో సబ్‌స్టిట్యూట్‌గా ఫాస్టెస్ట్ గోల్ చేసిన మూడో ప్లేయర్‌గా రాన్‌డల్ (ఫ్రాన్స్) గుర్తింపు పొందాడు. మొరాకోతో మ్యాచ్‌లో అతను సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన 44 సెకన్లకే గోల్ చేశాడు. ఈ జాబితాలో రిచర్డ్ మొరాలెస్ (ఉరుగ్వే; 2002లో సెనెగల్‌పై 16 సెకన్లలో), ఎబ్బీ సాండ్ (డెన్మార్క్; 1998లో నైజీరియాపై 26 సెకన్లలో) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

మ్యాచ్ గణాంకాలు

ఫ్రాన్స్		మొరాకో
3	గోల్ పోస్ట్‌పై షాట్‌లు	3
38%	బంతి ఆధీనం	62%
363	పాస్‌లు	575
10	ఫౌల్స్	11
0	ఎల్లో కార్డులు	1
2	కార్నర్‌లు	3

తుది పోరుకు జైపూర్, పుణేరి

ముంబై: సుదీర్ఘంగా సాగుతోన్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఫైనల్ మజిలీకి చేరింది. జైపూర్ పింక్ పాంథర్స్, పుణేరి పల్టన్ జట్లు టైటిల్ పోరుకు అర్హత సంపాదించాయి. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో పింక్‌పాంథర్స్ 49-29తో బెంగళూరు బుల్స్‌పై అలవోక విజయం సాధించింది. జైపూర్ తరఫున అజిత్ (13 పాయింట్లు), సాహుల్ కుమార్ (10) రాణించారు. బెంగళూరు జట్టులో భరత్ 7, వికాస కండోల 5, నీరజ్ నర్వాల్, సౌరభ్ చెరో 4 పాయింట్లు చేశారు. అనంతరం జరిగిన రెండో సెమీఫైనల్లో పుణేరి పల్టన్ 39-37తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. రెయిడర్ పంకజ్ మోహితే (16) అదరగొట్టాడు. 21 సార్లు కూతకెళ్లిన పంకజ్ 11 సార్లు పాయింట్లు తెచ్చిపెట్టాడు. శనివారం జైపూర్‌తో పుణేరి పల్టన్ అమీతుమీ తేల్చుకుంటుంది.

అజయ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన



బెంగళూరు: అంధుల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికాతో గురువారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 207 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అజయ్ కుమార్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచి టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు. గుంటూరు జిల్లాకు చెందిన అజయ్ 81 పరుగులు సాధించడంతోపాటు 13 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మరో ప్లేయర్ సునీల్ రమేశ్ (110) సెంచరీ చేశాడు. ముందుగా భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 337 పరుగులు సాధించగా... దక్షిణాఫ్రికా 19.5 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది. శనివారం జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ ఆడుతుంది.

అశ్విన్, సిరాజ్ అదరగొట్టగా...

- రెండో రోజే టెస్టుపై భారత్‌కు పట్టు
- బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 133/8
- మరో 271 పరుగులు వెనుకబడిన ఆతిథ్య జట్టు
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 404 ఆలౌట్


అశ్విన్


సిరాజ్‌కు సహచరుల అభినందన

తొలి టెస్టుపై భారత్‌కు పట్టు చిక్కింది. రెండో రోజు ఆట ముగిసేసరికే మ్యాచ్‌ను శాసించే స్థితికి టీమిండియా చేరింది. ఫాలోఆన్ తప్పించుకోవాలంటే మరో 72 పరుగులు చేయాల్సిన బంగ్లాదేశ్ చివరి 2 వికెట్లతో పోరాడుతోంది. గురువారం ఆటలో అశ్విన్ తన బ్యాటింగ్ పదును, సిరాజ్ బౌలింగ్ సత్తా చూపించగా... దాదాపు 22 నెలల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడిన కుల్దీప్ యాదవ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం హైలైట్‌గా నిలిచాయి. అశ్విన్ కెరీర్‌లో 13వ అర్ధ సెంచరీ... కుల్దీప్ అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించగా... సిరాజ్ తొలి బంతికే వికెట్ తీసి బంగ్లా పతనానికి శ్రీకారం చుట్టాడు. అనూహ్యమేదైనా జరిగితే తప్ప ఈ మ్యాచ్ భారత్ ఖాతాలోకి చేరడం దాదాపు ఖాయం.

చట్‌గ్రామ్: సొంతగడ్డపై భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ కుప్పకూలింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. ముష్ఫికర్ (28)దే అత్యధిక స్కోరు కాగా... మెహదీ హసన్ (16 బ్యాటింగ్), ఇబాదత్ (13 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. కుల్దీప్ యాదవ్ (4/33), మొహమ్మద్ సిరాజ్ (3/14) పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 278/6తో ఆట కొనసాగించిన భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 404 పరుగులకు ఆలౌటైంది. రవిచంద్రన్ అశ్విన్ (113 బంతుల్లో 58; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ చేయగా, కుల్దీప్ యాదవ్ (114 బంతుల్లో 40; 5 ఫోర్లు) రాణించాడు. ఎనిమిదో వికెట్‌కు 87 పరుగులు జోడించిన వీరిద్దరు జట్టు భారీ స్కోరులో కీలకపాత్ర పోషించారు. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్, తైజుల్ ఇస్లామ్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం బంగ్లా జట్టు మరో 271 పరుగులు వెనుకబడి ఉంది.

పెనాల్టీ పరుగులు...

భారత్ ఇన్నింగ్స్‌లో 112వ ఓవర్‌ను తైజుల్ వేశాడు. థర్డ్‌మాన్ దిశగా ఆడిన అశ్విన్ 2 పరుగులు తీశాడు. పరుగెత్తి బంతిని అందుకున్న ఫీల్డర్ యాసిర్ విసిరిన త్రో కీపర్ వెనక ఉంచిన హెల్మెట్‌ను తాకింది. దాంతో నిబంధనల ప్రకారం అంపైర్ ఐదు పెనాల్టీ పరుగులను భారత్ ఖాతాలో వేశారు.

కీలక భాగస్వామ్యం...

కెరీర్‌లో రెండో సెంచరీ సాధించేందుకు గురువారం బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్ (192 బంతుల్లో 86; 10 ఫోర్లు) సఫలం కాలేకపోయాడు. ఓవర్‌నైట్ స్కోరుకు అతను 4 పరుగులే జోడించాడు. వ్యక్తిగత స్కోరు 85 వద్ద అతను ఇచ్చిన క్యాచ్‌ను దాస్ వదిలేసినా... శ్రేయస్ ప్రయోజనం పొందలేదు. రెండో రోజు ఎనిమిది ఓవర్ల తర్వాత భారత్ స్కోరు 293/7 కాగా... మిగిలిన వికెట్లు చకచకా పడగొట్టాలని భావించిన బంగ్లాకు చుక్కెదురైంది. అశ్విన్, కుల్దీప్ భాగస్వామ్యంతో భారత్ పటిష్ఠ స్థితికి చేరింది. మెహదీ హసన్, తైజుల్ ఓవర్లలో అశ్విన్ ఒక్కో సిక్సర్ కొట్టగా, కుల్దీప్ కొత్తగా తన బ్యాటింగ్‌ను ప్రదర్శిస్తూ స్వీప్ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఈ జోడీని విడదీసేందుకు బంగ్లా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. పక్కటెముకల గాయంతో షకీబ్ ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయకపోవడం బంగ్లా కష్టాలను మరింత పెంచింది. లంచ్ తర్వాత 91 బంతుల్లో అశ్విన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఎట్టకేలకు మెహదీ బౌలింగ్‌లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అశ్విన్ స్టంపౌట్ కాగా... ఉమేశ్ యాదవ్ (15 నాటౌట్) రెండు భారీ సిక్సర్లు బాదడంతో స్కోరు 400 పరుగులు దాటింది. రెండో రోజు 43.5 ఓవర్లు ఆడిన భారత్ చివరి 4 వికెట్లకు 126 పరుగులు జోడించగలిగింది.

సిరాజ్ x లిటన్ దాస్



14వ ఓవర్లో సిరాజ్ వేసిన బంతిని లిటన్ దాస్ డిఫెన్స్ ఆడాడు. అయితే బ్యాటర్‌ను ఉద్దేశించి సిరాజ్ ఏదో వ్యాఖ్య చేశాడు. దాంతో క్రీజ్ వదిలి వచ్చిన దాస్... తనకు వినిపించడం లేదని, గట్టిగా చెప్పమంటూ చెవిని చూపిస్తూ సైగ చేశాడు. తర్వాతి బంతికే దాస్‌ను సిరాజ్ బౌల్డ్ చేయగా... సిరాజ్ అదే తరహాలో జవాబివ్వడంతో పాటు పెదవులపై వేలు ఉంచి నోర్మూసుకో మన్నట్లుగా సైగ చేశాడు. మరోవైపు నుంచి కోహ్లి కూడా దాస్‌లాగే ఇప్పుడు వినిపిస్తోందా అన్నట్లుగా చెవిని చూపిస్తూ బ్యాటర్‌ను సాగనంపాడు!

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 404 ఆలౌట్; బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: నజ్ముల్ (సి) పంత్ (బి) సిరాజ్ 0; జాకీర్ (సి) పంత్ (బి) సిరాజ్ 20; యాసిర్ (బి) ఉమేశ్ 4; దాస్ (బి) సిరాజ్ 24; ముష్ఫికర్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 28; షకీబ్ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 3; నూరుల్ (సి) గిల్ (బి) కుల్దీప్ 16; మెహదీ (బ్యాటింగ్) 16; తైజుల్ (బి) కుల్దీప్ 0; ఇబాదత్ (బ్యాటింగ్) 13; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (44 ఓవర్లలో 8 వికెట్లకు) 133.** వికెట్ల పతనం: 1-0, 2-5, 3-39, 4-56, 5-75, 6-97, 7-102, 8-102. **బౌలింగ్:** సిరాజ్ 9-1-14-3, ఉమేశ్ యాదవ్ 8-1-33-1, అశ్విన్ 10-1-34-0, కుల్దీప్ యాదవ్ 10-3-33-4, అక్షర్ పటేల్ 7-3-10-0.

టపటపా...

భారత్ బలమైన బౌలింగ్ ముందు తాము నిలవలేమని బంగ్లాదేశ్ బ్యాటర్లు మరోసారి నిరూపించారు. ఇన్నింగ్స్ తొలి బంతికే నజ్ముల్ (0)ను సిరాజ్ వెనక్కి పంపగా, యాసిర్ అలీ (4) స్టంప్స్‌ను ఉమేశ్ ఎగరగొట్టాడు. లిటన్ దాస్ (30 బంతుల్లో 24; 5 ఫోర్లు), తొలి టెస్టు ఆడుతున్న జాకీర్ హసన్ (20) కొద్దిసేపు నిలబడి ఆదుకునే ప్రయత్నం చేసినా అదీ సాగలేదు. అశ్విన్ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టి జోరు పెంచిన దాస్‌ను చక్కటి బంతితో క్లీన్‌బౌల్డ్ చేసిన సిరాజ్... జాకీర్‌ను కూడా వెనక్కి పంపించాడు. ఆ తర్వాత బంగ్లాను కుల్దీప్ దెబ్బ కొట్టాడు. ముందుగా ముష్ఫికర్‌ను అవుట్ చేసిన అతను... ఆ తర్వాత 12 బంతుల వ్యవధిలో 3 వికెట్లు తీయడంతో బంగ్లా పరిస్థితి మరింత దిగజారింది. చివరి సెషన్‌లోనే బంగ్లా 6 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత 9 ఓవర్లు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి 31 పరుగులు జోడించిన మెహదీ, ఇబాదత్ 102/8గా ఉన్న స్కోరును 133/8కు చేర్చారు.

టెస్టు కెప్టెన్సీకి విలియమ్సన్ గుడ్‌బై

ఆరేళ్లపాటు బాధ్యతల నిర్వహణ • కివీస్ కొత్త సారథిగా సౌతీ

ఆక్లాండ్: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు టెస్టు ఫార్మాట్‌లో సారథ్య బాధ్యతల నుంచి కేన్ విలియమ్సన్ తప్పుకున్నాడు. అయితే వచ్చే రెండేళ్లలో రెండు ప్రపంచకప్‌లు ఉన్న నేపథ్యంలో వన్డే, టి20 కెప్టెన్‌గా మాత్రం అతను కొనసాగుతాడు. పని ఒత్తిడి కారణంగానే టెస్టు కెప్టెన్సీని వదులుకున్నట్లు విలియమ్సన్ చెప్పాడు. ‘న్యూజిలాండ్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. అయితే కెప్టెన్సీ అనేది మైదానంలోనూ, మైదానం బయట కూడా అదనపు శ్రమతో కూడిన బాధ్యత. నా కెరీర్ ప్రస్తుత దశలో దానికి దూరం జరగాలని భావిస్తున్నా. అందుకు ఇదే సరైన సమయం’ అని విలియమ్సన్ వెల్లడించాడు. 2016లో బ్రెండన్ మెకల్లమ్ రిటైర్మెంట్ తర్వాత నాయకుడిగా ఎంపికైన కేన్... 40 టెస్టుల్లో న్యూజిలాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇందులో జట్టు 22 మ్యాచ్‌లు గెలిచి, 10 ఓడింది. మరో 8 ‘డ్రా’గా ముగిశాయి. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరడంతో పాటు తొలి టెస్టు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో న్యూజిలాండ్‌ను విజేతగా నిలపడం విలియమ్సన్ కెప్టెన్సీలో అత్యుత్తమ క్షణం. ఈ నెల 26 నుంచి పాకిస్తాన్‌తో కరాచీలో జరిగే తొలి టెస్టు నుంచి సౌతీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపడతాడు. కెరీర్‌లో 88 టెస్టులు ఆడి 347 వికెట్లు పడగొట్టిన సౌతీ... 1,855 పరుగులు కూడా చేశాడు. అతను ఇప్పటికే 22 టి20లు, ఒక వన్డే మ్యాచ్‌లో కివీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు.


సౌతీ

ఆంధ్ర పరాజయం

తొమ్మిది వికెట్లతో ముంబై ఘనవిజయం


తనుష్

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ సీజన్‌ను 41 సార్లు చాంపియన్ ముంబై జట్టు ఘనవిజయంతో శుభారంభం చేసింది. ఆంధ్ర జట్టుతో ఇక్కడ జరిగిన ఎలైట్ గ్రూప్ ‘బి’ తొలి లీగ్ మ్యాచ్‌లో అజింక్య రహానే సారథ్యంలోని ముంబై జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచి ఆరు పాయింట్లు సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 290/6తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ఆట కొనసాగించిన ముంబై మరో 41 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయి 331 పరుగులవద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ అర్మాన్ జాఫర్ (116; 16 ఫోర్లు, 1 సిక్స్) అదే స్కోరు వద్ద అవుటవ్వగా... తనుష్ కొటియన్ (63; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. ఆంధ్ర బౌలర్లలో షోయబ్ నాలుగు వికెట్లు తీయగా... శశికాంత్, లలిత్ మోహన్‌లకు మూడు వికెట్ల చొప్పున లభించాయి. 93 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 47 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. ఉప్పర గిరినాథ్ (27; 6 ఫోర్లు), రికీ భుయ్ (16; 2 ఫోర్లు), కెప్టెన్ విహారి (14), నితీశ్ రెడ్డి (15; 3 ఫోర్లు) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. ముంబై బౌలర్లలో తుషార్ (3/34), తనుష్ (2/18), సిద్ధార్థ్ (2/26) రాణించారు. 39 పరుగుల విజయలక్ష్యాన్ని ముంబై 6.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది.



ఫైనల్లో తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ రోలర్ హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలికల జట్టు ఫైనల్ చేరింది. బెంగళూరులో గురువారం జరిగిన సెమీఫైనల్లో తెలంగాణ 1-0 గోల్ తేడాతో చండీగఢ్‌ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత పొందింది. తెలంగాణ జట్టులో నిదా ఖాన్, అఫీరా ఫాతిమా, మనాల్ సుల్తానా, హరిణి, శరణ్య, జెబా ఖాన్, హజ్రా ఫాతిమా, సాఫియా సయ్యదా, జుహా సయ్యదా, అల్మా ఇర్ఫాన్ సభ్యులుగా ఉన్నారు. అంతకుముందు లీగ్ దశలో తెలంగాణ 7-0తో కేరళపై, 1-0తో కర్ణాటకపై గెలిచి సెమీఫైనల్ చేరింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
16-12-2022

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
879	245
61,799	18,415

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్‌	10,853	▽	317
డోజోన్స్‌	33,184	▽	782
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,426	▽	70
డాక్స్‌	13,986	▽	474
షాంఘై	3,169	▽	8
నికాయ్‌	28,052	▽	105

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
53,894	▽	492
బంగారం (99.5 స్వచ్ఛత)		
53,679	▽	490
వెండి (కిలో)		
66,568	▽	1074

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎకటం	81.87	83.54
€	యూరో	ఎకటం	86.61	89.70
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎకటం	100.80	104.20
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎకటం	60.07	62.01
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎకటం	55.46	57.87
S$	సింగపూర్‌ డాలర్‌	ఎకటం	60.35	62.31
SAR	సౌదీ రియాల్‌	భారమవటం	21.07	22.75
UAE D	యూఏఈ దిర్హామ్‌	భారమవటం	21.64	23.43
¥	చైనా యువాన్‌	భారమవటం	10.75	12.78

రేట్లు పెంచనున్న హ్యుందాయ్‌

జనవరి నుంచి పెంపు

న్యూఢిల్లీ: ముడి వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కార్ల కంపెనీలు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వాహనాల రేట్లు పెంచుతున్నాయి. తాజాగా హ్యుందాయ్‌ కూడా అదే బాట పట్టింది. జనవరి నుంచి అన్ని మోడల్స్‌ రేట్లను పెంచనున్నట్లు గురువారం వెల్లడించింది. 'పెరుగుతున్న వ్యయాలను కంపెనీ ఇప్పటివరకూ భరిస్తూ వచ్చింది. కానీ ఇప్పుడిక ముడి వస్తువుల రేట్ల పెంపు భారాన్ని వినియోగదారులకు బదలాయించాల్సి వస్తోంది' అని ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, రేట్ల పెంపు ఎంత మేర ఉంటుందనేది మాత్రం వివరించలేదు. మార్కెట్‌ దిగ్గజాలు మారుతి సుజుకీ ఇండియా, టాటా మోటార్స్‌, మెర్సిడెస్‌–బెంజ్‌, ఆడి, రెనో, కియా ఇండియా, ఎంజీ మోటర్‌ మొదలైనవి జనవరి నుంచి ధరలు పెంచబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఐటీ మినహాయింపును రూ.5 లక్షలు చేయాలి

- వినియోగం పెరిగి వృద్ధికి మేలు చేస్తుంది
- ఆర్థిక శాఖకు అసోచామ్‌ సూచన



న్యూఢిల్లీ: వ్యక్తిగత ఆదాయపన్ను కనీస మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని వాణిజ్య మండలి అసోచామ్‌ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ చర్యతో ఆర్థిక వ్యవస్థకు వినియోగ ఊతం లభిస్తుందని పేర్కొంది. వ్యక్తుల వద్ద మరింత ఆదాయం మిగిలి, అది వినియోగంలోకి వస్తుందని అభిప్రాయపడింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వార్షిక ఆదాయంపై ఆదాయపన్ను లేదు. ఆ తర్వాత మరో రూ.2.5 లక్షల ఆదాయంపైనా పన్ను రిబేట్‌ అమల్లో ఉంది. అంటే రూ.5 లక్షల వరకు ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించక్కర్లేదు. ఈ బేసిక్‌ పరిమితిని రూ.5 లక్షలు చేయాలన్నది అసోచామ్‌ డిమాండ్‌. 60–80 ఏళ్లలోపు వారి ఆదాయం రూ.3 లక్షలు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షల వరకు బేసిక్‌ పరిమితి అమల్లో ఉంది. బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక శాఖకు అసోచామ్‌ తన సూచనలు తెలియజేసింది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ఆదాయం దండిగా వస్తున్నందున పన్ను మినహాయింపు పరిమితి పెంచే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందని అసోచామ్‌ ప్రెసిడెంట్‌ సుమిత్‌ సిన్హా పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందన్నారు. స్థిరమైన వృద్ధి మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని అసోచామ్‌ పేర్కొంది. తయారీ రంగంలో కొత్తగా ఏర్పాటయ్యే ప్లాంట్లపై 15 కార్పొరేట్‌ పన్ను అమల్లో ఉండగా, దీన్ని సేవలు సహా అన్ని రంగాలకు వర్తింపచేయాలని కోరింది. జీఎస్‌టీ ఆలస్యపు చెల్లింపులపై రుసుమును 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని డిమాండ్‌ చేసింది.

19 నుంచి ఎస్‌జీబీల ఇష్యూ



న్యూఢిల్లీ: సావరీన్‌ గోల్డ్‌ బాండ్ల (ఎస్‌జీబీ) తదుపరి ఇష్యూ ఈ నెల 19న మొదలై 23న ముగియనుంది. 2022–23లో ఇది మూడో విడత ఇష్యూ. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ వీటిని జారీ చేస్తోంది. అన్ని షెడ్యూల్డ్‌ వాణిజ్య బ్యాంకులు, పోస్టాఫీసులు, స్టాక్‌ ఎక్స్ఛేంజీల ద్వారా ఎస్‌జీబీలను కొనుగోలు చేసుకోవచ్చు. వీటి కాల వ్యవధి ఎనిమిదేళ్లు. పెట్టుబడి నాటికి ప్రకటించిన గ్రాము బంగారం విలువ ఆధారంగా వార్షికంగా 2.5 శాతం వడ్డీ చెల్లింపులు లభిస్తాయి. గడువు తీరిన తర్వాత వచ్చే రాబడి, పెట్టుబడి మొత్తంపై పన్ను ఉండదు. ఒక ఇన్వెస్టర్‌ కనీసం ఒక గ్రాము నుంచి, గరిష్టంగా 4 కిలోల వరకు కొనుగోలు చేసుకోవచ్చు.

ఒడిశాలో పెట్రోనెట్‌ ఫ్లోటింగ్‌ ఎల్‌ఎన్‌జీ టెర్మినల్‌

రూ.2,306 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: దేశీ ద్రవీకృత సహజ వాయువు దిగుమతి దిగ్గజం పెట్రోనెట్‌ ఎల్‌ఎన్‌జీ తాజాగా ఒడిశాలోని గోపాల్‌పూర్‌ పోర్టులో ఫ్లోటింగ్‌ ఎల్‌ఎన్‌జీ రిసీట్‌ టెర్మినల్‌ను (ఎఫ్‌ఎస్‌ఆర్‌యూ) నిర్మించనుంది. దీనిపై సుమారు రూ. 2,306 కోట్లు ఇన్వెస్ట్‌ చేయనుంది. దీనికి సంబంధించి గోపాల్‌పూర్‌ పోర్ట్స్‌ లిమిటెడ్‌తో కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. 2025 ఆఖరు నాటికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా. తూర్పు తీరంలో ఇది మూడో ఎల్‌ఎన్‌జీ టెర్మినల్‌ కానుంది. ఇప్పటికే తమిళనాడులోని ఎన్నూరులో ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌కి ఒక టెర్మినల్‌ ఉండగా, ఫ్రాన్స్‌కి చెందిన టోటల్‌ ఎనర్జీ సంస్థ భాగస్వామ్యంతో అదానీ గ్రూప్‌ .. ఒడిశాలోని ధామ్రా పోర్టులో ఒకటి నిర్మిస్తోంది. రవాణా చేసేందుకు అనుకూలంగా ఉండేలా అత్యంత



చల్లబర్చి, ద్రవ రూపంలోకి మార్చిన సహజ వాయువును ఎల్‌ఎన్‌జీగా వ్యవహరిస్తారు. దీన్ని రిసీట్‌ టెర్మినల్‌లో తిరిగి గ్యాస్‌ రూపంలోకి మార్చి ఎరువుల ఫ్యాక్టరీలు, విద్యుదుత్పత్తి ప్లాంట్లు మొదలైన వాటికి సరఫరా చేస్తారు. వాహనాల్లో సీఎన్‌జీ ఇంధనంగా కూడా వాడతారు. ప్రస్తుతం పెట్రోనెట్‌కు ల్యాండ్‌ ఆధారిత ఎల్‌ఎన్‌జీ టెర్మినల్స్‌ రెండు ఉన్నాయి. ఒకటి గుజరాత్‌లోని దహేజ్‌లో ఉండగా, రెండోది కేరళలోని కొచ్చిలో ఉంది. వీటి ప్రస్తుత సామర్థ్యం 22.5 మిలియన్‌ టన్నులుగా ఉంది. దహేజ్‌ టెర్మినల్‌ను పెట్రోనెట్‌ మరింతగా విస్తరిస్తోంది. నీటిపై తేలియాడే ఎఫ్‌ఎస్‌ఆర్‌యూను కూడా భవిష్యత్తులో ల్యాండ్‌ ఆధారిత టెర్మినల్‌గా మార్చే యోచన ఉన్నట్లు పెట్రోనెట్‌ గతంలో తెలిపింది.

రూపాయిపై 'ఫెడ్‌ వడ్డీ పెంపు' ఒత్తిడి

27 పైసలు నష్టపోయి 82.76 వద్ద ముగింపు



ముంబై: డాలర్‌ మారకంలో రూపాయి విలువ గురువారం 27 పైసలు క్షీణించి 82.76 వద్ద స్థిరపడింది. ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీరేట్ల పెంపుతో పాటు భవిష్యత్తులోనూ పెంపు ఉంటుందని చైర్మన్‌ పావెల్‌ సంకేతాలతో అంతర్జాతీయంగా డాలర్‌ విలువ బలపడింది. భారత మార్కెట్‌లో విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు దేశీయ కరెన్సీపై ఒత్తిడిని పెంచాయి. ఉదయం రూపాయి 82.63 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 82.77 వద్ద కనిష్టాన్ని, 82.41 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. రానున్న రోజుల్లో 82.20 – 83.05 శ్రేణిలో ట్రేడొచ్చని ఫారెక్స్‌ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

16-12-2022	
విశాఖ	547–00
చిత్తూరు	543–00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	534–00
విజయవాడ	534–00
రిటైల్‌ ధర (డజను)	78.00
15-12-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	524–00
వరంగల్‌	526–00
రిటైల్‌ ధర	5.80

సూచీలకు 'ఫెడ్‌' షాక్‌

- మార్కెట్‌ను ముంచేసిన వడ్డీరేట్ల పెంపు సంకేతాలు
- సెన్సెక్స్‌ 879 పాయింట్లు క్రాష్‌
- నిఫ్టీ నష్టం 245 పాయింట్లు
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలే
- ఇన్వెస్టర్లకు రూ.2.89 లక్షల కోట్ల నష్టం



ముంబై: అమెరికా ఫెడరల్‌ రిజర్వ్‌ బ్యాంకు పాలసీ కమిటీ తీసుకున్న ద్రవ్య విధాన నిర్ణయాలు ఈక్విటీ మార్కెట్లు ముంచేశాయి. ఫారెక్స్‌ మార్కెట్లో రూపాయి క్షీణత సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచింది. ట్రేడింగ్‌ ఆద్యంతం అన్ని రంగాల షేర్లలో అమ్మకాల సునామీ తలెత్తడంతో గురువారం సెన్సెక్స్‌ 879 పాయింట్లు నష్టపోయి 61,799 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 245 పాయింట్లు పతనమైన 18,415 వద్ద నిలిచింది. బ్యాంకింగ్‌, ఆర్థిక, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. విస్తృత స్థాయి మార్కెట్లో అమ్మకాలతో బీఎస్‌ఈ మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ ఇండెక్సులు దాదాపు ఒకశాతం నష్టపోయాయి. సెన్సెక్స్‌ సూచీలో 30 షేర్లలో కేవలం మూడు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.711 కోట్ల ఈక్విటీ షేర్లు విక్రయించగా, దేశీ ఇన్వెస్టర్లు రూ.261 కోట్ల షేర్లను కొన్నారు.

ఆద్యంతం అమ్మకాలే

ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్‌ ఉదయం నష్టాలతో మొదలైంది. సెన్సెక్స్‌ 131 పాయింట్ల పతనంతో 62,530 వద్ద, నిఫ్టీ 46 పాయింట్లు పతనమై 18,614 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల ప్రభావంతో ఇన్వెస్టర్లు ట్రేడింగ్‌ ఆద్యంతం అమ్మకాలకే మొగ్గ చూపారు. ట్రేడింగ్‌ గడుస్తున్న కొద్దీ విక్రయాల తీవ్రత పెరుగుతుండటంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఓ దశలో సెన్సెక్స్‌ 962 పాయింట్లకు పైగా పతనమై.. 61,716 వద్ద, నిఫ్టీ 272 పాయింట్లను కోల్పోయి 18,388 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి.

నష్టాలు ఎందుకంటే...

- అంచనాలకు తగ్గట్టే ఫెడ్‌ కీలక వడ్డీరేట్లను 0.50 బేసిస్‌ పాయింట్లే పెంచినప్పటికీ.., ద్రవ్యోల్బణ కట్టడికి కొంతకాలం పాటు కఠిన ద్రవ విధాన వైఖరి తప్పదనే సంకేతాలివ్వడంతో ఈక్విటీ మార్కెట్లు బేర్‌మన్నాయి. అలాగే 2023 జీడీపీ వృద్ధి పరిమితంగా ఉండొచ్చనే అంచనాలు మరింత నిరాశపరిచాయి.
- ఫెడ్‌ వడ్డీరేట్ల పెంపుతో ఆర్థిక మాంద్య భయాలు మరోసారి తెరపైకి వచ్చాయి. అమెరికా మార్కెట్లు బుధవారం రాత్రి 0.50% నుంచి ఒకశాతం నష్టపోయాయి. అక్కడి నుంచి ప్రతికూల సంకేతాలు అందిపుచ్చుకున్న ఆసియా ఒకటిన్నర శాతం పతనమయ్యాయి. యూరప్‌ మార్కెట్లు ఏకంగా రెండు శాతం క్షీణించాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్ల పైనా పడింది.
- వారాంతపు ఫ్యూచర్స్‌ అండ్‌ ఆప్షన్స్‌ ఎక్స్‌పైరీ కూడా కావడంతో సూచీలు మరింత ఒడిదుడుకులకు లోనయ్యాయి. అధిక వెయిటేజీ కలిగిన ఐటీ, మెటల్స్‌, బ్యాంకింగ్‌, ఆర్థిక రంగాల షేర్ల తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.
- వడ్డీరేట్ల పెంపుతో డాలర్‌ విలువ బలపడింది. బాండ్లపై రాబడులు కూడా పెరిగాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ రికవరీ బాట పట్టింది. మరోవైపు విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి ఈ డిసెంబర్‌లోనే రూ. 5 వేల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామాలు మార్కెట్‌ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

ఒక్క రోజులో రూ.2.89 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్‌ సూచీల ఒకటిన్నర శాతం పతనంతో ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీల మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ గురువారం రూ.2.89 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. తద్వారా ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో మొత్తం కంపెనీల విలువ రూ.288.36 లక్షల కోట్లకు దిగివచ్చింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ ఫెర్టిలైజర్స్‌ కంపెనీల షేర్లకు డిమాండ్‌ నెలకొంది. కేంద్రం త్వరలో ఎరువులపై భారీ రాయితీలను ప్రకటించవచ్చనే వార్తలతో ఈ షేర్లు రాణించాయి. మద్రాస్‌ ఫెర్టిలైజర్స్‌, నేషనల్‌ ఫెర్టిలైజర్స్‌, మంగళూరు కెమికల్స్‌, ఖైతాన్‌ కెమికల్స్‌, రాష్ట్రీయ కెమికల్స్‌తో పాటు ఆయా కంపెనీలకు చెందిన షేర్లు 18–10% చొప్పున లాభపడ్డాయి.
- ఐఆర్‌సీటీసీలో ప్రభుత్వం 5 శాతంవరకూ వాటా విక్రయం నిర్ణయం ప్రతికూల ప్రభావాన్ని చూపింది. బీఎస్‌ఈలో ఈ షేరు ఆరున్నర శాతం నష్టపోయి రూ.687 వద్ద నిలిచింది.

ఐఆర్‌సీటీసీ ఓఎఫ్‌ఎస్‌ సక్సెస్‌

- సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి 3 రెట్లు బిడ్స్‌
- నేడు రిటైల్‌ ఇన్వెస్టర్లకు విండో ఓపెన్‌



న్యూఢిల్లీ: రైల్వే రంగ పీఎస్‌యూ దిగ్గజం ఐఆర్‌సీటీసీ ఆఫర్‌ ఫర్‌ సేల్‌(ఓఎఫ్‌ఎస్‌)కు సంస్థాగత ఇన్వెస్టర్లు క్యూ కట్టారు. రెండు రోజుల ఓఎఫ్‌ఎస్‌లో భాగంగా ప్రభుత్వం 2.5 శాతం వాటాకు సమానమైన 2 కోట్ల షేర్లను ప్రాథమికంగా విక్రయానికి ఉంచింది. వీటిలో 10 శాతం రిటైల్‌ ఇన్వెస్టర్లకు రిజర్వ్‌ చేసింది. ఈ కోటా నేడు(శుక్రవారం) ఓపెన్‌ కానుండగా.. గురువారం సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి 3.08 రెట్లు అధికంగా బిడ్స్‌ దాఖలయ్యాయి. ప్రభుత్వం 1.8 కోట్ల షేర్లు ఆఫర్‌ చేయగా.. 5.55 కోట్ల షేర్ల కోసం బిడ్స్‌ లభించాయి. వీటి విలువ రూ. 3,800 కోట్లు! అయితే ఇన్వెస్టర్ల స్పందన ఆధారంగా ప్రభుత్వం మొత్తం 5 శాతం వాటాకు సమానమైన 4 కోట్ల షేర్లను విక్రయించనున్న సంగతి తెలిసిందే. ఓఎఫ్‌ఎస్‌కు ఫ్లోర్‌ ధర రూ. 680కాగా.. బీఎస్‌ఈలో షేరు 6.2 శాతం పతనమై రూ. 689 వద్ద ముగిసింది. బుధవారం ముగింపు ధర రూ. 735తో పోలిస్తే ఓఎఫ్‌ఎస్‌ ధర 7% తక్కువకావడం గమనార్హం! కంపెనీలో కేంద్ర ప్రభుత్వానికి 67.4 శాతం వాటా ఉంది.

సినిమా

• ఇయర్‌ రౌండప్‌

బాలీవుడ్‌ రమ్మంది...

మామూలుగా ఉత్తరాది తారలు దక్షిణాదికి ఎక్కువగా వస్తుంటారు. ఈసారి కూడా నార్త్‌ నుంచి చాలామంది వచ్చారు. అలాగే సౌత్‌ నుంచి కూడా నార్త్‌కి వెళ్లారు. మన స్టార్స్‌ని బాలీవుడ్‌ రమ్మంది. ఈ ఏడాది హిందీ తెరపై కనిపించిన కొందరు సౌత్‌ స్టార్స్‌ గురించి తెలుసుకుందాం.


• నాగచైతన్య


• విజయ్‌ దేవరకొండ

కెరీర్‌లో ఇరవైకి పైగా సినిమాలు చేసిన నాగచైతన్య నటించిన తొలి హిందీ చిత్రం 'లాల్‌సింగ్‌ చడ్డా'. ఆమిర్‌ ఖాన్‌ టైటిల్‌ రోల్‌ చేసిన ఈ చిత్రంలో నాగచైతన్యది కీ రోల్‌. ఈ హిందీ చిత్రంలో గుంటూరుకు చెందిన తెలుగు కుర్రాడు బాలరాజు పాత్రను చేశారు నాగచైతన్య. అద్వైత్‌ చందన్‌ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదలైంది. ఇక విజయ్‌ దేవరకొండ హిందీ ప్రేక్షకులకు పరిచయం అయిన చిత్రం 'లైగర్‌'. బాక్సింగ్‌ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రానికి పూరి జగన్నాథ్‌ దర్శకత్వం వహించారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 25న విడుదలైంది. మరో హీరో అడివి శేష్‌ 'మేజర్‌'తో హిందీ తెరకు పరిచయం అయ్యారు. 'గూఢచారి' చిత్రం తర్వాత హీరో అడివి శేష్‌, దర్శకుడు శశికిరణ్‌ తిక్క కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'మేజర్‌'. ముంబై 26/11 దాడుల్లో వీరమరణం పొందిన అమరవీరుడు ఎన్‌ఎస్‌జీ (నేషనల్‌ సెక్యూర్టీ గార్డు) కమాండో సందీప్‌ ఉన్నికృష్ణన్‌ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో తెరకెక్కించారు. ఈ చిత్రం జూన్‌ 3న విడుదలైంది. అలాగే ఏపీ (ఆంజనేయ పుష్పక్‌ కుమార్‌)గా హిందీ ప్రేక్షకులకు హాయ్‌ చెప్పారు సత్యదేవ్‌. అక్టోబరు 25న రిలీజైన 'రామసేతు'లోనే ఏపీగా సత్యదేవ్‌ కీ రోల్‌ చేశారు. అక్షయ్‌కుమార్‌ హీరోగా నటించిన ఈ సినిమాకు అభిషేక్‌ శర్మ దర్శకుడు. అయితే బాలీవుడ్‌కు కీలక పాత్ర ద్వారా కాకుండా సత్యదేవ్‌ హీరోగా పరిచయం కావాల్సింది. ఆఫ్ఘనిస్తాన్‌ బ్యాక్‌డ్రాప్‌లో జెన్నిఫర్‌ డైరెక్షన్‌లో ఆరంభమైన ఓ హిందీ చిత్రంలో సత్యదేవ్‌ హీరోగా కమిట్‌ అయ్యారు. కొంత షూటింగ్‌ జరిగాక ఈ సినిమా ఆగిపోయింది. దీంతో 'రామసేతు' సత్యదేవ్‌కి తొలి హిందీ చిత్రంగా నమోదైంది.

ఇక హీరోయిన్ల విషయానికి వస్తే... రష్మికా మందన్నా బాలీవుడ్‌ ఎంట్రీ 'గుడ్‌ బై' చిత్రంతో కుదిరింది. అమితాబ్‌ బచ్చన్‌, రష్మికా మందన్నా, నీనా గుప్తా ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం అక్టోబరు 7న విడుదలైంది. ఆసక్తికర విషయం ఏంటంటే... రష్మిక కెరీర్‌లో రిలీజైన తొలి హిందీ చిత్రం 'గుడ్‌ బై' అయినప్పటికీ ఆమె సైన్‌ చేసిన తొలి హిందీ చిత్రం మాత్రం 'మిషన్‌ మజ్ను'. సిద్ధార్థ్‌ మల్హోత్రా, రష్మిక హీరో హీరోయిన్లుగా శాంతను బాగ్చీ తెరకెక్కించిన 'మిషన్‌ మజ్ను' డైరెక్టర్‌గా నెట్‌ఫ్లిక్స్‌ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో జనవరి 20 నుంచి స్ట్రీమింగ్‌ కానుంది. ఇక 'అర్జున్‌రెడ్డి' ఫేమ్‌ షాలినీ పాండే ఓ లీడ్‌ యాక్ట్రస్‌గా హిందీ తెరకు పరిచయమైంది కూడా ఈ ఏడాదే. రణ్‌వీర్‌ సింగ్‌ హీరోగా దివ్యాంగ్‌ ఠక్కర్‌ దర్శకత్వంలో ఈ ఏడాది మేలో రిలీజైన 'జయేష్‌ భాయ్‌ జోర్దార్‌'లో నటించారు షాలిని.


• సత్యదేవ్‌


• అడివి శేష్‌

2023లో...

ఇక కొందరు తారల బాలీవుడ్‌ జర్నీ కూడా ఈ ఏడాది ఆరంభమైంది. కానీ వచ్చే ఏడాదే వారు హిందీ తెరపై కనిపించనున్నారు. కెరీర్‌లో డెబ్బై చిత్రాలు చేశాక బాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు నయనతార. షారుక్‌ ఖాన్‌ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న 'జవాన్‌' హిందీలో నయనతారకు తొలి చిత్రం. ఇటు అట్లీ చేస్తున్న తొలి హిందీ ఫిల్మ్‌ కూడా 'జవాన్‌' కావడం విశేషం. ఈ సినిమా వచ్చే జూన్‌ 2న రిలీజ్‌ కానుంది. ఇక 2005లో వచ్చిన తెలుగు 'ఛత్రపతి' హిందీ రీమేక్‌లో హీరోగా నటిస్తున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌. వీవీ వినాయక్‌ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్‌ కానుంది. మరోవైపు హీరో వరుణ్‌ తేజ్‌ బాలీవుడ్‌ ప్రయాణం ఈ ఏడాది నవంబరులో మొదలైంది. హిందీ, తెలుగు భాషల్లో తెరకెక్కనున్న సినిమాకు వరుణ్‌తేజ్‌ గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు. ఈ సినిమాకి శక్తి ప్రతాప్‌సింగ్‌ దర్శకుడు. మరికొందరు స్టార్స్‌ కూడా వచ్చే ఏడాది హిందీ తెరపై కనిపించనున్నారు.


• రష్మికా మందన్నా

నాకు మరో మంచి సినిమా - వీఎన్‌ ఆదిత్య


''డబ్బున్నవారి కంటే చదువుకున్న నిర్మాతలు ఇండస్ట్రీకి వస్తే బాగుంటుంది. అర్జున్‌ దాస్యన్‌ అలాంటి నిర్మాతే. నా కెరీర్‌లో బెస్ట్‌ ప్రొడ్యూసర్‌. ఇక ఈ చిత్రంలో రెండు షేడ్స్‌ ఉన్న పాత్రను విరాజ్‌ అశ్విన్‌ బాగా చేశాడు. సహజత్వానికి దగ్గరగా ఉండే ప్రేమకథా చిత్రం ఇది. నాకు మరో మంచి సినిమా అవుతుంది'' అని వీఎన్‌ ఆదిత్య అన్నారు. విరాజ్‌ అశ్విన్‌, నేహా కృష్ణ జంటగా వీఎన్‌ ఆదిత్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వాళ్లిద్దరి మధ్య'. అర్జున్‌ దాస్యన్‌ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం నుంచి 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్‌ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో అర్జున్‌ దాస్యన్‌ మాట్లాడుతూ – ''కుటుంబం అంతా కలిసి చూసేలా మంచి చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు. ''వాళ్లిద్దరి మధ్య' మంచి యూత్‌ఫుల్‌ ఎంటర్‌టైనర్‌'' అన్నారు 'ఆహా' శ్రీనివాస్‌. ''ఆదిత్యగారు ఇచ్చిన ధైర్యంతో రెండు షేడ్స్‌ ఉన్న పాత్రని చేయగలిగాను'' అన్నారు విరాజ్‌ అశ్విన్‌.


• విరాజ్‌ అశ్విన్‌, వీఎన్‌ ఆదిత్య


• బాలకృష్ణ శ్రుతీహాసన్‌

బాలకృష్ణ, శ్రుతీహాసన్‌ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. గోపీచంద్‌ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌ పతాకంపై నవీన్‌ యెర్నేని, వై. రవిశంకర్‌ నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఈ చిత్రంలోని రెండో పాట 'సుగుణ సుందరి..' లిరికల్‌ వీడియోను గురువారం విడుదల చేశారు. తమన్‌ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, రామ్‌ మిరియాల, స్నిగ్ధ ఆలపించారు.

అప్పుడు మేం సక్సెస్‌ అయినట్లే!


• రాఘవేంద్ర రెడ్డి

ఇంద్రసేన హీరోగా వేణు మడికంటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శాసనసభ'. ఇందులో ఐశ్వర్యా రాజ్‌ బకుని హీరోయిన్‌. తులసీరామ్‌ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ ప్లే, డైలాగ్స్‌ అందించిన రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ– ''పొలిటికల్‌ జర్నలిస్టుగా కెరీర్‌ స్టార్ట్‌ చేశాను. ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలో రైటర్‌ అవ్వాలనుకున్నాను. అయితే ఇండస్ట్రీలో అవకాశాలు అంత సులభం కాదని తెలిసింది. దీంతో సినిమా జర్నలిస్ట్‌గా, పీఆర్వోగా, టీవీ చానెల్స్‌కు శాటిలైట్‌ కన్సల్టెంట్‌గా చేశాను. ఇలా ఇండస్ట్రీలో నాకంటూ కొంత గుర్తింపు లభించడంతో రచయితగా కెరీర్‌ ఆరంభించాలనుకున్నాను. నా ఫ్రెండ్‌ ఇంద్రసేన కోసమే ఈ సినిమా కథ రాశాను. రాజకీయ ఘటనల ఆధారంగా ఈ సినిమా కథ రాసినప్పటికీ ఇది ఏ రాజకీయ పార్టీ గురించిన సినిమా కాదు. 'శాసనసభ' అంటే పవిత్రమైన దేవాలయంతో సమానం. అటువంటి శాసనసభ గొప్పతనాన్ని ఈ తరంవారికి ఈ సినిమాతో చెప్పాలనుకుంటున్నాను. యువతలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఓటర్లు పవిత్రమైన ఓటును అమ్ముకోకూడదు. ఈ సినిమా వల్ల కనీసం కొంతమంది ఆలోచించినా, ఇద్దరు, ముగ్గురు మారినా మేం సక్సెస్‌ అయినట్లుగా భావిస్తాను. దర్శకుడు వేణు ఈ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. ఇక నేను ఏ జానర్‌లో అయినా కథలు రాయగలను. అయితే కమర్షియల్‌ అంశాలు ఉండేలా చూసుకుంటాను. ప్రస్తుతం ఓ ఇన్వెస్టిగేటివ్‌ థ్రిల్లర్‌, ఓ క్రైమ్‌ సబ్జెక్ట్‌కు కథలు అందించాను'' అని అన్నారు.

ప్రతిభకు అదృష్టం తోడవ్వాలి - సుమన్‌

కాయగూరల సాయిచరణ్‌, పల్లవి, ట్రాన్సీ హీరోహీరోయిన్లుగా జీఎల్‌బీ శ్రీనివాస్‌ దర్శకత్వంలో కాయగూరల లక్ష్మీపతి నిర్మిస్తున్న చిత్రం 'ఐక్యూ'. సుమన్‌, సూర్య, బెనర్జీ ఇందులో కీ రోల్స్‌ చేశారు. ఈ సినిమా ఫస్ట్‌ కాపీ రెడీ అయింది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో సుమన్‌ మాట్లాడుతూ– ''ప్రతిభ ఉన్నప్పటికీ ఇండస్ట్రీలో రాణించాలంటే అదృష్టం కూడా తోడవ్వాలి. నేనిప్పటివరకు 700 చిత్రాల్లో నటించాను. నన్ను ప్రోత్సహించిన నా తల్లిదండ్రులకు, అవకాశాలు కల్పించిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు. లక్ష్మీపతిగారు ప్యాషనేట్‌ ప్రొడ్యూసర్‌'' అన్నారు. ''ఐక్యూ' సక్సెస్‌ఫుల్‌గా పూర్తి కావడంతో మా బ్యానర్‌లో రెండో సినిమా ప్రకటిస్తున్నాం. ఇందులో భూషణ్‌ హీరో. అలాగే సుమన్‌గారు మెయిన్‌ లీడ్‌గా మూడో సినిమా చేయాలనుకుంటున్నాం'' అన్నారు కాయగూరల లక్ష్మీపతి. ''ఇదే బ్యానర్‌లో నా రెండో సినిమా కూడా ఖరారు కావడం హ్యాపీగా ఉంది'' అన్నారు దర్శకుడు శ్రీనివాస్‌.


• సుమన్‌, భూషణ్‌


• సిజు విల్సన్‌, కాయాదు లోహర్‌, వినయన్‌

ఓ వీరుడి కథ

సిజు విల్సన్‌ ప్రధాన పాత్రలో కాయాదు లోహర్‌ కథానాయికగా తెరకెక్కిన మలయాళ చిత్రం 'పాథోన్‌పథం నూట్టండు'. వినయన్‌ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిర్మాత సీహెచ్‌ సుధాకర్‌ బాబు 'పులి' టైటిల్‌తో తెలుగులో విడుదల చేస్తున్నారు. 'ది నైన్‌టీన్త్‌ సెంచరీ' అనేది ఉపశీర్షిక. గురువారం జరిగిన ఈ చిత్రం టీజర్‌ లాంచ్‌ ఈవెంట్‌లో సుధాకర్‌ బాబు మాట్లాడుతూ– ''సమాజంలో అసమానతలపై పోరాడిన ఓ వీరుడి కథ ఇది. అనంతపద్మనాభ స్వామి నగలకు సంబంధించిన చరిత్ర కూడా ప్రధానాంశం. దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశారు. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్‌' స్థాయిలో 'పులి' సినిమా ఉంటుంది. ఈ చిత్రంపై ఉన్న ఆసక్తితో నా స్నేహితుడు ప్రసాద్‌ సహనిర్మాతగా ఉన్నారు'' అని తెలిపారు. ఎస్‌.కె. ప్రసాద్‌ నాయక్‌ మాట్లాడుతూ– ''కథ, స్టన్నింగ్‌ మ్యూజిక్‌, దర్శకత్వం.. ఇలా ఈ సినిమాలో అన్నీ అద్భుతం. విజువల్‌ ఫీస్ట్‌లా ఉంటుంది'' అన్నారు. ''ఇది నిజ జీవిత కథతో రూపొందిన సినిమా. తెలుగు ప్రేక్షకులకూ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సిజు విల్సన్‌. డైరెక్టర్‌ వినయన్‌ మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ కోసం ఎంతో పరిశోధన చేశాం. కేరళ చరిత్రలో దాగున్న కథ ఇది. సమాజంలోని ఒక దారుణానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుడి కథ'' అన్నారు. ఈ చిత్రం టీజర్‌ అద్భుతంగా ఉందని ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న నిర్మాత కేఎల్‌ దామోదర్‌ ప్రసాద్‌ అన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.